ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-2-2026 మంగళవారం సంపుటి: 31 సంచిక: 363 పేజీలు: 10+4 వెల: 6.50




## దేశభక్తులెవరో ప్రజలకు తెలుసు

రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడ

స్పీకర్ జోక్యం, మైక్‌కట్ చేసిన ఓంబిర్లా

5

ప్రకటించిన ట్రంప్

వాణిజ్య ఒప్పందానికి ఓకే



## భారత్‌పై సుంకాలు 18%కి తగ్గింపు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** భారత్ అమెరికాలమధ్య వాణిజ్యడీల్‌కు పరస్పర అంగీకారం కుదిరిందని, ఇపుడు ప్రతీకార సుంకాలను తగ్గిస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించారు.ప్రస్తుతం భారత్‌పై విధించిన 25 శాతం సుంకాలను 18శాతానికి తగ్గిస్తామని ఆయనట్రూత్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. అంతకుముందే ట్రంప్ ప్రధానిమోడీతో ఫోన్‌లోమాట్లాడారని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియోగోర్ వెల్లడించారు. ఆయన తన ఎక్స్‌పోస్టులో స్టేట్యూన్డ్ అటూ ఆసక్తికర వ్యాఖ్యలు కూడాచేసారు. అయితే ఇరువురునేతలు ఏవిషయంపై మాట్లాడారన్న వివరాలు వెల్లడికాలేదు. బహుశా భారత్ అమెరికావాణిజ్య ఒప్పందంపైనే అయింటుందన్న ప్రచారంజరిగింది. అనుకున్నట్లుగానే ట్రంప్ తన సోషల్‌మీడియాలో భారత్ అమెరికాలమధ్య వాణిజ్యఒప్పందానికి అంగీకారం కుదిరిందని, ప్రస్తుతం భారత్ దిగుమతులపై విధించిన 25 శాతం సుంకాలను 18శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఓపక్క భారత్‌యూరోప్‌ల మధ్య >>2



సోమవారం మీడియాతో ద.మ రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్

## ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేకు రూ.10,134 కోట్లు

### పురోగతిలో రూ. 92,649 కోట్ల పనులు

### వివరాలు వెల్లడించిన ద.మ రైల్వే జిఎం శ్రీవాస్తవ


**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం 2026- 27 సంవత్సరానికి గరిష్ట స్థాయిలో రూ. 10,134 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై సోమవారం వర్చువల్ గా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మరియు ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2026- 2027 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ. 10,134 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. 200914 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ.886 కోట్లు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు ఉమ్మడి రాష్ట్రానికి 2009- 14 మధ్యకాలంలో జరిగిన >>2

# తప్పుచేస్తే శిక్ష తప్పదు

### రాష్ట్రంలో హింసను రెచ్చగొట్టేందుకు వైసిపి కుట్ర

### ఆ పార్టీ ఉచ్చులో పడకండి

### ఇసుకను మొత్తం దోచింది వైసిపీయే



### తిరుమల లడ్డూ కల్తీలో అడ్డంగా దొరికిన వైసీపి

### అధిక పెట్టుబడులు సాధించడమే అజెండా

### టిడిపి సీనియర్ నేతలతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**విజయవాడ,ఫిబ్రవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి ఎక్కువగా పెట్టుబడులను సాధించి అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని సీఎం చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. దీనిని చెడగొట్టేందుకు వైఎస్సార్సీపీ శతవిధాలా యత్నిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తప్పు చేసిన ప్రతీ ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ బూతు మాటలపై టీడీపీ శ్రేణుల నిరసనలు ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో తెలుగుదేశం సీనియర్ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైఎస్సార్సీపీ కుట్రలు పన్నుతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయామనే అసహనంతో ఆ పార్టీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, వారు చేసిన పాపాల నుంచి పక్కదారి పట్టించాలని చూస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ ట్రాప్‌లో మనవాళ్లు పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలు సంయమనం పాటించేలా సీనియర్ మంత్రులు, నేతలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్‌కు స్పష్టం చేయాలని నేతలను ఆదేశించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులతో పుట్టిన వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని సీఎం చంద్రబాబు వివరించారు. మన పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్‌కు స్పష్టం చేయాలని ఆదేశించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా దొరికిపోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారని తెలియజేశారు. చేసిన పాపాలను దారి మళ్లించాలనేది వైఎస్సార్సీపీ కుట్ర >>2



## జోగి రమేష్‌కు భద్రత కల్పించండి

### హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఫిబ్రవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి భద్రత కల్పించాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఎవ్వరిపై కేసులు నమోదు చేసింది వెల్లడించాలని కోరింది. బాధితుల వాదన,సాక్ష్యాలను పరిగణనలోనికి తీసుకోవాలని సూచించింది. తన భద్రత విషయమై ఎపి హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం లోని తన నివాసంపై >>2

## వైసిపి ట్రాప్‌లో పడొద్దు

### ప్రత్యర్థులపై సిద్ధాంతపరంగానే విమర్శలు చేయండి

### త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ

### అరవ శ్రీధర్‌పై త్రిసభ్య కమిటీ.. నివేదిక ప్రకారం చర్యలు: డి.సిఎం పవన్





**విజయవాడ,ఫిబ్రవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రత్యర్థి రాజకీయపక్షాలపై సిద్ధాంతపరంగానే విమర్శలు చేయాలని,సున్నిత పరిస్థితులకు ఆస్కారం కల్పించవద్దని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనసేన కార్యకర్తలకు మార్గదర్శనం చేసారు. వైఎస్సార్సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పి కొట్టడం లేదు. మహిళల విషయంలో పార్టీ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలి. మహిళలకు మీ చేయి తగిలినా రేప్ చేశారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తారు. వైఎస్సార్సీపీ నేతల ట్రాప్‌లో చిక్కుకోవద్దు. అన్నింటికీ నేనే మాట్లాడితే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నది ఎందుకు? జనసేన నేతలు మాత్రం సిద్ధాంతపరంగా, సబ్జెక్ట్ పరంగా మాట్లాడాలన్నారు.. త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతలపై అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పి కొట్టడం లేదని నేతలను ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ నేతల ట్రాప్‌లో పడొద్దని నేతలను పవన్ హెచ్చరించారు. మహిళల విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఆడపిల్లలకు తమ చేయి తగిలినా రేప్ చేశారని ప్రచారం చేస్తారన్నారు. అన్నింటికీ తానే మాట్లాడితే ఇక ఎమ్మెల్యేలు, మంత్రులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎందుకని ప్రశ్నించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీని ప్రజలకు వివరించి వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని జనసేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. చుక్క పాలు లేకుండా నెయ్యి సరఫరా చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తీసిన వైఎస్సార్సీపీ నేతలు సిగ్గు లేకుండా >>2

## ఇది జంగిల్ రాజ్యమా!

### చంద్రబాబు సర్కార్ దుర్మార్గాలను జాతీయ స్థాయికి తీసుకెళ్తాం

### మీడియాతో సజ్జల, బొత్స, పేర్నినాని



సోమవారం తాడేపల్లిలో మీడియాతో సజ్జల తదితరులు

**విజయవాడ,ఫిబ్రవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని జంగిల్ రాజ్ చేశారని, చంద్రబాబు సర్కారు దుర్మార్గాలను జాతీయ స్థాయిలో తీసుకెళ్తామని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ.ఇతర వైయస్సార్ సీపీ కీలకనేతలు స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న సీనియర్ నేతలు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. పార్టీస్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో నేతలు భేటీ అయ్యారు. దాదాపు రెండున్నర గంటలు జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు, అంబటిపై హత్యాయత్నం ఘటనలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో శాంతి కప్పకూలిపోయాయి. రాష్ట్రం జంగిల్‌రాజ్‌గా మారిపోయింది. చంద్రబాబు దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. రాష్ట్రంలో పరిణామాలను జాతీయ స్థాయిలోనూ వివరించాలి. ఎండగట్టాలి. తిరుమల శ్రీవారి భక్తుల మనసులను చంద్రబాబు గాయపర్చారు. ఇప్పటికీ తప్పులు సరిదిద్దుకోవడంలేదు. చంద్రబాబుకు ఏ మాత్రమైనా పాపభీతి ఉంటే, వెంటనే క్షమాపణ చెప్పాలి. చంద్రబాబు తప్పులను ప్రశ్నిస్తున్నందుకు వైయస్సార్సీపీపై మరోసారి కుట్ర చేశారు. మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు మాజీ మంత్రులు, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై దాడులు చేశారు. అంబటి రాంబాబుపై హత్యాయత్నం చేశారు. భయపెడితే తనను ఎవ్వరూ ప్రశ్నించరని చంద్రబాబు అనుకుంటున్నారు. కానీ, అది ఆయన అవివేకం. రాష్ట్రంలో వ్యవస్థలను చంద్రబాబు పూర్తిగా దెబ్బతీశారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పూర్తిగా చెడిపోయింది. రక్షణకోసం గంటలతరబడి ఫోన్లు చేసినా పోలీసు అధికారులు స్పందించడం లేదు. ఇక సామాన్యులకు ఏం రక్షణ కల్పిస్తారు? పైగా బాధితులపైనే కేసులు పెడుతున్నారు. అంబటి రాంబాబుఇంటిపై ఆస్థాయిలో దాడి జరిగినా, ఇప్పటివరకూ ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. >>2



## ప్రతీ కుటుంబానికి రూ.25లక్షల వైద్య బీమా

### మంత్రి సత్యకుమార్

**ఎస్.కోట (విజయనగరంజిల్లా), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో సమర్థవంతమైన, సంపూర్ణమైన ఆరోగ్యవ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రతీ కుటుంబానికి రూ. 25 లక్షల విలువైన వైద్య బీమాను కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపకల్పన చేశారని >>2

# ఆంధ్ర టూ ఒరిస్సా రైస్.. ఒరిస్సా టూ ఆంధ్ర గంజా!



అక్రమంగా పట్టుకున్న గంజాయితో పోలీసులు

### రహస్యంగా అక్రమ రవాణా...

### కరవైన అధికారుల నిఘా

**సాలూరు, (పార్వతీపురం మన్యం జిల్లా ) పిబ్రవరి 2 ప్రభాతవార్త :** సర్కార్ ద్వారా పేదలకు అందవలసిన టన్నుల కొలది పీడీఎస్ బియ్యం ఆంధ్ర నుంచి ఒరిస్సాకు అక్రమంగా రవాణా అయిపోతున్నాయి. బంగారు భవిష్యత్ ఉన్న యువత జీవితాలను నాశనం చేసే గంజాయి ఒరిస్సా నుంచి ఆంధ్రతో పాటు ఇతర రాష్ట్రాలకు హద్దులు దాటి రవాణా సాగిపోతుంది. దీని వెనుక పెద్ద రాకెట్ నడుస్తోందని తెలుస్తోంది. ఇంత జరుగుతున్న ఇటు బియ్యం రవాణాన్ని గాని, అటు గంజాయి రవాణాన్ని పోలీస్, విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులు నియంత్రించలేకపోతుండడం పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అక్రమార్కులకు పోలీసులే తెరవెనుక స్నేహ హస్తం అందిస్తున్నారా? లేదంటే అక్రమ రవాణా దారులు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారా అనేఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం, గంజాయి అక్రమ రవాణా నిత్యం సాగుతున్న అధికారులు అప్పుడప్పుడు మాత్రమే >>2



## ఎపికి హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్

### అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే ప్రయాణం!

**విజయవాడ.ఫిబ్రవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తున్నాయి.ఏ ఇతర రాష్ట్రంలో లేనట్లుగా వేగవంతమైన రైళ్ళు విజయవాడ.విశాఖ తదితర నగరాలకు నడమ ప్రయాణం చేయనున్నాయి.ఏపీ మీదుగా ప్రధాన నగరాలకు పలు బుల్లెట్ రైళ్ళు రానున్నాయి.దేశంలోని వివిధ నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను >>2



న్యూఢిల్లీలోని అనుసంధాన్ భవన్‌లో కేంద్ర బడ్జెట్2026పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

# భద్రత కల్పించండి

>> టిడిపి కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ .. తనకు భద్రత కల్పించాలని కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆధారాలుగా కోర్టుకు సమర్పిస్తున్నట్లు పిటిషన్‌లో తెలిపారు. ఈ రెండు పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం ఈ అంశంపై విచారణ చేపట్టింది, విచారణ సందర్భంలో ఫిర్యాది తరపు న్యాయవాది.ప్రభుత్వ న్యాయవాదుల వాదనలు న్యాయస్ధాన విన్న మీదట జోగి రమేష్ ఇంటికి, ఆయనకు భద్రత కల్పించాలని ఆదేశించింది.

# ఇది జంగిల్ రాజ్యమా!

>> సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గాలు నా 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదు. రాజకీయంగా ప్రశ్నించే వారిపై చంద్రబాబు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. ఎవరో ఏదో చేస్తారని భయపడే రోజులు లేవు. అలా భయపడేవారెవరూ ఇక్కడ లేరు. ప్రభుత్వ దుర్మార్గాలపై పార్టీ కార్యక్రమాలు చేపడతాం. పెట్రోలు బాంబులు వేయడం అనే విష సంస్కృతిని చంద్రబాబు మళ్లీ తెచ్చారు. ఇది ప్రజల్లోకి తీసుకెళ్తాం. తిరుమల లడ్డూపై చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలు దేశమంతా తప్పుపడుతోంది. క్షమాపణ చెప్పకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ వైయస్సార్ సీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారు. అంబటి రాంబాబు ఇంటిపై విడతల వారీగా ఐదున్నర గంటల పాటు దాడులకు తెగబడ్డారంటే ఎంత దారుణంగా పోలీసులు వ్యవహరించారో అర్థం అవుతోంది. మరుసటి రోజే జోగి రమేష్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు. వపోలీసుల సమక్షంలోనే గంటల తరబడి దాడులు జరగడం శృతి మించిన అరాచకాలకు నిదర్శనమన్నారు. విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడుపై దాడుల ఘటనల్లోనూ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇవన్నీ కలిపి కోర్టుల్లో దావా వేస్తాం. ఇంకా విషయాన్ని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్చార్సీ) దృష్టికి కూడా తీసుకెళ్తాం. లడ్డూ విషయంలో చంద్రబాబు క్షమాపణచెప్పే వరకు వదిలిపెట్టేది లేదు. ఫ్లెక్సీలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు మేంగళవారం కూడా కొనసాగుతాయి. కారుమూరు నాగేశ్వరరావు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించి పోస్టర్లు వేస్తూ, జంతుకొవ్వు ఆరోపణలు నిజమని నమ్మించే కుట్రలు చేస్తున్నారు. గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ అంబటి రాంబాబు పూజలు నిర్వహించి రోడ్డుపై వెళ్తుంటే టీడీపీ క్యాడర్ రెచ్చగొట్టిందని, ఇన్సిడెంట్‌లో అలా మాట్లాడకుండా ఉండాల్సిందని రాంబాబు ఒప్పుకున్నా టీడీపీ దౌర్జన్యం చేసింది. ఏమీ తిట్టకపోయినా తనను తిట్టారంటూ రాజకీయం చేసే వ్యక్తి చంద్రబాబు. ప్రభుత్వంపై గట్టిగా ప్రశ్నించే వారు ఎప్పుడు దొరుకుతారా అని చంద్రబాబు, లోకేష్ ఎదురు చూస్తున్నారు. మా పార్టీ క్యాడర్‌ను భయపెట్టాలనే లోకేష్ పన్నాగం పన్నారు. అయినా మేమంతా చాలా ధైర్యంగా నిలబడ్డాం. ఇంకా నిలబడతాం. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్, మేరుగు నాగార్జున, కారుమూరు నాగేశ్వరరావు, మాజీ ఎంపీ మార్గాని భరత్, నేతలు కరణం ధర్మశ్రీ, దేవినేని అవినాష్, పూనూరు గౌతమ్ రెడ్డి, వరికూటి అశోక్ బాబు, దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, నూరి ఫాతిమ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేకు రూ.10,134 కోట్లు

>> సగటు కేటాయింపులతో పోలిస్తే 11 రెట్లు పెరిగిందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 92,649 కోట్ల కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు చేయబడుతున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో ని రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100శాతం విద్యుదీకరణ చెందిందని తెలియజేశారు. మంత్రి దేశవ్యాప్తంగా ఏడు హై స్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించారు. ఈ ఏడింటిలో, హైదరాబాద్ - బెంగళూరు మరియు హైదరాబాద్ - చెన్నై అనే రెండు హై స్పీడ్ రైలు కారిడార్లు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుండా వెళ్తాయి. దీనితో రాష్ట్ర ప్రజలకు అపారంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ఈ రెండు హై స్పీడ్ రైలు కారిడార్లు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడంలో సహాయపడతాయి. ఈ కారిడార్లు ఆర్థిక వృద్ధి కారిడార్లుగా పనిచేస్తూ విద్య, ఆరోగ్యం, వ్యాపారం మొదలైన వాటికి సౌకర్యం కల్పిస్తాయి. ఈ హై స్పీడ్ రైళ్ల ప్రవేశంతో హైదరాబాద్ - బెంగళూరు మధ్య ప్రయాణ సమయం 2 గంటలు మరియు హైదరాబాద్ - చెన్నై మధ్య ప్రయాణ సమయం 2 గంటల 55 నిమిషాలుగా ఉంటుందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడులపై నిరంతర దృష్టి సారించడంవలన రాబోయే సంవత్సరాల్లో మౌలిక సదుపాయాల వృద్ధికి, మెరుగైన అనుసంధానాన్ని వైపు ముందుకు నడిపించే ఒక ముఖ్య మైన శక్తిగా రైల్వే బడ్జెట్ నిలుస్తుందని మంత్రి వెల్లడించారు.

# భారత్‌పై సుంకాలు 18%కి తగ్గింపు

>> వాణిజ్య ఒప్పందం ఖరారుకావడంతో అమెరికాకు సైతం కదలిక వచ్చింది. భారత్ తమకు అత్యంత ఆత్మీయమిత్రుడని, భారత్‌తో వాణిజ్యానికి నిరంతరం ప్రాధాన్యతనిస్తామంటూ అమెరికా వాణిజ్యమంత్రి, విదేశాంగమంత్రులు వంటివారుప్రకటనలిచ్చారు. ట్రంప్ అయితే ఒకసారి మోడీ తనకు మంచి మిత్రుడని, గొప్ప నాయకుడని, విజన్‌కలిగిన నాయకుడంటూ ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం భారత ప్రధానిమోడీతో ఫోన్‌లోసంభాషించానని, భారత్‌లాంటి దేశానికి శక్తివంతమైన నాయకుడని, ప్రజలందరి గౌరవాభిమానాలున్న నాయకుడితో సుదీర్ఘ సంభాషణ జరిపానని అన్నారు. వాణిజ్యం, రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వంటి కీలక అంశాలు కూడా చర్చకు వచ్చాయని, మోడీ రష్యా చమురు కొనుగోలు నిలిపివేతకు అంగీకరించారని, అమెరికా, వెనిజులాలనుంచి ఎక్కువశాతం కొనుగోలుచేస్తామని అంగీకరించారని ట్రంప్ తన సోషల్‌మీడియాలో వివరించారు. ప్రధానిమోడీ విజ్ఞప్తిమేరకు తాను ట్రేడ్‌డీల్‌కు ఇరువురం పరస్పరం అంగీకరించామని, అంతేకాకుండా తక్షణమే 25 శాతం ఉంకాలను 18శాతానికి తీసుకువస్తున్నట్లుట్రంప్ ప్రకటించారు.

## 'సిట్' కుంభకోణం కేసు: సిఎం చంద్రబాబుకు

# ఊరట

### అనుబంధ ఛార్జిషీటులో ఆయనపేరు చేర్చని ఇడి

**విజయవాడ.ఫిబ్రవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి భారీ ఊరట లభించింది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), తాజాగా దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌లో ఆయన పేరును నింది తుడిగా చేర్చలేదు. నిధుల దుర్వినియోగం, మనీలాండరింగ్ కార్యకలాపాల్లో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు తమ దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని ఈడీ స్పష్టం చేసింది. విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ఈడీ ఈ సప్లిమెంటరీ చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌ను జనవరి 28న కోర్టు విచారణకు స్వీకరించింది. డిజైన్‌టెక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ , దాని ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్, సీమెన్స్ ఇండియా మాజీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్ (సుమన్ బోస్) నిందితులుగా పేర్కొన్న ఈడీ.చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది.ఇదే కేసుకు సంబంధించి ఏపీ సీఐడీ చంద్రబాబును అరెస్ట్ చేయడం, ఆయన 53 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండటం తెలిసిందే. అయితే, గత నెల లోనే ఏపీ సీఐడీ ఈ కేసులో చంద్రబాబుపై ఆరోపణలు సరికాదని పేర్కొంటూ విజయవాడ కోర్టులో క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేసింది. కోర్టు దానిని ఆమోదించడంతో సీఐడీ కేసు మూసివేతకు గురైంది. సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే దర్యాప్తు చేపట్టిన ఈడీ కూడా ఇప్పుడు చంద్రబాబు పాత్ర లేదని చెప్పడంతో ఆయనకు పూర్తిస్థాయిలో ఊరట లభించినట్లయింది. ఈడీ తాజా నిర్ణయంపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై స్పందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇది చంద్రబాబు నిష్కళంక రాజకీయ జీవితానికి లభించిన "గొప్ప నైతిక విజయం" అని అభివర్ణించారు. సత్యం, న్యాయం వైపు నిలబడే నాయకుడు చంద్రబాబు అని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని ఆయన అన్నారు. కాగా, ఈ కేసులో ఇతర నిందితులపై పీఎంఎల్ఏ కోర్టులో విచారణ కొనసాగనుంది. ఈ కేసులో ఇప్పటివరకు ఈడీ మొత్తం రూ.54.74 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది.

## వారం - వర్జ్యం

03-02-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
విదియ రా.12.45
మఖ రా.10.15
వర్జ్యం : ఉ.6.15-7.52
దు.ఉ.8.56-9.42, 2) రా.10.40-11.26
శుభసమయం:ఉ.5.15-6.00, సా.6.15-7.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ఎంత చేసిన సంతృప్తి చెందని ఒక వర్గాన్ని దూరంగా ఉంచాలని కృత నిశ్చయానికి వస్తారు. శ్రమ అధికం.

**వృషభం:** నరఘోష అధికంగా ఉంటుంది. సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మిథునం:** ముఖ్యమైన పనులలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** అంతరంగిక చర్చలు జరిగే చోట కొత్తవారికి చోటు కల్పించకండి. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**సింహం:** ముఖ్యంగా ఆర్థిక విషయాలలో గోప్యతకు ప్రాధాన్యతనిస్తే లాభపడ గలుగుతారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**కన్య:** ఏకపక్ష నిర్ణయాలు ఎంతమాత్రం లాభించవు. ఖర్చులను నిలువరించ లేక పోతారు. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**తుల :** గాడి తప్పుతున్నాయని భావించిన అంశాలపైన దృష్టిని సారించి ఒకింత అనుకూల ఫలితాలు పొందుతారు.

**వృశ్చికం:** మీరు చేయాలి అనుకున్న కార్యక్రమాలను వెంటనే అమలు చేయడానికి కొన్ని ప్రతిబంధకాలు ఏర్పడతాయి.

**ధనుస్సు:** కాలయాలవనే తప్ప లాభనష్టాలు ఏర్పడవు. అలసటకు లోనవుతారు. ప్రయాణాలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మకరం:** బంధువుల సలహాలను పరిగణనలోనికి తీసుకోరు. దేవాలయ సందర్శనం చేస్తారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** భూముల క్రయవిక్రయాలలో నిదానం అవసరం. ఓ మంచిపని చేసి చెడ్డవారవుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** ఇరువర్గాల మధ్య ఏర్పడిన విభేదాలను పరిష్కరించవలసిన గురుతర బాధ్యత మీపై పడుతుంది. వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తప్పుచేస్తే శిక్ష తప్పదు

>> అని, పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని గుర్తు చేశారు. కానీ అది వైఎస్సార్సీపీ నేతలకు నచ్చడం లేదని, అందుకే అడ్డుకునేందుకు నానావిధాలా కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షి ంచి తీరుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైఎస్సార్సీపీ నేతలంతా బూతు పురాణం ఎత్తుకున్నారని కార్యకర్తల టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు అచ్చెన్నాయుడులు సీఎం చంద్రబాబు మాటలతో ఏకీభవిస్తూ వ్యాఖ్యానించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్సీపీ అడ్డంగా బుక్ అయిందని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్సీపీని చీదరించుకుంటున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికే వైఎస్సార్సీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారన్న నేతలు, వైఎస్సార్సీపీ ట్రాప్‌లో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పడకూడదని సూచించారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. అన్ని వర్గాల వారు కూటమి పాలనపై సంతోషంగా ఉన్నారని మంత్రులు తెలిపారు. పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్సీపీ నేతలు ఇక చేసేదేమీ లేక బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను కావాలనే రెచ్చగొట్టి లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అలజడులు చూసి ఏపీకి ఎవరూ రాకుండా చేయాలన్నది వైఎస్సార్సీపీ నేతల కుట్రని నేతలు దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ కవ్వింపు చర్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు సూచించారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ రాజధాని అమరావతి నిర్మాణం ఆపేసి ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసింది వైఎస్సార్సీపీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును గాలి కొదిలేసి డయాఫ్రాం వాల్‌ను దెబ్బతీసేశారన్నారు. వరదలు వస్తున్నా పట్టించుకోకుండా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ టెర్రరిజంతో పరిశ్రమల్ని పారిపోయేలా చేసింది వైఎస్సార్సీపీ అని ఆరోపించారు. తద్వారా మన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇక్కడ లేకుండా పోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో మనం విధ్వంసం నుంచి వికాసం వైపుకు వెళ్తున్నాం. అమరావతి ఈ 20 నెలల్లోనే ఎంతో అభివృద్ధి చెందింది. త్వరలోనే అనేక భవనాలు అందుబాటులో వస్తున్నాయి. రహదారి కనెక్టివిటీ పెరిగిందన్నారు. విద్యా. వైద్యం, పారిశ్రామీకరణ. పెట్టుబడుల విషయంలో మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. దాంతో వైఎస్సార్సీపీ తట్టుకోలేక పోతుందన్నారు. మనం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళాలన్నారు, ఇక బడ్జెట్‌లో ఏపీకి పలు కేటాయింపులు జరిగాయన్నారు. ముఖ్యంగా ప్రత్యామ్నయ విద్యుత్తు ప్రాజెక్టులు తాజా బడ్జెట్ ద్వారా పెరగనున్నాయన్నారు, దేశంలో సుమారు కోటి సౌర విద్యుత్తు ఫలకాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్నంలో ఖితేలియాడే సోలార్ ప్లాంట్లఖను ఏర్పాటు చేశారు. అయితే తాజాగా కేంద్రం ప్రకటించిన బడ్జెట్ ద్వారా రాష్ట్రంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులకు భారీగా లబ్ధి కలుగనుంది. ఏడాదిగా రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాబోయే ఐదు సంవత్సరాలలో 1.60 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ యోచన. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులతో రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనం దక్కనుంది. మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటును పీఎం కుసుమ్ పథకం రెండో దశలో ఫీడర్ స్థాయిలో కేంద్రం ప్రోత్సహిస్తోంది. దీనికి కేంద్ర బడ్జెట్‌లో దాదాపు రూ.5,000 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద 4 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన విద్యుత్ కోసం ఫీడర్ స్థాయిలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. పీఎం కుసుమ్ మొదటి దశలో సుమారు 2.93 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్‌ను అందించేందుకు ఫీడర్ స్థాయిలో మినీ సౌర ప్రాజెక్టులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, గుత్తేదారులకు పనులు అప్పగించింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుకు కేంద్రం రూ.22,000 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. రాష్ట్రంలో ఒక నెలకు 200 యూనిట్లు, అంతకంటే తక్కువ విద్యుత్‌ను వినియోగించే బీసీ వర్గాలకు దాదాపు 27.59 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కనెక్షన్లు ఉన్న వారికి రూఫ్‌టాప్ విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం ఇచ్చే సబ్సిడీతో పాటు అదనంగా మరో రూ.20 వేలు ప్రోత్సాహకంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో సుమారు 21 లక్షల మంది ఎస్టీ, ఎస్సీ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ టాప్ ప్రాజెక్టుల ద్వారా సౌర విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే దాదాపు 7.5 లక్షల రూఫ్ టాప్ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, గుత్తేదారులకు దీనికి సంబంధించిన పనులను కూడా అప్పగించింది. పీపీఏలను రద్దు చేయటం ద్వారా కరెంటు వాడుకోకుండా 9 వేల కోట్లు డబ్బులు కట్టాల్సి వచ్చిందని సీఎం చంద్రబాబు అన్నారు. కరెంటు ఉన్నా ఎక్కువ రేటుకు బహిరంగ మార్కెట్‌లో వేలంలో కొని వినియోగదారులపై భారం వేశారన్నారు. ఒక వ్యక్తి అధికారంలో ఉండి చేసిన తప్పులకు ఇప్పుడు ప్రజలంతా ట్రూఅప్ కింద విద్యుత్ బిల్లులపై అదనపు చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఇసుక మొత్తం దోపిడీ చేసింది వైఎస్సార్సీపీ అని, వారి నిర్వాకం వల్ల నిర్మాణ రంగం దెబ్బతిందన్నారు. మద్యం అయితే ఇక చెప్పాల్సిన పని లేకుండా అక్రమాలు, దోపిడీ చేశారన్నారు. ఒక్క మద్యం షాపులోనూ ఆన్‌లైన్‌లో నగదు తీసుకోలేదన్నారు. మనం అభివృద్ధిని అందరికి వివరిద్దామన్నారు.

# ఎపికి హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్

>> ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ప్రకటించారు. వీటిలో అత్యధిక భాగంగా ఆంధ్రాలోని అన్ని ప్రధాన నగరాలను కలుపుకుంటూ ముందుకు దూసుకుని వెళ్తాయి. ఉంటుంది. హైస్పీడ్ రైల్ కారిడార్ పూర్తయితే వాటిపై బుల్లెట్ రైళ్లు గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడతాయి. అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే చేరుకోవచ్చు. అలాగే అమరావతి నుంచి తిరుపతి, చెన్నైలకు రెండు గంటల్లోపు చేరుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌బెంగళూరు కారిడార్‌లో కర్నూలు, అనంతపురం నుంచి ఇటు హైదరాబాద్‌కు కానీ, అటు బెంగళూరుకు కానీ గంటలోపు ప్రయాణంతో చేరుకోవచ్చు. చెన్నై- బెంగళూరు కారిడార్‌లో చిత్తూరు నుంచి ఇటు చెన్నై కానీ, అటు బెంగళూరు కానీ కేవలం అరగంటలో చేరుకునే అవకాశం ఉంటుంది. దేశంలో మరే రాష్ట్రానికి ఈ స్థాయిలో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ప్రతిపాదన అనేది లేదు, ఏపీ మీదుగా వెళ్లే హైదరాబాద్‌అమరావతి- చెన్నై, హైదరాబాద్- బెంగళూరు, చెన్నై- బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలలో కలిపి మొత్తం 1,671 కి.మీ. మేర నిర్మించే ఈ కారిడార్లలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ లోనే 857 కి.మీ. ఇవి మన రాష్ట్రంలోని ప్రధానంగా 11 జిల్లాల మీదుగా వెళ్తాయి. ఈ కారిడార్లతో విజయవాడ నుంచి విశాఖ వైపు మినహా మిగిలిన దక్షి ణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ వచ్చినట్లు అవుతుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ అమరావతి మీదుగా, కొత్తగా నిర్మించనున్న విమానాశ్రయానికి సమీపం నుంచి వెళ్లనుంది. దీనిని తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా, ఇందులో ఏపీలో 504 కిలోమీటర్లు ఉంటుంది. ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా ఇది వెళ్తుంది. దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి వద్ద సైతం స్టేషన్లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.90 లక్షల కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్, ఇందులోని స్టేషన్లకు కలిపి మొత్తం 1,873.7 హెక్టార్ల భూమి అవసరం పడుతుంది. మరో 90.31 హెక్టార్ల అటవీ భూమినీ సేకరించాల్సి ఉంటుంది. హైదరాబాద్‌బెంగళూరు కారిడార్ కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్తుంది. ఇందులో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, కియా కార్ల పరిశ్రమకు సమీపంలోని దుద్దేబండ, హిందూపురంలలో స్టేషన్లను నిర్మిస్తారు. ఈ లైన్ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో కలిపి మొత్తం 605 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఒక్క ఏపీలోనే 263 కిలోమీటర్లుగా ఉండనుంది. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.51 లక్షల కోట్లు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికోసం ఏపీలోని 988.62 హెక్టార్ల భూమి, 4.21 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉంటుంది. చెన్నై- బెంగళూరు మధ్య 306 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇందులో ఏపీలోని చిత్తూరు జిల్లాల్లో సుమారు 90 కిలోమీటర్లు ఉండనుంది. దీని ఎలైన్‌మెంట్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ప్రస్తుతానికి చిత్తూరులో రైల్వే స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించారు. మరో స్టేషన్ కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ కారిడార్ నిర్మాణానికి ఎంత వ్యయమవుతుంది? ఎంత భూమి అవసరం అనే వివరాలతో డీపీఆర్ తయారవుతోంది. కారిడార్‌ను తిరుపతి మీదుగా కూడా వెళ్లేలా చూడాలని సీఎం చంద్రబాబు రైల్వేను కోరారు. కేంద్ర పరిశీలనలో ఈ అంశం ఉంది.


పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించడానికి సోమవారం న్యూఢిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కలవడానికి వెళ్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

# ఆంధ్ర టూ ఒరిస్సా రైస్..
# ఒరిస్సా టూ ఆంధ్ర గంజా!

>> అక్రమార్కులను పట్టుకున్నట్లు, కేసులు నమోదు చేస్తున్నట్లు మీడియాకు వివరించడం పై సర్వత్ర ఆశ్చర్య వ్యక్తం అవుతుంది. ఇదిలా ఉండగా పట్టణంలోని ఎక్కడపడితే అక్కడ శివారు ప్రాంతాల్లోనూ గంజాయి వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న పోలీస్ అధికారులు వాటి నియంత్రణకు పెద్దగా దృష్టి పెట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

**చేతులు మారుతున్న పిడిఎఫ్ బియ్యం:**

సాలూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించిన బియ్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేతులు మారుతుంది. పిడిఎస్ బియ్యం కేవలం పేదల వినియోగానికి మాత్రమే పంపిణీ చేస్తుండగా చేతుల భారీ భారీ స్థాయిలో అక్రమ రవాణా జరిగిపోతుంది. కొంతమంది రేషన్ డీలర్లతో పాటు పలువురు అక్రమార్కులు చేతులు కలిపిఈ రేకటి నడిపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీని నియంత్రించడంలో రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు కూడా లేకపోలేదు. పిడిఎస్ బియ్యం లారీ, బస్, ఆటోల ద్వారా ఒరిస్సాకు తరలిపోతుందనే విషయం జగమెరిగిన సత్యం. ఎందుకంటే డిపో బియ్యంవిడిపించుకొని అక్కడే డీలర్లకు అమ్మడంతో అక్కడి నుండి బ్లాక్ మార్కెట్ కు చేరుతుందనేది ఓపెన్ సీక్రెట్.

**మాస్ ఏరియా గల్లీల్లో గంజాయి పేకెట్స్ దందా**

ఒరిస్సా హద్దులుదాటి గంజా పలురకాలుగా ఆంధ్రలోకి అక్రమంగా రావడం ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు తరలించి స్మగ్లర్స్ సొమ్ము చేసుకోవడం నిత్య కృత్యం గా మారిందని బాహాటంగా వినిపిస్తుంది. సాలూరు పట్టణం లో పేకట్ల రూపంలో గంజాయి దొరుకుతుందనేది సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు ఒరిస్సా నుండి అక్రమంగా బ్యాగుల్లో గంజా ప్యాకెట్లు పెట్టుకుని పట్టణంలో ఉన్న మాస్ ఏరియాలోకి వచ్చి వ్యాపారం సాగిస్తున్నారని వినికిడి. గంజాయి మత్తులో పడి కొంతమంది యువకులు తమ జీవితాలను నాశనం చేసుకోవడం తో తల్లి దండ్రులు తీవ్ర ఆవేదన చెందు తున్నారు. పోలీసులు, విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి బియ్యం గంజాయి అక్రమ రవాణా దార్లపై ఉక్కు పాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

# వైసిపి ట్రాప్‌లో పడొద్దు

>> మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దీనిపై జనసేన నేతలు బాధ్యత తీసుకుని ఖండించాలన్నారు.
కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తూ మరో తీర్మానం చేసినట్లు మనోహర్ చెప్పారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయం సమావేశంలో చర్చకు వచ్చిందని త్రిసభ్య కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత విషయాలతో పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఎవరూ ప్రవర్తించవద్దని పవన్ గట్టిగా ఆదేశించినట్లు మనోహర్ చెప్పారు. ఓటు రాజకీయాల కోసం ప్రజల్లో చీలిక తెచ్చేందుకు వైఎస్సార్సీపీ ప్రయత్నిస్తోందని, ఆ ఉచ్చులో పడొద్దని జనసేన నేతలకు స్పష్టం చేశారు.

**త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు**

సమావేశంలో తన ప్రసంగాన్ని పవన్ కల్యాణ్ కొనసాగిస్తూ నేతలను వారి కుటుంబ సభ్యులను ఇష్టం వచ్చినట్టు మాట్లాడతారని జాగ్రత్తగా ఉండాలని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సిద్ధాంత, సబ్జెక్ట్ పరంగా మాట్లాడాలని సూచించారు. త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తామన్న పవన్ జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో మార్పులు చేస్తామన్నారు. వ్యక్తిగత వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తమ వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని పవన్ అన్నారు. శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలన్న అధినేత భౌతిక దాడులు జనసేన విధానం కాదన్నారు. విమర్శలకు విషయంతోనే సమాధానం చెబుదామన్న పవన్ మంగళగిరిలోని దిరీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశాన్ని కొనసాగించాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు చెప్పి అక్కడినుంచి వెళ్లిపోయారు.

# రూ.25లక్షలవైద్య బీమా

>> మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో ఆయన ఎస్‌కోట ఏరియా ఆసుపత్రి నూతన భవనాన్ని, రాహి హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.12.60కోట్లతో నిర్మించిన ఈ భవనం ద్వారా ఈ ఏరియా ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అదేవిధంగా ఇక్కడినుంచి పాలకొల్లు సీతంపేట డయాలసిస్ కేంద్రాన్ని వర్చువల్‌గా మంత్రి ప్రారంభించారు. కిడ్నీరోగి ప్రసాద్‌తో మాట్లాడి, ప్రభుత్వనుంచి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, కిడ్నీ రోగులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అన్నివిధాల కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కిడ్నీ రోగులకోసం 65 పిఎం ఎన్డిపి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఒక్కో కిడ్నీ రోగికి ఏడాదికి సుమారు రూ.20వేలు ఖర్చు చేయడమే కాకుండా, నెలకు రూ.10వేలు పింఛన్ కూడా అందిస్తున్నామని చెప్పారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, సిబ్బందిని, వైద్యుల సంఖ్యను పెంచామని తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను సాధించేదుకు రూపొందించిన వైద్య బీమా పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు లక్షా, 43వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని తెలిపారు. స్త్రీశక్తి పథకం వల్ల మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం, సాధికారత వచ్చిందని, సామాజిక సంబంధాలు కూడా మెరుగుపడ్డాయని చెప్పారు. రోగులను తమ కుటుంబ సభ్యులుగా భావించి, మెరుగైన సేవలను అందించాలని వైద్యులను, సిబ్బందిని మంత్రి కోరారు. సేవలపట్ల ఉదాసీనత ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆధునీకరించిన ఎస్.కోట ఏరియా ఆసుపత్రి వల్ల రోగులు వైద్యం కోసం జిల్లా కేంద్రానికి, కెజిహెచ్‌కు వెళ్లే శ్రమ తప్పిపోయిందని అన్నారు. 2019లోనే 100 పడకల ఆసుపత్రి మంజూరైనా, గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కిడ్నీరోగులకు నెలకు రూ.10వేలు చొప్పున పింఛన్ అందిస్తున్నామని చెప్పారు.
జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఏరియా ఆసుపత్రిని 50 నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్పు చేయడం వల్ల, చుట్టుప్రక్కల సుమారు 4లక్షల మందికి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. అదేవిధంగా డయాలసిస్ కేంద్రం ద్వారా కిడ్నీ రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతేకాకుండా 24 గంటలూ వైద్య సేవలు అందుతాయన్నారు.

# సంక్లిష్ట సమయంలో ఆయన 'మార్క్' పాలన సాధ్యమయ్యేనా!?

## ధార్మికసంస్థ టిటిడి నూతన ఇఒగా ముద్దాడ రవిచంద్ర రేపు బాధ్యతలు



తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో అత్యున్నత హోదా అధికారవర్గాల్లో ఐఎఎస్, ఐపిఎస్ కేడర్ అధికారులుగా వివిధ శాఖల్లో పనితీరు సాగించడం వారి అనుభవం, అవగాహన బట్టి ఉంటుంది. అయితే అదే కేడర్‌లో హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి (ఇఒ)గా, సంయుక్త కార్యనిర్వహణాధికారి (జెఇఒ)గా, ముఖ్య నిఘా భద్రత అధికారి(సివిఎస్ఒ)గా పాలన చేయడం అందుకు భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ పరిపాలనలో అటు ప్రజలతో ఇటు ప్రభుత్వంలోని క్రిందిస్థాయి ఉద్యోగులతో సానుకూల దృక్పథంతో, సమయానుకూలంగా మెలగడం ఒక ఎత్తయితే టిటిడిలో ఇఒ హోదాలో శ్రీవారి భక్తులతో మమేకమై ఉద్యోగులతో కలసి బోర్డుతో సమన్వయంగా పనిచేయాల్సి ఉండటం కత్తిమీద సాములాంటిదే. ఏ చిన్న తేడా వచ్చినా, బేధాభిప్రాయం కలిగినా ఆ హోదాలో ఉన్న అధికారికి అందరి సహకారం దూరమతుంది. అంతటి సున్నితమైన పదవి టిటిడిలో ఇఒ, అదనపు ఇఒ, జెఇఒ స్థానాలు. ఇక్కడ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా, వాటిని ఆమోదించాలన్నా బోర్డు సూచనలతో బాటు సుదీర్ఘ అనుభవం ఉన్న ఉద్యోగుల సలహాలు కూడా వినడం ప్రధానం. మరీ అలాంటిది ఇప్పటివరకు పలు హోదాల్లో వివిధ చోట్ల పనితీరు సాగిస్తూ, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావడంలో తనదైన మార్కు సాధించిన సీనియర్ ఐఎఎస్ అధికారి, ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి హోదాలో సేవలందిస్తున్న ముద్దాడ రవిచంద్ర టిటిడి ఇఒగా నియమితులు కావడం తెలిసిందే. ఆయన తొలిసారిగా బుధవారం ఉదయం తిరుమల ఆలయంలో స్వామివారి చెంత సంప్రదాయంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి ఇఒగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సిఎం నుండి టిటిడి పరిపాలన, ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై తగిన సూచనలు తీసుకున్నారు. మంగళవారం(నేడు) మధ్యాహ్నం తిరుపతికి చేరుకుంటున్న ముద్దాడ తిరుమలకు చేరుకుని రాత్రికి ఇక్కడే బసచేస్తారు. బుధవారం ఉదయం ఆయన ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్న తరువాత ఆలయంలోపల ఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా 2008-2009 మధ్యకాలంలో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ జిల్లాకు సుపరిచితులే. మంచి అధికారిగా కూడా పేరుంది. అప్పట్లోనే ఉద్యోగుల పాలిట పక్షపాతిగా సమస్యల పరిష్కారంలో సున్నితత్త్వంతో వ్యవహరించారనేది అధికారవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన టిటిడి ఇఒగా వస్తుండటం, ముక్కుసూటి అధికారిగా అధికారవర్గాల్లో నానుడి ఉండటంతో ఈ పదవిలో ఆయన తన పాలన అనుభవంతో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.

**- సంక్లిష్ట సమయంలో...**

ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా (ఇఒ) హోదాలో ఆత్మస్థైర్యంతో, ముక్కుసూటితనంతో అటు బోర్డుతో సమన్వయంగా మెలగి ప్రభుత్వం ఆదేశించిన అంశాలను సమర్ధవంతంగా అమలుచేయడం ప్రధానం. ప్రస్తుతం తిరుమలలో కల్తీనెయ్యి వ్యవహారంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారుల ప్రమేయం ఉందనేది సిబిఐసిట్ ఇచ్చిన నివేదిక. దీన్ని అమలుచేయడంలో ముద్దాడ ఒకింత ముక్కుసూటిగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇందుకు బోర్డు కూడా ఆయనకు సహకారం అందించాల్సిన పరిస్థితి. అదేగాక బోర్డు ఇప్పటికే తీసుకున్న పలు నిర్ణయాలు, ఆమోదించిన కీలక అంశాల అమలుపై నూతన ఇఒ రవిచంద్ర పట్టుకలిగిన అధికారిగా అడుగువేయాల్సి ఉంటుంది. టిటిడి పాలనలో సుప్రీమ్ అయిన టిటిడి ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులతో సఖ్యతగా వ్యవహరించి పలు కీలక విషయాలను ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంటుంది. అలిపిరిలో బేస్‌క్యాంప్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అమలుపై కూడా సమీక్షించుకుని తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. టిటిడిలో పూర్తిస్థాయిలో క్రిందిస్థాయి అధికారులతో, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పాలన సాగించగలిగితే ఇఒగా ముద్దాడ సఫలీకృతులవుతారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో ఎక్కడా ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గరాదని, నిబంధనలు అమలయ్యేలా చూడాలని చంద్రబాబు నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని అనూహ్య నిర్ణయాలను అమలుచేయడంలో ఇఒ కీలకపాత్ర వహించాల్సి ఉంటుంది. అలాంటిది కొన్ని నిర్ణయాలను అమలు చేయడానికి, అన్యమత ఉద్యోగులపై కీలకనిర్ణయం తీసుకునేందుకు కూడా ఇఒగా ఆయన ఒకింత అధ్యయనం అవసరం. 2019-24 మధ్యకాలంలో వైసిపి మద్దతుదారులైన కొందరు ఉద్యోగులను, అధికారులను బదిలీ చేయాలనే నిర్ణయాలను కూడా ముద్దాడ సమర్ధవంతంగా అమలుచేయాల్సి ఉంది. కొందరు అధికారుల, ఉద్యోగుల తీరుతో విసిగిపోయిన ప్రస్తుత టిటిడి బోర్డు ఆదేశాలను తూచ తప్పక పాటించడంలో నేర్పరిగా ఎలా నెట్టుకొస్తారనేది చూడాల్సిందే.

### శ్రీవారి చెంత సేవచేసే భాగ్యం అదృష్టమే

- మరింత బాధ్యతను గుర్తుచేసింది
- నేడు టిటిడి నూతన ఇఒ ముద్దాడ రాక

తిరుమల, ఫిబ్రవరి 2 పభాతవార్త ప్రతినిధి: హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటంతోబాటు సాధారణ భక్తులకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగించుకుని పాలన సాగించడంపై దృష్టి పెడతానని టిటిడి నూతన ఇఒగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర అభిప్రాయం. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదబలం, తన పూర్వజన్మ సుకృతం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నమ్మకంతోనే ఇఒగా నియమించడం జరిగిందని తెలిపారు. దేవుని చెంత పనిచేసే అవకాశం తనలో మరింత బాధ్యతను గుర్తుచేయడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల సూచనలు స్వీకరించి టిటిడి సేవలు మెరుగుపరచడంపై ఒకింత దృష్టి సారించనున్నారు. గతంలోనూ తిరుమలకు కుటుంబంతో కలసి వచ్చానని గుర్తుచేసుకున్నారు. కాగా 2026-27 వార్షిక బడ్జెట్‌పై కూడా ముద్దాడ మార్కుపాలన చూపాల్సి ఉంది.

## తిరుమల సమాచారం



### తిరుమలేశుని సేవలో జాతీయ అంధుల క్రికెట్ జట్టు

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని తమ హృదయాలతో దర్శనం చేసుకుని, సకల శుభాలు కలగాలని ఆశీస్సులందుకున్నామని భారత జాతీయ అంధుల క్రికెట్ టీమ్ దీపిక తెలిపారు. తిరుమలలో తమకు చక్కటి ఏర్పాట్లతో ఆ స్వామి దర్శనం కలిగిందని, చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

### శ్రీవారి ఆశీస్సులతో అద్భుతంగా న్యూజిలాండ్ సిరీస్

#### భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్



తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భారత క్రికెట్ జట్టుకు మంచి రోజులు వచ్చాయని, ఇటీవల న్యూజిలాండ్ సిరీస్ అద్భుతంగా జరిగిందని భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఆనందం వ్యక్తం చేశారు. బ్యాటింగ్‌తోబాటు బౌలింగ్, ఫీల్డింగ్ అద్భుతంగా ఆడారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు అందుకుంటామని విశ్వాసం వెలిబుచ్చారు. సిరీస్ నుండి తిరుమలకు వచ్చిన వెంటనే తనకు ఆ దేవదేవుని దర్శనం కలిగిందని, చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు చక్కగా సేవలందించారన్నారు. సోమవారం ఉదయం తిరుమలకు వచ్చిన భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల క్రికెట్ అభిమానులు ఫోటోలు దిగారు.

### ఎస్వీ ఆయుర్వేద వైద్యశాలలో టిటిడి జెఇఒ డాక్టర్ శరత్ తనిఖీలు



## శ్రీవారి వైద్య సేవకుల సౌకర్యాలపై ఆరా

తిరుపతి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడిలో త్వరలో ప్రారంభించనున్న శ్రీవారి వైద్య సేవకులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్యలు చేపట్టినట్లు టిటిడి జెఇఒ (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్ వెల్లడించారు. ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని అవసరమైన భవనాల నవనీకరణలో భాగంగా అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనల మేరకు టిటిడిలో శ్రీవారి వైద్య సేవకు అవసరమైన వైద్య రంగంలోని వివిధ విభాగాల నిపుణులకు అవసరమైన వసతి సౌకర్యం కల్పించేందుకు వీలుగా ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని వసతి గదులను పరిశీలించామ న్నారు. సంబంధిత వైద్యులు వైద్య సేవ చేసేందుకు వీలుగా వారం రోజులపాటు బస చేసేందుకు వసతి గదుల నవనీకరణ, మౌలిక సౌకర్యాలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి, తిరుమలలో ఉన్న టీటీడీ ఆస్పత్రుల్లో ముఖ్యంగా అశ్వినీ ఆసుపత్రి, ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్న పిల్లల ఆసుపత్రుల్లో రోగులకు సేవ చేసేందుకు శ్రీవారి వైద్య సేవను త్వరలోనే ప్రారంభించేందుకు వీలుగా చర్యలు చేపట్టామ న్నారు. వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్య నిపుణులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని డాక్టర్ శరత్ తెలిపారు. ఇప్పటికే టిటిడిలోని వివిధ విభాగాలలో శ్రీవారి సేవకులు వారం రోజుల సేవకు నాలుగు వేల మంది నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. శ్రీవారి సేవను వైద్య, విద్య, ఐటీ రంగాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. టీటీడీ సీఎంఒ డాక్టర్ కుసుమ కుమారి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, బర్డ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారిరవి, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం, నరసింహమూర్తి, ఆర్ఎంఒ భరత్, వైద్యులు పాల్గొన్నారు.



### వెంకన్న సేవలో విద్యాదీశతీర్థస్వామి

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: భగవంతుని నామస్మరణతోనే అంతా శుభాలు కలుగుతాయని వ్యాసరాజమఠం మఠాధిపతి విద్యాదీశతీర్థస్వామి తెలిపారు. సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయమర్యాదలతో మహద్వారం వద్ద స్వాగతం పలికారు. స్వామి ఆలయం లోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనంద నిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇన్‌ఛార్జి ఇఒ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ గురురాజారావు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ముగ్గురిపై చిరుతపులి దాడి

### బొందలవాడలో భయం.. భయం

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామంలో సోమవారం చిరుతపులి దాడిచేసి ముగ్గురిని గాయపర్చిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. బొందలవాడ గ్రామానికి చెందిన కోనంకి నాయుడు, లక్ష్మీదేవి, అంకె నారాయణ స్వామి అనే వ్యక్తులపై చిరుతపులి దాడి చేయడంతో వారు గాయపడ్డారు. ఈ సంఘటనతో ఒంటరిగా ఎవరు పొలాలకు వెళ్లరాదని కట్టెలు, కటార్లు తీసుకునే బయటకు వెళ్లాలని బొందలవాడలో అధికారులు చాటింపు వేశారు. పొలానికి పురుగుల మందు పిచికారి చేయడానికి పొలం వద్దకు వెళ్లిన కోనంకి నాయుడుపై చిరుతపులి దాడి చేయడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా గ్రామంలో ఇంటి పనులు చేస్తుండగా వెనకాల నుంచి చిరుత లక్ష్మీదేవిపై దాడి చేసింది. ఈ విధంగా బొందల వాడ గ్రామంలో ముగ్గురిపై చిరుత దాడి చేయడంతో అటవిశాఖ అధికారులు గ్రామంలోకి వచ్చి అందరు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. చిరుతలు సంచరించిన వాటి అడుగుజాడలను పరిశీలించి చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.




### బంగ్లాదేశ్ చెర నుంచి మత్స్యకారులకు విముక్తి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: బంగ్లాదేశ్ నౌకాదళం చెరలో చిక్కుకున్న తొమ్మిది మంది విజయనగరం జిల్లా మత్స్యకారుల విడుదల వ్యవహారం సుఖాంతమైంది. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖాపరంగా తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా మత్స్యకారులు సోమవారం క్షేమంగా విశాఖ తీరానికి చేరుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికారు. మూడు నెలలుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడటంతో వారి సంబరాలు మిన్నంటాయి. వారిని నివాసాలకు చేరుకున్నారు. గత అక్టోబర్‌లో మత్స్యకారులు అన్యదేశంలో బందీలుగా చిక్కుకుపోయారన్న వార్త తెలియగానే మంత్రి అచ్చెన్నాయుడు అత్యంత వేగంగా స్పందించారు. కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా, ప్రతి దశలోనూ వ్యక్తిగత పర్యవేక్షణ చేశారు. మత్స్యశాఖ మంత్రిగా అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, పడవ రిజిస్ట్రేషన్ వివరాలు, మత్స్యకారుల చిరునామాలను సేకరించి కేంద్ర విదేశాంగ శాఖకు నివేదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వద్దకు స్వయంగా సమస్యను వివరించారు. మత్స్యకారుల దీనస్థితిని వివరించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాయించడంలో కీలక పాత్ర పోషించారు. మూడు నెలల కాలంలో విడుదల కావడంలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషి అభినందనీయమని మత్స్యకారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. భారత కోస్ట్‌గార్డ్, బంగ్లాదేశ్ అధికారులతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిరంతరం టచ్‌లో ఉండేలా చూస్తూ, విడుదల ప్రక్రియలో ఎదురైన సాంకేతిక అడ్డంకులను తొలగించారు. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి విడుదలైన మత్స్యకారులు సోమవారం ఉదయం విశాఖ చేరుకున్నారు. తమను సురక్షితంగా రప్పించడంలో అహర్నిశలు కృషి చేసిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు మత్స్యకారుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మత్స్యశాఖ మంత్రిగా మా మత్స్యకారుల క్షేమమే మాకు ప్రథమ ప్రాధాన్యం. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా, కేంద్ర ప్రభుత్వ సాయంతో వారిని రప్పించగలిగాం. ఆపదలో ఉన్న మత్స్యకారులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## తనకేం జరిగినా లోకేష్‌దే బాధ్యత

- నన్ను మట్టుపెట్టాలని ఇంటిపై దాడి
- ఏం జరిగినా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటా
- తేల్చి చెప్పిన మాజీ మంత్రి జోగి రమేష్




విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: భవిష్యత్తులో తనకు, తన కుటుంబానికి ఏ హాని జరిగినా దానికి మంత్రి నారా లోకేషే పూర్తి బాధ్యుడని, మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. తన ఇంటిపై ఆదివారం జరిగిన దాడి కూడా లోకేష్ ఆదేశాలతోనే ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలోనే జరిగిందని మాజీ మంత్రి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసుల అండతో వారి సమక్షంలోనే టీడీపీ గూండాలు పెట్రోల్ బాంబులతో దాడి చేసి తనని, తన కుటుంబాన్ని భౌతికంగా లేకుండా చేయాలన్న కుట్ర చేశారని జోగి రమేష్ వెల్లడించారు. తన దైవం తిరుమలేశుడు అని, తన నాయకుడు వైయస్ జగన్ అని చెప్పారు. మరి ఆ జగన్‌గారిపై నిందలేస్తే ఎలా ఊర్కుంటామని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తున్నారని, తమను ఎలా, ఎంత వేధించినా ఎక్కడా వెనక్కు తగ్గబోమని జోగి రమేష్ తేల్చి చెప్పారు.

**దాడులతో వైయస్సార్సీపీని భయపెట్టలేరు**

"వరుస దాడులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను భయపెట్టాలని చూస్తున్నారు. కొన్ని వందల మంది తెలుగుదేశం పార్టీ గూండాలను నా ఇంటి మీదకు పంపించి దాడి చేశారు. పోలీసుల సమక్షంలోనే జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యంపై, వెనుకబడిన వర్గాల మీద జరిగిన దాడిగానే చూడాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఈ ప్రభుత్వం ఓర్వలేకపోతుంది. ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయని వణికిపోతున్నారు. జోగి రమేష్ లాంటి వెనుకబడిన తరగతులకు చెందిన నాయకులను కేసులతో బెదిరించి, దాడులతో భయపెట్టి, జైళ్లకు పంపి మానసికంగా వేధిస్తే వైయస్సార్సీపీ తరఫున గొంతు వినిపించేందుకు ముందుకురారు అనేది వారి ఆలోచన. అందుకే ఇలాంటి భయోత్పాతం సృష్టించారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ని రంగంలోకి దించి నా ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి చేసి నిప్పంటించారు. నన్ను, నా కుటుంబ సభ్యులను బతికుండగానే సజీవ దహనం చేసే కుట్రకు ఈ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడలేదు. జగన్ ప్రోత్సాహంతో వైయస్సార్సీపీలో బీసీలు ఎదుగుతుంటే చంద్రబాబు చూసి ఓర్వలేకపోతున్నాడు. తాను తప్పు చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేని అక్రమ కేసులో మూడు నెలలు జైలుకు పంపినా వారి కక్ష తీరలేదు. నెల్లూరు, విజయవాడ, మదనపల్లె జైళ్లలో అక్రమంగా నిర్బంధించి చంద్రబాబు, లోకేష్ రాక్షసానందం పొందారు. నేను ఏ తప్పు చేయలేదని దుర్గమ్మ ఆలయంలో ప్రమాణానికి సిద్ధమని చెప్పాను. నార్కో అనాలిసిస్ టెస్టుకు సిద్ధమని సవాల్ చేశా. సీబీఐ ఎంక్వయిరీ అడిగాను. అవన్నీ చేయకుండా చేతిలో అధికారం ఉంది కదా అని అక్రమంగా నన్ను, నా కుమారుడిని, తమ్ముడిని జైలుకు పంపి ఇబ్బంది పెట్టారు. జైలు నుంచి వచ్చాక వైయస్సార్సీపీ తరఫున గళం వినిపిస్తుంటే చంద్రబాబుకి నచ్చడం లేదు. చివరకు నేను ఆరాధించే తిరుమల వెంకటేశుడి లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తుంటే తట్టుకోలేకపోయాను. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని టీడీపీ ఫ్లెక్సీలు వేసి శ్రీవారి ప్రతిష్టను దిగజార్చుతుంటే మనసు కన్నీరు పెట్టింది. రాజకీయ లబ్ధి కోసం వైయస్ జగన్ గారి వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్రలపై తిరగబడ్డాను. కానీ తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ వారిని విమర్శిస్తే దాడులు చేస్తారా? లోకేష్‌కి చిప్ దొబ్బింది అని ప్రశ్నించడం తప్పా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం?. పక్కా ప్రణాళికతోనే ఇనుప రాడ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడులు చేశారు. డిసిపి ఉన్నం రామకృష్ణ, సిఐ, ఇతర పోలీస్ సిబ్బంది సమక్షంలో వారి అండతోనే తెలుగుదేశం గూండాలు మా ఇంటిపై ఈ దాడులకు తెగబడ్డారు. మాకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు దాడులు చేసే వారికి ఎస్కార్టుగా నిలబడ్డారు" అని జోగి రమేష్ ఆరోపణలు గుప్పించారు. మీడియా సమావేశంలో పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎంపీలు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## 10 తర్వాత పూర్తి స్థాయిలో ఇండిగో విమానాల కార్యాచరణ

- రూ.50 కోట్ల గ్యారెంటీకి డిజిసిఎ ఆదేశం
- ఎంపి రఘునాథరెడ్డి ప్రశ్నకు పౌర విమానయాన శాఖ స్పష్టం



రాజంపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఈనెల 10 తర్వాత మినహాయింపులు లేకుండా కార్యాచరణ అవసరాలను తీర్చడానికి తగినంత పైలట్లు, సిబ్బంది ఉంటారని ఇండిగో అధికారి కంగా డైరెక్టరేట్ జనరల్ అఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)కి హామీ ఇచ్చింది. తాత్కాలిక సడలింపులు ముగిసిన తర్వాత కార్యాచరణ స్థిరత్వాన్ని కొనసాగించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి మొహుల్ మురళీధర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఎంపీ మేడా రఘునాథరెడ్డి ఇండిగో సంస్థ ఎదుర్కొంటున్న విమాన అంతరాయాలపై డైరెక్టరేట్ జనరల్ అఫ్ సివిల్ ఏవియేషన్ తన విచారణను పూర్తి చేసిందా అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఏ మేరకు చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అందుకు మంత్రి లిఖిత పూర్వక సమాధానంలో గత ఏడాది డిసెంబర్ 3, 5 మధ్య ఇండిగో చేసిన పెద్ద ఎత్తున జాప్యాలు, సర్వీసుల రద్దుల కారణంగా, 1937 ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్‌లోని 133తి నిబంధన కింద ఆదేశాలను పాటించనందుకు 22.20 కోట్ల ఒకేసారి ఆర్థిక జరిమానా విధించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక దిద్దుబాటు చర్యలను నిర్ధారించడానికి డీజీసీఏ రూ.50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని అందించాలని ఇండిగోను ఆదేశించామన్నారు. పరిహారం చెల్లింపు ప్రక్రియ కూడా జరిగినట్టు తెలిపారు. బాధిత ప్రయాణీకులకు వాపసు, పరిహార మొత్తాలను సకాలంలో చెల్లించడానికి వీలుగా ఆన్లైన్ ట్రావెల్ ఏజెంట్లు పనిచేస్తాయన్నారు. విమాన రాకపోకలు, ప్రయాణీకుల డిమాండ్ పెరుగుదల నుండి ఉత్పన్నమయ్యే అవసరాలను తీర్చడానికి, గరిష్ట సమయాల్లో విమాన రాకపోకలను బలోపేతం చేయడానికి, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న విమానాశ్రయ మౌలిక సదుపాయాల విస్తరణ, మార్పు, అప్‌గ్రేడ్‌లు ఎప్పటికప్పుడు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో కొత్త టెర్మినళ్ల నిర్మాణం, ఉన్న టెర్మినళ్ల విస్తరణ, ఆధునీకరణ, రన్‌వేలు, అప్రాన్‌లను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. భూమి లభ్యత, సాంకేతికఆర్థిక సాధ్యాసాధ్యాలు, ఆర్థిక వనరుల లభ్యత, సమర్థ నియంత్రణ అధికారుల నుండి అవసరమైన అనుమతులు వంటి అంశాలకు లోబడి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సహా సంబంధిత విమానాశ్రయ నిర్వాహకులు, డెవలపర్లు అభివృద్ధి పనులను చేపడతారు మంత్రి సమాధానమిచ్చారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఆ దేవుని దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన సాయిసిద్ధార్థ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలసి రూ.10.51లక్షల విరాళం డిడిని అందజేశారు.




### జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో

## పద్మావతి వర్సిటీకి పతకం

యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ 9వ ఫెడరేషన్ నేషనల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మూడవ స్థానం కైవసం చేసుకుంది. అందులో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో బిపిఎడ్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.రమ్య అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లు యూనివర్సిటీ వ్యాయామ విభాగ అధిపతి ఆచార్య జి.సరోజినీ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఉషా విద్యార్థిని ప్రదర్శన పట్ల హర్షం వ్యక్తం చేసి మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.

-హెన్రీఫోర్డ్

# సత్వర న్యాయం.. అందని ద్రాక్ష

సమయానికి అందని న్యాయం అన్యాయం కిందే జమ చేసుకోవాల్సి వస్తుందని దేశంలో ఎంతో మంది కక్షిదారులు వారి దుస్థితికి వారే వాపోతున్నారు. దేశ న్యాయవ్యవస్థ ఎన్ని సంస్కరణలు చేపట్టినా వాటి ఫలాలు సామాన్యునికి చేరువ కావట్లేదు. దాంతో సత్వర న్యాయం పొందాలని కోర్టు మెట్లెక్కితే వాయిదాలతో కాలయాపన జరిగి తామెందుకు కోర్టును ఆశ్రయించామా అనే ధోరణిలో కక్షిదారులు ఆవేదన చెందుతున్నారు. ఎంతో కాలం ఎదురు చూసినా న్యాయం అందుతుందా లేదా అనే అంశంపై ఇప్పటికీ ఎన్నో సందేహాలున్నాయి. అందుకేనేమో ఓడిపోయిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడనే జనవాక్యం వింటుంటాం. ఇది అక్షరలా నిజం. అందుచే ఎలాంటి వివాదమైనా కోర్టు బయట పరిష్కారం వెతుక్కున్నవాడే విజేత అనే రోజులొచ్చాయి. ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులెన్నెన్నో కోర్టులో ఉండిపోవడం వాయిదాలకు తిరగలేక, వయసుడిగిపోయి దేవుని మీదే భారం వేసి ఇంట్లో కూర్చున్న కక్షిదారులెంతో మంది తమ గెలుపు కోసం మీనమేషాలు లెక్కపెడుతున్నారు. అపుడెపుడో రావిశాస్త్రి అనే రచయిత న్యాయవ్యవస్థ, పరిపాలన, కక్షిదారుల గోడు వంటి అంశాలను క్రోడీకరించి ఓ నవల రాసారు. అది న్యాయ వ్యవస్థ, చట్టాలతీరు, జడ్జిల వ్యవహారశైలిని కూడా విస్మరించే అంశాలున్నాయి. వీటన్నిటిని ఆకళింపు చేసుకున్న బుద్ధిజీవి ఎవరైనా కోర్టు దరిదాపుల్లోకి రాడన్నమాట. అయినా వివాదాలు, విభేధాలు, ఓర్వలేనితనం, ఆశలు ఇవన్నీ వ్యక్తుల మధ్య తగాదాలు సృష్టిస్తాయి. మనిషిని నిలకడగా నిలబడనీయవు. బుద్ధికుశలతను కూడా ఉపయోగించనీయవు. అలా కోర్టుల వరకూ వివాదాలొస్తే ఏళ్లూ పూళ్లూ అయిపోయాక గాని తీర్పు బయటకురాదు. వచ్చినా దాని వల్ల లాభమో! నష్టమో! తెలియక కొన్ని జీవితాలు కొడిగట్టేస్తాయి. న్యాయ సంస్కరణల పేరిట సుప్రీంకోర్టు, ప్రభుత్వం కలిపి ఎన్నో సూచనలను కింది కోర్టులకు చేస్తున్నా అవి అమలులో సత్వర న్యాయానికి స్వల్పంగానైనా అడుగులు పడటం లేదు. వాయిదాల పర్వంలోనే కక్షిదారుల బతుకులు తెల్లారిపోతున్నాయి. దేశవ్యాప్తంగా చూస్తే 5.1 కోట్లకుపైగా పెండింగ్ కేసులు తీర్పుల కోసం ఎదురుచూస్తున్నాయి. కొన్ని విచారణకు నోచుకోలేదు. యేటా 2 నుంచి 2.5 కోట్ల కేసుల మేరకు పరిష్కారం జరుగుతున్నా కొత్తగా వచ్చే కేసులు కూడా అదేస్థాయిలో పెరుగుతన్నందున పెండింగ్ కేసులు తగ్గట్లేదు అనేది సుప్రీంకోర్టు భావన. వాళ్లదగ్గర ఉన్నఅంకెలు, అంచనాలు అవి. సుప్రీంకోర్టులో 90వేల కేసులు పరిష్కారం కోసం ఎదురు చూస్తుంటే అన్ని హైకోర్టుల్లో మొత్తం 63 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

నేషనల్ జుడీషయల్ డేటాగ్రిడ్ సమాచారం మేరకు తాజాగా మరికొన్ని కేసులు పెండింగ్ జాబితా లోకి చేరిపోయాయి. నిజానికి సామాన్యుని కేసులకే చెదలు పట్టున్నాయని కక్షిదారులు వాపోతున్న అంశాలే. కింది కోర్టులో విచారణకు నోచుకొని కేసులుంటాయి. పైకోర్టుల్లో అప్పీల్ కేసులు ఉంటుంటాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టు, హైకోర్టు, కిందికోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 'జీరో'కి రావాలంటే కనీసం 20 ఏళ్లుపడుతుంది. అదీ కొత్త కేసులు, వ్యాజ్యాలు లేకపోతే, కానీ కొత్తవి వస్తే మళ్లీ అవీ పెండింగ్ జాబితాలోనే పడిపోతాయి. రోజుకిదోటి, అదోటి అని వంతులువేసుకున్నా కోర్టుల్లో తీర్పులు త్వరితగతిన రావాలంటే కష్టమే. కొత్త కేసులు నమోదు, కోర్టుల్లో జడ్జీల సంఖ్య తక్కువ, వాయిదాలు, స్టేలు వంటి అంశాలు కూడా కోర్టుల్లో పెండింగ్ కేసుల పెరుగుదలకు దారితీస్తుంటాయి. న్యాయ సంస్కరణల పేరిట లోక్ అదాలత్‌ల నిర్వహణ మధ్యవర్తిత్వ పరిష్కారాలు వంటి ప్రయత్నాల వలనకూడా పెద్దగా ఫలితం ఉన్నట్లు కనపడదు. ఇదిలా ఉండగా న్యాయమూర్తుల సంఖ్య తగినంతగా లేనందున కోర్టుల్లో కేసుల పరిష్కారాలు ఆలస్యమవుతున్నాయి. భారతీయ న్యాయవ్యవస్థ సజావుగా నడవాలంటే కోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయ మూర్తుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. అవన్నీ లేకనే ఆ వ్యవస్థ విమర్శలకు గురవుతోంది. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి 50 మంది జడ్జీలు ఉండాలని లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 120వ నివేదికలో సూచించింది. కానీ ప్రస్తుతం ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మందే ఉన్నారు. ఈవిధమైన లోపభూయిష్ట విధానాల వలన సత్వర న్యాయం అందడంబహుకష్టమే. 2011 జనాభా లెక్కల ప్రకారం 2026నాటికి న్యాయమూర్తుల సంఖ్యపై కేంద్రం వద్ద స్పష్టమైన నివేదికలున్నాయి. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులుండాల్సి ఉండగా 33 మందే ఉన్నారు. అలాగే దేశంలోని వివిధ హైకోర్టుల్లో 1122 మంది న్యాయమూర్తులు ఉండాలి. కానీ 814 మంది మాత్రమే ఉన్నారు. కింది కోర్టుల్లో 20,833 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. వాయిదాలపై నిర్ణీత పద్ధతి లేకపోవడం వలన కోర్టుల్లో కేసులు సత్వర పరిష్కారానికి నోచుకోవడంలేదు. వ్యవస్థమొత్తం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కోర్టులపైనున్న ఒత్తిడి జైళ్లమీదనూ ఉంటుంది. కోర్టుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడమేకాదు న్యాయాధికారుల సంఖ్యనూపెంచాలి. 'స్టే'విధానంపై కక్షిదారులకు ఇబ్బంది లేని విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఒక కేసులో 'స్టే' లభిస్తే అదిసుదీర్ఘకాలం అటకెక్కినట్లే! ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం న్యాయవ్యవస్థ సరైన దిశగా నిర్ణయాలు తీసుకోగలి గితే కక్షిదారుకు సత్వర న్యాయం అందించే ప్రయత్నం జరగడమొక్కలే శరణ్యం.

న్యాయం గెలవడానికి ఒక్క కారణం చాలు. అన్యాయం గెలవడానికి సవాలక్ష సాకులు కావాలి.



తిరుక్కురళ్

మంచి చేయడానికి సిగ్గుపడకు. సత్యంగా ఉండు. నీవు ఆలోచిస్తున్నదే సరైనదని నిర్ణయించుకుంటే దానికి కట్టుబడి ఉండు.



జార్జ్ ఇలియట్

# ప్రజావాక్కు



### ఆచితూచి మాట్లాడాలి

ఆంధ్రప్రదేశ్ 2024 ఎన్నికలలో కూటమి పార్టీల మీద ఘోరాతిఘోరంగా ఓడిపోయిన వైసీపీ ఏదోవిధంగా వార్తల్లోనిలవాలని చంద్రబాబు ప్రభుత్వంమీద అనేక అపనిందలు మోపుతూ కాలం గడుపుతున్నట్లు కనిపిస్తునట్లుంది. ఈ పార్టీ ప్రతిపక్ష నాయకుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు గారి మీద అనుచిత వ్యాఖ్యలుచేసి పొరబాటు జరిగిందని తరు వాత అన్నా తెలుగు దేశం శ్రేణులు సంయమనం పాటించక ఆందోళనకుదిగారు. ఒక్కొక్కసారి ఇవిఉద్రిక్తలకు దారితీస్తున్నాయి. మౌనం, శాంతి మార్గాలనుపాటిస్తే అవతలి వారు వెనకకి తగ్గవచ్చు. మాజీ ప్రధాని పి.వి.ఎన్.ఆర్. ఈ పాలసీనిపాటించి అనేక ప్రత్యర్థుల నోళ్ళు మూయించారు. ఏమయినా వైసిపి నాయకులు తమ నోళ్ళను అదుపులో పెట్టుకోలేకపోవడం విచారకరం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పిల్లలు.. వార్తా పత్రికలు

ఒకప్పటి వార్తా పత్రికలు చదివితే విజ్ఞానం పెరిగేది. ఎన్నో విషయాలు తెలిసేవి. అదే ఇప్పటి వార్తా పత్రికలు చదివితే ఉన్న విజ్ఞానం కాస్తా పోతుంది. ఇప్పుడు వస్తున్న వార్తాపత్రికల్లో మంచివార్తలు పాఠకులకు ఉపయోగపడే వార్తలు ఉండటం లేదు. చెత్త రాజకీయాలు, నాయకులతిట్లపురాణాలు పార్టీలగొడవులు, అక్రమ సంంధాలు, అత్యాచారాలు యువత పెడధోరణులు, విద్యార్థుల ఆత్మహత్యలు, సైబర్ నేరాలు, ఘోరాలు దారుణాలు నేడు బయట సమాజంలో జరుగుతున్నవి. ఇవే కనుక వార్తా పత్రికల్లో హెడ్‌లైన్‌లో ఇలాంటి వార్తలే ప్రచురించబడుతున్నాయి. ఇలాంటి వార్తలు పిల్లలు చదివితే వారి చిన్ని మనసుల్లో చెడు ప్రభావం పడుతుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

భారతదేశంలో నిరుద్యోగం చాలా పెరిగిపోయింది. యువతి దేశానికివెన్నుముక. అలాంటి యువత ఈరోజున సరేనావాళ్ల చదువుకు దగ్గ ఉద్యోగాలు లేకపోవడం చాలా బాధాకరం. కనీసం ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేక చట్టం తీసుకొచ్చి విద్యార్థికి వాళ్ళ వాళ్ల విద్యా సంవత్సరం పూర్తి అవగానే ఒక ఉద్యోగంఇవ్వాలి.

- నాగసూర్య రాఘవేంద్ర బాబు, తీపర్రు

### పేరులో ఏముంది?

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చారే కాని పూర్తిగా రద్దు చేయలేదు. అలానే ఈ పథకంలో ఎన్నో మార్పులు చేశారు. అయితే ఈ మార్పులు రాష్ట్రాలకు భారంగా ఉన్నాయని, అలాగే పేదలకు ఉపయోగపడేలా లేవని అందువల్ల ఈ పథకంలో ఎటువంటి మార్పులు చేయకుండా పేరుతోసహా మొదటి నుంచి ఎలా ఉందో అలానే యథాతథంగా అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీలు గొడవ చేస్తున్నాయి. నిరసనలకు సిద్ధపడుతున్నాయి. ఇదంతా ఎందుకు? మనిషి పేరు ఎలా ఉన్నా జాతకం బావుంటే అతడు జీవితం కూడా బావుంటుంది. ఇది కూడా అలాంటిదే. గ్రామీణ పేదలకు ఏదో ఒక పేరుతో ఉపాధి దొరకటం ముఖ్యం.

- మిథునం, హైదరాబాద్

### మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటి నుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు, కానీ దానిప్రభావం సమా జంపైతీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తి వల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తు న్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాది మంది కాలేయ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలతో మరణిస్తున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి,

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భూస్వాములకు కూలీల సరఫరా

భూస్వాములకు కూలీలను అందించడం కోసమే ఉపాధి హామీని మార్చారా అనే అనుమామం కలుగక మానదు. 60 రోజుల విరామం రెండు ఏనెలలో ఏరాష్ట్రంలో ఏ జిల్లాలో పని పెట్టాలి అన్నది కేంద్రం నిర్ణయంచేస్తుంది. గ్రామాల్లో రైతులతో మాట్లాడినప్పుడూ రైతులు అడిగే ప్రశ్న ఒకటి ఎప్పుడు ఎదురు అవుతుంది. వ్యవసాయానికి రైతులను కూలీలను పంపవచ్చుగా అనేది ప్రశ్న. ఇటీవలి కాలంలో కూలీలు దొరకడం పెద్ద సమస్యగా మారింది. అందుకే తెలంగాణలో పెద్ద సమస్యగా మారింది. ఎక్కువ భూమి ఉన్న రైతుల నుండి ఉపాధి హామీ మీద అభిప్రాయం చెడుగా ఉంటుంది. అదివాళ్ల అవసరాలు తీర్చడం కోసమే. తెలంగాణ వరకు వస్తే పప్పు బెల్లంలా డబ్బులు పంచకుండా సమయం నిర్దేశించుకొని ఆస్తుల సృష్టి జరపాలి.

- భారత అవినాష్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యుజిసి నిర్ణయాలపై 'స్టే' సమంజసమా?

***ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ మాత్రం 2026 రెగ్యులేషన్స్, కానిస్టిట్యూషన్‌లో హక్కులను (బి.సిలు-మార్జినలైజ్డ్ బాక్ వర్డ్ వారిని) కాపాడే విధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. యుజిసి నిర్ణయాలు ఒక్కొక్కప్పుడు విద్యాసంస్థలలో గొడవలకు దారితీస్తాయి. దానికి కారణం సమాజం చిన్న కులాలతో విడిపోయి ఉండడం వల్ల ప్రతి రూల్, ప్రతి ప్రొవిజన్, భూతద్దంలో చూస్తున్నారు. రాజకీయ రంగు పులుముకొని వారి మాట మాట్లాడుతున్న విద్యార్థి సంఘాలు, వారి హక్కుల కోసం స్వతంత్రంగా పోరాడితేనే ఫలితాలు దక్కుతాయి కాని రాజకీయ నాయకుల మాటల వల్ల కానేకాదు.***



రావులపాటి సీతారాం రావు

మనదేశంలో ఉన్నత విద్యవిలువ మసకబారుతున్నది. ఈ మధ్యనే సుప్రీంకోర్టు ఈ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 'సమన్యాయం' అనే పేరుతో ఉన్నత విద్యాలయాల రూల్స్‌ను ప్రోత్సహించే విషయంలో విడుదల చేసిన ఆదేశాలను నిలిపివేస్తూ 'టూస్వీపింగ్' అన్న అభిప్రాయాన్ని కూడా వెలిబుచ్చటం దేశమంతటా విద్యాధికుల్లోనూ, విద్యాలయాల్లోనూ ఎడతెగని చర్చలకు దారితీసింది. వివక్ష కులపరంగా జరుగుతున్న తీరును సంస్కరించటం కోసం జనవరి 2026లో యుజిసి ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలు విడిపోని ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో రోహిత్ వేముల దురదృష్టకర ఆత్మహత్య, తర్వాత అనేక రకాల ప్రొటెస్టులు, విధ్వంసకాండ, దేశంలో కుల వివక్షల నేపథ్యంలో యుజిసి సుప్రీంకోర్టు ఆదేశాలతో సమస్య పరిష్కారానికి ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉన్నత విద్యాలయాలు (హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్) 2012 యుజిసి మార్గదర్శక ఫ్రేమ్‌ను పూర్తిగా విస్మరించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. కులం, కులపరమైన వివక్ష ముఖ్యంగా ఉన్నత విద్యాలయాల్లో తీవ్రంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. నిజానికి ఈ వివక్షను రూపుమాపటం, సామాజిక, రాజకీయ విద్యాపరమైన బాధ్యతగా గుర్తించి సరైన చర్యలు తీసుకోనంత కాలం ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది. చాలా మంది విద్యార్థులు దీనివల్ల తీవ్ర నష్టాన్ని కెరియర్‌పరంగా అనుభవించటమే కాకుండా ఎటూ తోచని పరిస్థితులలో జీవితాలను వృథా చేసుకున్న ఉదంతాలు కూడా చాలా ఉన్నాయి. గతించిన అయిదు సంవత్సరాలలో ఇలాంటి వివక్షపరమైన సంఘటనలూ, కేసులూ ఇబ్బడి ముబ్బడిగా ఉన్న విద్యాలయాల్లో పెరిగినట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. యుజిసియే ఈ లెక్కలను బయటపెట్టింది. అయితే 2026లో 2012 ఫ్రేమ్‌వర్క్‌ను పూర్తిగా నీరుకార్చి ఈ కొత్త రూల్స్‌ను యుజిసి నోటిపై చేయడం వివాదాస్పదంగా మారింది.

అంతకు మునుపు ఉన్న 2012 రూల్స్ వివక్షకు సంబంధించిన విషయాలను గుర్తించటమే కాకుండా, ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఏర్పరిచి రిజర్వేషన్లు ఈ తరగతుల వారు పొందని విషయాలను కూడా స్పష్టపర్చటం జరిగింది. సమాన అవకాశాలు పొందే విధంగా సెంటర్స్‌ను ఏర్పరచటం, ఈక్విటీ కమిటీలు, హెల్ప్‌లైన్లు, స్క్వాడ్‌లు, టైం ప్రకారం కంప్లయింట్స్‌ను, సరైన మానిటరింగ్ విధానంతో పరిష్కరించటం, ఎంక్వయిరీ కమిటీలకు రిప్రజంటేషన్లు అమలుపర్చాలని కొత్తరూల్స్ చేసింది. అయితే హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈ రూల్స్‌ను ఆచరణలో అమలు చేసినట్లు లేదు. ఉత్తర భారత్‌లోని కొన్ని యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఈరూల్స్ అమలులో పట్టింపులు వచ్చి ప్రొటెస్టులకు దారితీసాయి.




ఈ రూల్స్‌తో ఎస్సీ, ఎస్టీ ఓబిసి కులాలకు సంబంధించిన వివక్షనే నిర్వచించారు. ఫాల్స్ కంప్లయింట్స్ ఇచ్చిన వారిపై చర్యల విషయంలో రూల్స్‌లో ఎలాంటి ప్రొవిజన్ లేకపో వటం వివాదాలకు దారితీసింది. ఈ వివక్ష అనేది నిమ్న కులాల వారిపై కాబట్టి ఇతర కులస్థుల విద్యార్థుల విషయాన్ని రూల్స్‌లో పేర్కొనకపోవడం తప్పుపట్టి ప్రొటెస్టులు చేసేంత పెద్ద విషయమేమీకాదు. 2025 డ్రాఫ్ట్ రూల్స్‌లో తప్పుడు నేరారోపణ విషయంలో నిబంధనలు (చర్య తీసుకొనేందుకు ఉన్నాయి) ఇప్పుడు ఆ నిబంధనలను తిరిగి పొందుపర్చటం జరిగితే రాజకీయ యుద్ధాలు జరిగే అవకా శం ఉంది. వివక్షను ఆరోపణ చేసే ప్రతి కంప్లయింట్‌ను క్షుణ్ణంగా విచారించి చర్యలుతీసుకొంటే సరిపోతుంది. అంతే కానీ ప్రతి ఆరోపణ మీద చర్యలు తీసుకోవాలని కొందరు పట్టుపట్టటం సమంజసం కాదేమో! ఇలాంటి సున్నితమైన వివక్షాపరమైన విషయాలలో ప్రభుత్వాలు రాజకీయంగా తీసుకోవాల్సిన నిర్ణయాలను కోర్టుల ద్వారా తీసుకొనిపోవటం సమంజసం కానేకాదు. ప్రభుత్వానికి మూడు అంగాలు విస్పష్టంగా ఉన్నప్పుడు ఏ విభాగం పని ఆ విభాగం చేసినప్పుడే ప్రభుత్వాలు నిజమైన ప్రజాభిమానం పొందగల్గుతాయి. ఈ మధ్యకాలంలో దాదాపు అన్ని ప్రభుత్వాలు ఎన్నికలను, అధికారాన్ని దృష్టిలోపెట్టుకొనే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. దానివల్ల అధికార విభజన సూత్రానికి అర్థమే లేకుండాపోతున్నది. దేశంలోని వివిధ పార్టీల నాయకులూ, విద్యార్థి నాయకులూ సుప్రీంకోర్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2026 ఈక్విటీ రెగ్యులేషన్స్ మీద ఇచ్చిన 'స్టే'ను స్వాగతించారు. అయితే కులాన్ని ఆధారం చేసుకొని చూపిస్తున్న వివక్ష నిర్వచనం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి సంఘాలు, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఆర్డర్‌ను వ్యతిరేకించాయి. యుజిసి కాస్ట్ బేస్డ్ డిస్క్రిమినేషన్' డిఫినేషన్‌ను నిలిపివేస్తూ జనరల్ కేటగిరిని వదిలేయటాన్ని సుప్రీంతప్పు పట్టింది. దాంతో 2012 రెగ్యులేషన్లే అమలులో ఉంటాయి. బహుజన సమాజ్ పార్టీ (మాయావతి) సరైన నిర్ణయంగా భావించింది. పైతరగతుల సొసైటీ వారికి కూడా యుజిసి రిప్రజెంటేషన్ ఇచ్చినట్లయితే బాగుండేది అన్నట్లు అభిప్రాయపడింది. సమాజ్‌వాదీ పార్టీ అఖిలేష్ యాదవ్ కూడా సమర్థిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ మాత్రం 2026 రెగ్యులేషన్స్, కానిస్టిట్యూషన్‌లో హక్కులను (బి.సిలు-మార్జినలైజ్డ్ బాక్ వర్డ్ వారిని) కాపాడే విధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. యుజిసి నిర్ణయాలు ఒక్కొక్కప్పుడు విద్యాసంస్థలలో గొడవలకు దారితీస్తాయి. దానికి కారణం సమాజం చిన్న కులాలతో విడిపోయి ఉండడం వల్ల ప్రతి రూల్, ప్రతి ప్రొవిజన్, భూతద్దంలో చూస్తున్నారు. రాజకీయ రంగు పులుముకొని వారిమాట మాట్లాడుతున్న విద్యార్థిసంఘాలు, వారిహక్కుల కోసం స్వతంత్రంగా పోరాడితేనే ఫలితాలు దక్కుతాయికాని రాజకీయ నాయకుల మాటల వల్ల కానేకాదు. •

# సమస్యల వలయంలో మహిళా వైద్యులు!

డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి

పద్దెనిమిది వందల నలభై తొమ్మిదిలో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి03న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే) జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్యరంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎందరో మన ముందు ఉన్నారు. జాతీయ మహిళావైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగవేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలున్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈరోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటితరం మహిళా వైద్యులకుస్ఫూర్తి నిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగికవేధింపులు,



ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్ ఆనందీబాయి జోషి (1886), డాక్టర్ కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా ఎదిగారు. ప్రస్తుతం ఎంబిబిఎస్ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60శాతం), గైనకాలజీ (60శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళావైద్యురాలు), డాక్టర్ కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియో థెరపిస్ట్), డాక్టర్ ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ) ఆధ్వర్యంలోనే జన్మించారు. డాక్టర్ మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్ గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. భారతదేశంలోని మహిళా వైద్యులు నేడు తీవ్రమైన వృత్తికుటుంబ సంఘర్షణ, లింగ పక్షపాతం, పరి మిత కార్యాలయ అభద్రత, వివక్షత, వేధింపులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వైద్యులకు వృత్తివ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువబిడ్డలు, బాలికలను వైద్య రంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్య రంగప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం రోజు మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగుల సహాయపడడం, స్నేహితుల ప్రోత్సాహం అందించడం, కుటుంబ సభ్యుల చేయూత, ఇతర వైద్యుల సహకారం, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యం అని భావిద్దాం. •

# 'తెలంగాణ రైజింగ్'లో దావోస్ పెట్టుబడులు

ఐ.వి.మురళీకష్ణ శర్మ

రాజ నీతిజ్ఞుడు చాణక్య ఆర్థిక రంగంపై చేసిన సూచనలు వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వ పాలకులకు కూడా కీలకమైనవి. చాణక్య నీతి ప్రకారం అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ పూర్తిగా సద్వినియోగం పర్చుకుంటూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ పేదరికాన్ని నిర్మూలించవచ్చు. ఈసూత్రాన్ని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తుంది. రాష్ట్ర భవిష్యత్, అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఇందుకు కావాల్సిన ఆర్థిక వనరులను పెంచుకోవడామే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం వేస్తున్న అడుగులు విజయవంతం అవుతున్నాయి. దావోస్ వేదికగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తూ గత రెండు పర్యాయాలు భారీ పెట్టుబడులు సాధించిన తెలంగాణ ఇప్పుడుమరోసారి2026లో కూడా దావోస్ సమ్మిట్‌ను దిగ్విజయంగా వినియోగించుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 2025 గ్లోబల్ సమ్మిట్ 2026 దావోస్ సమ్మిట్ తెలంగాణలో పెట్టుబడులకు సోపానంగా మారింది. రాష్ట్రం ప్రగతిపథంలో పయనించాలంటే బలమైన ఆర్థిక పునాదులుండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలుసఫలమవుతున్నాయి. భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 2024 నాటికి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. 2025 గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్రప్రభుత్వం 5.75లక్షల రూపాయాల పెట్టుబడులు సాధించింది. అంతేకాక ఈ సమావేశాలతో రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాలు ప్రపంచానికి చాటిచెప్పడంలో 2026 దావోస్‌వేదికగా జరిగిన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం నెరవేరింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ బృందం పలు దేశ, విదేశీ కంపెనీలతో పెట్టుబడులపై అవగాహన కుదుర్చుకుంది. రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ ఫ్యాక్టరీ, రూ. 6000 కోట్లతో న్యూక్లర్ సంస్థ విద్యుత్ ప్లాంట్, రూ. 3500 కోట్లతో లోరియల్ జీసీసీ, రూ.వెయ్యి కోట్లతో సర్గాడ్ విమానాల మరమ్మతు యూనిట్ ఏర్పాటు, రూ.5 వేల కోట్ల పెట్టుబడితో యూపీసీ వోల్డ్ డేటా సెంటర్, రూ.623 కోట్లతో స్నైడర్ సంస్థ యూనిట్ల విస్తరణ, నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ గ్రూప్ 100 మెగావాట్ల సామర్థ్యంతో ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్, రూ.150 కోట్లతో గోద్రేజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణకు దావోస్ వేదికగా తెలంగాణతో అవగాహన కుదుర్చుకున్నాయి. ఇవేకాక మరిన్ని కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తూ ప్రణాళికలు రూపొందిస్తూ తెలంగాణ బృందంతో చర్చలు జరిపాయి. కంపెనీలు, పెట్టుబడులతో రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు కూడా పెరగనున్నాయి. ఉదాహరణకు రష్మి స్టీల్ ప్లాంట్‌తో 12వేలమందికి, యూపీసీ వోల్డ్ డేటా సెంటర్ ద్వారా 4 వేల మందికి, యూపీసీ రెవెన్యుబుల్స్ కంపెనీతో నిర్మాణ దశలోనే 3వేల మందికి ఉపాధి లభించనుంది. లోరియల్ కంపెనీ తన కొత్త గ్లోబల్ టెక్ హబ్ ఏర్పాటు కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడంతో ఏఐ నిపుణులు, టెక్ ఇంజినీర్లు, డేటా సైంటిస్టులకు 2వేలకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. దావోస్ వేదికగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు నూతన విధానాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ యూఎస్ డాలర్లు అంటే 2.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా తెలంగాణ లైఫ్ సైన్స్ పాలసీ (2026-30) రూపొందించింది. రాష్ట్రాన్ని ప్రపంచంలోని అగ్రగామి ఐదు లైఫ్ సైన్స్ క్లస్టర్లలో ఒకటిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గ్రీన్ ఫార్మాసిటీ అండ్ ఫ్లాగ్ షిప్‌ఫార్మా విలేజెస్ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. రూ. వెయ్యి కోట్లతో నిధితో ఈరంగంలో నూతన ఆవిష్కరణను ప్రోత్సాహించనుంది. 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి టాటా గ్రూప్‌తో చర్చలు జరపడంతో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు క్రీడా మైదానాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి వారుముందుకొచ్చారు. తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఉన్న సానుకూలమైన అవకాశాలు, అనుకూల వాతావరణం, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రూపొందించిన విధానాలను దావోస్ సమ్మిట్‌లో పంచుకున్న సీఎం కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రతిఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం దానికి అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో జూలై, ఆగస్టు నెలల్లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. దీని ద్వారా దావోస్ ఒప్పందాలను, పురోగతిని సమీక్షించడంతో పాటుప్రభుత్వం, కంపెనీల మధ్య సమన్వయం పెరిగే అవకాశాలుంటాయి. ఈ ప్రతిపాదన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. మరోవైపు తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలు, రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రణాళికలు దావోస్‌లో పెట్టుబడుదారులను ఆకర్షించాయి. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా మూడు జోన్ల నమూనాతో పాటు క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో గ్రేటర్ నగరంలో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా తదితర రంగాలకు గ్రేటర్ హైదరాబాద్ అనుకూలంగా ఉండడంతో పాటు ఇక్కడున్న స్థానికంగా ఉన్న సహజ వనరులు, మానవ వనరులతో కూడా తెలంగాణ పెట్టుబడులకు సానుకూలంగా మారింది. అంతేకాక నగరం చుట్టూ ఓఆర్ఆర్, రహదారులు, నగరం నలువైపులా మెట్రో రైలు విస్తరణ వంటి రవాణా సౌకర్యాలు పెంపుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్న ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒక్కొక్కటీ సఫలీకృతం అవుతండడంతో తెలంగాణకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. దావోస్ వేదికగా 2024లో రూ. 40,832 కోట్లతో 18పరిశ్రమలు, 2025లోరూ.1,78,950 కోట్లతో 26 పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్న తెలంగాణ ప్రభుత్వం వరుసగా మూడోసారి దావోస్‌లో మరిన్ని పెట్టుబడులను సాధించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులకు కేంద్రంగా మారుతోంది. హైదరాబాద్, సికింద్రా బాద్, సైబరాబాద్ నగరాలకు తోడుగా నాలుగో నగరం ఫ్యూచర్ సిటీ నిర్మిస్తుండటంతో పెట్టుబడులకు అనుకూలంగా మారింది. ఈనాలుగో నగరంలో ఐటీ అభివృద్ధితో పాటు ఆపిల్ ఫోన్ విడిభాగాల పరిశ్రమ, ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ యూనిట్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ప్రాధా న్యతిస్తున్నారు. ఇక్కడ ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, వినోద కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు రేస్ క్లబ్, గోల్ఫ్ క్లబ్, ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంటోంది. దావోస్‌లో వరుసగా మూడోసారి ధమాకాతో తెలంగాణ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించింది. •

## పాక్ నుంచి వలస వచ్చిన కుటుంబీకులకు ఇళ్లు

### ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** పాకిస్తాన్ నుంచి వలస వచ్చి, ఇక్కడే ఉండిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్ నుంచి కొంతకాలం క్రితం వలస వచ్చిన హిందువులు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ముఖ్యంగా మజ్ను కా తిలా ప్రాంతంలోని, సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద ఎక్కువగా నివసిస్తున్నారు. అయితే, వీరి నివాసాలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుండటంతో నిత్యం భయంతో బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో వీరికి భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పించడంతోపాటు, ఇండ్లు మంజూరు చేసేలా ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు తాజాగా కీలక ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పాక్ నుంచి వచ్చిన హిందూ దళితులకు కేవలం భారత పౌరసత్వం ఇస్తే సరిపోదని, గౌరవంగా బతికేలా ఇండ్లు కూడా ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలాగే, ఇతర పునరావాస చర్యలకు కూడా కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి నాలుగు వారాల్లోగా సమాధానం తెలపాలని సూచించింది. ఆక్రమణల తొలగింపు లేదా అభివృద్ధి పనుల కోసం నివాసాల్ని తొలగిస్తే దళితులు ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది. వీరి నివాసాల తొలగింపును ఆపేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 250 కుటుంబాలు పాక్ నుంచి వచ్చి జీవిస్తున్నాయి. దాదాపు వెయ్యి మంది వరకు ఉంటారని అంచనా. కొన్నేళ్లుగా ఉంటున్న వీరికి సరైన జీవన భద్రత లేకుండా పోయింది.

## ఫాస్టాగ్ వ్యవస్థలో హైవేస్ అథారిటీలో సంస్కరణలు

### వాహన వివరాలు ధృవీకరణ బాధ్యత బ్యాంకులదే..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థఎన్‌హెచ్ఎఐ ఒక కీలకమైన సంస్కరణలు తెచ్చింది. ఇందులో భాగంగానే ఫాస్టాగ్ యాక్టివేషన్ సమయంలో వాహన వివరాలను ధృవీకరించే పూర్తి బాధ్యతను బ్యాంకులకే అప్పగించింది. ఇప్పటివరకు వాహన యజమానులు అన్ని చెల్లుబాటుఅయ్యే పత్రాలు సమర్పించి ఫాస్ట్‌ట్యాగ్ పొందిన తర్వాత ఈకెవైవి(నోయువర్ వెహికల్) పూర్తి చేసుకోవాల్సి ఉండేది. దాంతో యాక్టివేషన్ ఆలస్యం కావడం, టోల్ ప్లాజాల వద్ద ఇబ్బందులు ఎదురవడం, రిఫండ్స్ నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురయ్యేవి. కొత్త విధానంతో ఫాస్ట్‌ట్యాగ్ జారీ తర్వాత ప్రత్యేకంగా ఈకేవైవీ పూర్తి చేయాల్సిన అవసరం లేదు. బ్యాంకులు ముందుగానే వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరిస్తాయి. ఫలితంగాఫాస్టాగ్ జారీ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఇది లక్షల మంది వాహన వినియోగదారులకు మేలు చేస్తుంది. ఈకేవైవీ సడలింపు కేవలం కొత్తగా జారీ అయ్యే ఫాస్ట్‌ట్యాగ్‌లకు మాత్రమే కాకుండా ఇప్పటికే జారీ చేసిన వాటికి కూడా వర్తిస్తుంది. కాబట్టి ఇకపై కేవైవీ తప్పనిసరి కాదు.

# దేశభక్తులెవరో ప్రజలకు తెలుసు!

### రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడరగడ

### ప్రచురితం కాని పుస్తకాన్ని ప్రస్తావించవద్దన్న రాజ్‌నాథ్, అమిత్ షా

### స్పీకర్ జోక్యం, మైక్ కట్‌చేసిన ఓం బిర్లా

### రాజ్యసభలోనూ గందరగోళం, పలుమార్లు వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ ఎంఎం నరవాణే రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించడం రాజకీయ దుమారానికి దారితీసింది. సభకు పదే పదే అంతరాయం కలిగించింది. సభ నియమాలను ఉటంకిస్తూ, విడుదల కాని పుస్తకం నుండి గాంధీ చదవడంపై రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, కిరణ్ రిజిజుతో సహ సీనియర్ మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో లోక్‌సభలో విధానపరమైన, ప్రవర్తనా నియమాల నియమం 349(ఐ)ని ప్రస్తావిస్తూ, స్పీకర్ ఓం బిర్లా గాంధీని పుస్తకం నుండి కోట్ చేయవద్దని ఆదేశించారు. అయినప్పటికీ, రాహుల్‌గాంధీ ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ, దాని ఆధారంగా కారవాన్ మ్యాగజైన్ కథనాన్ని ప్రస్తావించడం కొనసాగించారు, దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదానికి దారితీసింది. ఒక సమయంలో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, చైర్ తీర్పును ధిక్కరించే సభ్యులతో ఎలా వ్యవహరించాలో కూడా సభ చర్చించాలని అన్నారు. 349వ నియమం ప్రకారం సభలో సభ్యులు పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. క్లాజు (ఐ) ప్రకారం సభ వ్యవహారాలకు సంబంధించి తప్ప సభ్యుడు ఏ పుస్తకం, వార్తాపత్రిక లేదా లేఖ చదవకూడదు". పుస్తకం, దాని విషయాల గురించి తాను ప్రస్తావించడం రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించినదని, కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నిస్తున్న బిజెపి ఎంపీ తేజస్వి సూర్య ఆరోపణలకు ప్రతిస్పందనగా అని గాంధీ వాదించగా, సీనియర్ మంత్రులు తాను ఒక పత్రిక వ్యాసం లేదా ప్రచురించని పుస్తకం నుండి కోట్ చేయలేనని వాదించారు. ఎవరు దేశభక్తులో ఎవరు కాదో ఈ దేశ ప్రజలకు తెలుసని రాహుల్‌గాంధీ అన్నారు, భారతదేశం-చైనా మధ్య 2020 సైనిక ప్రతిష్టంభనకు సంబంధించిన భాగాలను చదవడానికి ప్రయత్నించే ముందు. రాజ్‌నాథ్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మళ్లీ రభస చోటుచేసుకుంది. పుస్తకం ప్రచురించబడిందా అని అడిగారు, ప్రచురించబడని రచన నుండి కోట్ చేయడం సరికాదని వాదించారు. పుస్తకం కాపీని కూడా సమర్పించమని రాహుల్‌గాంధీని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. ప్రతిపక్ష నేత తన ప్రసంగం కొనసాగిస్తూ, "భారత భూభాగంలోకి నాలుగు చైనా ట్యాంకులు ప్రవేశించాయి" అని ప్రస్తావించగా, రాజ్‌నాథ్ సింగ్ తన సీటు నుండి లేచి మరోమారు అభ్యంతరం వ్యక్తంచేశారు, దీంతో రాహుల్‌కు అండగా, కె.సి. వేణుగోపాల్ జతకలిశారు. అమిత్ షా జోక్యం చేసుకుంటూ, "పత్రికలు ఏదైనా రాయవచ్చు... పుస్తకం ప్రచురించబడలేదని ఆయన చెబుతున్నారు. పుస్తకం ప్రచురించబడకపోతే, దానిని ఎలా కోట్ చేయవచ్చు?" అని అన్నారు. "సభను తప్పు దారి పట్టించ చడానికి ప్రయత్నించవద్దు... ఇక్కడ అనవసర మైన విషయాలు చెప్పకూడదు. అతను ఉటంకిస్తున్న ఈ పుస్తకం ప్రచురించబడలేదు" అని సింగ్ అన్నారు. సభ "నియమాలు, ప్రక్రియ మరియు సంప్రదాయం" ప్రకారం పనిచేస్తుందని బిర్లా రాహుల్ గాంధీకి పదేపదే గుర్తు చేశాడు, కానీ రాహుల్ పుస్తకంలోని ప్రస్తావిస్తూ ప్రసంగించడానికి ప్రయత్నించగా, స్పీకర్ మైక్ కట్ చేశారు. దీంతో సభలో మరోమారు గందరగోళం నెలకొంది. సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, ఇలాంటి దృశ్యాలు కనిపించినప్పుడు ప్రతిపక్ష నేత మళ్ళీ ఈ అంశాన్ని లేవనెత్తారు. "ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. చైనా దళాలు.. బలగాలు మన బలగాల ముందు ఉన్నాయి. మన బలగాలకు తూర్పు లడఖ్‌లో కైలాష్ శ్రేణి ఉంది.. చైనా దళాలు.." అని రాహుల్ గాంధీ అన్నారు, సింగ్ మరోసారి అభ్యంతరం వ్యక్తం చేశారు.ఒక సభ్యుడు ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతున్నాడని షా లేవనెత్తాడు, నిషికాంత్ దూబేను ప్రస్తావిస్తూ, ఆయన రూల్ 349(ఐ)ని ఉదహరించారు. కాంగ్రెస్ హయాంలో సల్మాన్ రష్దీ ది సాటానిక్ వెర్సెస్‌ను నిషేధించిందని, బిజెపి నాయకులు అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కె అద్వానీ పుస్తకం గురించి చర్చించడానికి అనుమతించలేదని ఎత్తి చూపారు."ఒక పరిమితి ఉంది" అని రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని నామినేటెడ్ సభ్యుడు, బిజెపి నాయకుడు సి. సదానందన్ మాస్టర్ ప్రవేశపెట్టడంతో ప్రతిపక్ష సభ్యుల నుండి, ముఖ్యంగా సిపిఐ(ఎం) సభ్యుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమైంది. 1994లో రాజకీయ ప్రేరేపిత దాడిలో రెండు కాళ్లను కోల్పోయిన కేరళకు చెందిన మాజీ ఉపాధ్యాయుడు,ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన మాస్టర్, సభలో కూర్చున్నప్పుడు తన కృత్రిమ అవయవాలను తన పక్కన ఉన్న టేబుల్‌పై ఉంచారు. సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ వెంటనే సభలో కృత్రిమ అవయవాల ప్రదర్శనను వ్యతిరేకిస్తూ, వస్తువులను ప్రదర్శించ కూడదనే నియమాలను ఉటంకిస్తూ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు. చైర్మన్ ఆందోళనను అంగీకరించారు. వాటిని తొలగించమని సభ్యుడిని ఆదేశిస్తానని సూచించారు, కానీ "మీరు (మిస్టర్ బ్రిట్టాస్) సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్నప్పుడు కఠినతను పాటించాలన్నారు.

## బీహార్‌లో 150కి పైగా కాకులు మృతి



**బర్డ్‌ఫ్లూ అనుమానంతో పరీక్షలకు పంపిన నమూనాలు**

**పాట్నా, ఫిబ్రవరి 2:** బీహార్‌లోని నౌగాచియా ప్రాంతంలో సుమారు 150కుపైగా కాకులు మరణించడంతో నామూనాలు సేకరించి ల్యాబ్స్‌కు పంపారు. బర్డ్ ఫ్లూ కారణంగా ఆ కాకుల చనిపోయినట్లు నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గతనెల 11న నౌగాచియా సబ్‌డివిజన్‌లో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వారు వందలాది కాకులు మరణించడాన్ని గమనించారు. ఇతర పక్షులు కూడా అలాంటి స్థితిలో ఉండటం చూశారు. ఆందోళన చెందిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన పక్షులను సురక్షితంగా తొలగించారు. అటవీ, పశుసంవర్ధక శాఖల సంయుక్త బృందం కలిసి సీరం నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం పాట్నా, భోపాల్‌లోని ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఆ కాకులు మరణించినట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు భాగల్పూర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభావిత జోన్ పరిధిలోని 10 కిలోమీటర్ల వరకు శానిటైజేషన్ డ్రైవ్ చేపట్టింది. చుట్టుపక్కల ప్రాంతంలోని కోళ్ల ఫారాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. బర్డ్ ఫ్లూపై నిఘా, పర్యవేక్షణను ముమ్మరం చేశారు. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

అనారోగ్యం చెందిన లేదా మరణించిన పక్షులను తాకవద్దని సూచించారు. పక్షుల మరణాలు గుర్తించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

## ఆర్మీజవాన్‌ను కారు బాయ్‌నెట్‌పై కిలోమీటరు ఈడ్చుకెళ్లిన దుండగులు!

**భోపాల్,ఫిబ్రవరి 2:** రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను కారు బానెట్‌పై డ్రైవర్ ఈడ్చుకెళ్లాడు. గాయపడిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదిత్య పురంలోని గణేష్ కాలనీలో రిటైర్డ్ సైనికుడు కళ్యాణ్ కిషోర్ కాంత్ శర్మ నివసిస్తున్నారు. ముందురోజు రాత్రి 11 గంటల సమయంలో తన బంధువుతో కలిసి బయట డిన్నర్ తర్వాత కారులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. భిండ్ రోడ్డులోని రద్దీగా ఉండే ఆదిత్య హోటల్ సమీపంలో రిటైర్డ్ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ కారు మరో కారును స్వల్పంగా రాసుకున్నది. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆయనను తిట్టారు. గొడవకు దిగడంతో పాటు మాజీ జవాన్, ఆయన బంధువును కొట్టారు. మరోవైపు ఇది చూసి జనం గుమిగూడారు. దీంతో అక్కడి నుంచి కారులో పారిపోయేందుకు ఆ వ్యక్తులు సిద్ధమవ్వగా అడ్డుకునేందుకు కళ్యాణ్ కిషోర్ కాంత్ ప్రయత్నించారు. కారు ముందు ఆయన నిల్చొని ఉన్నప్పటికీ ముందుకు దూకించారు. అయితే అదుపుతప్పిన మాజీ జవాన్ ఆ కారు బానెట్‌పై పడ్డారు. దానిని గట్టిగా పట్టుకుని ప్రమాదకరంగా వేలాడారు. అయినప్పటికీ కారును వారు ఆపలేదు. సుమారు కిలోమీటరు దూరం వరకు అలాగే ఈడ్చుకెళ్లారు. ఆ తర్వాత సడన్ బ్రేక్ వేయడంతో మాజీ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ రోడ్డుపై పడ్డారు. కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. ఒక నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మరో నిందితుడి కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను కారు బానెట్‌పై ఈడ్చుకెళ్లిన వీడియో క్లిప్ వైరల్ అయ్యింది.

## జమ్ముకాశ్మీర్‌లో భూకంపం - రిక్టర్‌స్కేలుపై 4.8గా గుర్తింపు

**శ్రీనగర్, ఫిబ్రవరి 2:** జమ్ముకశ్మీర్‌లో సోమవారం ఉదయం భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రాథమిక సమాచారం మేరకు ఈ తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.8గా నమోదైంది. ఈ ఉదయం గం.5:35 ప్రాంతంలో భూప్రకంపనలు సంభవించాయి. ఒక్కసారిగా భూమి కంపించడంతో జనం భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బుద్గామ్ జిల్లాలో 33.9 డిగ్రీస్ నార్త్.. 74.76 డిగ్రీస్ ఈస్ట్ కోఆర్డినేట్స్ వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్స్ (జీఎఫ్‌జెడ్) తెలిపింది. భూకంపం సంభవించిన సమయంలో ఎపిక్ సెంటర్ ప్రాంతంలో మేఘాలు కమ్మేశాయి. ఉష్ణోగ్రత మైనస్ 0.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. తేమ శాతం 95 శాతంగా ఉండగా, పశ్చిమ దిశగా సెకనుకు 1 మీటరు వేగంతో తేలికపాటి గాలి వీచింది. భూప్రకంపనల కారణంగా 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న చారర్ ఐ షరీఫ్, 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్వామా, 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్, సోపియాన్‌లో భూమి కంపించింది. నిపుణుల అంచనాల ప్రకారం.. ఈ భూప్రకంపనల వల్ల విడుదలైన భూకంప శక్తి సుమారు 12 రెట్లు ఎక్కువ ఉన్నట్లు అంచనా. సుమారు 278 మెగావాట్ అవర్స్ లేదా 239 టన్నుల టిఎన్‌టి పేలుడుశక్తికి సమానంగా ఈ ప్రకంపనలున్నాయి. ఈ విద్యుత్‌అయస్కాంతశక్తి స్థాయి సహజంగా ప్రజలను నిద్రలేపేస్థాయిలో ఉండటంతోపాటు వారిన భయాందోళనలకు గురిచేస్తుంది. నేషనల్ సీస్మాలజీ సెంటర్‌ప్రకారం సోమవారంఉదయం అండమాన్ నికోబార్ దీవుల్లోను భూప్రకంపనలు సంభవించాయి. తెల్లవారురుఝామున 3.31 గంటలప్రాంతంలో కంపించడంతో రిక్టర్‌స్కేలుపై 4.6గా నమోదయింది. నికోబార్ ప్రాంతంలో పదికిలోమీటర్ల లోతున ఈ భూకంపం కేంద్రీకృతం అయినట్లు సీస్మాలజీ అధికారులు తెలిపారు.



## పాక్‌భద్రతా దళాలపై ఫిదాయిూల దాడులు

### 200 మందిని మట్టుబెట్టినట్లు బలోచ్ ప్రకటన

**క్వెట్టా, ఫిబ్రవరి 2:** పాక్ భద్రతా దళాలు ఇపుడు వణికిపోతున్నాయి. పరేషన్ హెరోఫ్ పదం పేరుచెపితేనే కలవరపడుతున్నారు. ఈ దాడుల్లో అత్యంత భయానకమైన అంశం ఏమిటంటే తొలిసారిగా మహిళా ఫిదాయిన్లు ఆత్మాహుతి బాంబర్లు ముందుండి దాడులు చేయడం. ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 200 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్లు బీఎల్ఏ సంచలన ప్రకటన చేసింది.బీఎల్ఏకి చెందిన అత్యంత ప్రమాదకరమైన "మజీద్ బ్రిగేడ్"ఈ దాడులకు నాయకత్వం వహించింది. శక్తిమంతమైన ఐఈడీ పేలుళ్లు, ఆత్మాహుతి దాడులతో పాక్ సైనిక స్థావరాలను ఛిన్నాభిన్నం చేశారు. ఈ ఆపరేషన్‌లో 11 మంది మహిళా ఫిదాయిన్లు తమను తాము పేల్చుకుని పాక్ సైన్యానికి భారీ నష్టం చేకూర్చినట్లు తెలుస్తోంది. పాక్ సైన్యానికి చుక్కలు చూపించిన ఈ పోరులో తమ యోధులు కూడా ప్రాణాలు కోల్పోయారని బీఎల్ఏ ప్రకటించింది. మరణించిన 18 మందిలో 11 మంది మజీద్ బ్రిగేడ్ ఆత్మాహుతి సభ్యులు కాగా, మిగిలిన వారు ఫతే స్క్వాడ్ మరియు ఎస్టీఓఎస్ విభాగానికి చెందిన వారని వెల్లడించింది. దశాబ్దాలుగా సాగుతున్న బలూచ్ పోరాటంలో మహిళలు ఇలా ప్రత్యక్షంగా ఆత్మాహుతి దాడులకు దిగడం పాక్ రక్షణ విభాగాన్ని ఆందోళనలో పడేసింది.


## డొనాల్డ్ ట్రంప్ సంస్థకు కనకవర్షం

### అధ్యక్షుడి కుటుంబంతో స్లైషేక్ డీల్!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టో కరెన్సీకి ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆయన రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ కరెన్సీ విలువ దూసుకెళ్లింది కూడా. ఆ వ్యాపారంలో ట్రంప్ కుటుంబానికి కనకవర్షం కురుస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌తో డీల్ కుదుర్చుకోగా.. యుఎఇతో జరిగిన ఒప్పందం గురించి తాజాగా వెల్లడైంది. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2025లో ట్రంప్ ప్రమాణస్వీకారానికి ముందు వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థతో యుఎఇలోని అబుదాబీ రాజ కుటుంబానికి చెందిన షేక్ తహనూన్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. 500 మిలియన్ డాలర్లతో 49 శాతం వాటా కొనుగోలు చేశారని ఆ కథనాలు వెల్లడించాయి. కొనుగోలుదారులు సగం ముందస్తుగా చెల్లిస్తారు. అందులో ట్రంప్ కుటుంబసభ్యులకు 187 మిలియన్ల డాలర్లు వెళ్తాయి. ఈ డీల్‌పై అధ్యక్షుడి కుమారుడు ఎరిక్ ట్రంప్ కూడా సంతకం చేశారు. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి యుఎఇకి ఎఐ హార్డ్‌వేర్ అందనుంది. అంతకుముందు జోబైడెన్ హయాంలో దీనికోసం ప్రయత్నించినా వీలు కాలేదు. స్పై షేక్‌గా పేరుపొందిన షేక్ తహనూన్.. యుఎఇ అధ్యక్షుడి సోదరుడు. అలాగే జాతీయ భద్రతా సలహాదారు. ప్రభుత్వానికి చెందిన వెల్త్‌ఫండ్‌కుకు అధిపతి కూడా. డొనాల్డ్ ట్రంప్ కుమారులు ఎరిక్, డొనాల్డ్ జూనియర్, అల్లుడు జేరెడ్ కుష్నర్‌లు కలిసి 2024లో వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థను ప్రారంభించారు. దీంతోపాటు ఎరిక్, డొనాల్డ్ జూనియర్‌లు అమెరికన్ బిట్ కాయిన్ ఇన్‌కార్పొరేటెడ్ పేరిట ఓ బిట్‌కాయిన్ మైనింగ్ కంపెనీని ఏర్పాటు చేశారు. వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ ప్రతినిధులు గత యేడాది ఏప్రిల్‌లో పాక్‌కు వచ్చి ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ సమక్షంలో 'పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌తో ఒప్పందం చేసుకున్నారు.

## శబరిమలైలో చిత్రం షూటింగ్‌పై విజిలెన్స్ నివేదిక



**నిబంధనలు ఉల్లంఘించి షూటింగ్ జరిగిందని వెల్లడి**

**పతనంతిట్ట,ఫిబ్రవరి 1:** ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో మరో వివాదం రాజుకుంది. ఇప్పటికే బంగారం చోరీ కేసు ఆరోపణలతో వార్తల్లో ఉన్న ఈ ఆలయంలో, ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపినట్లు దేవస్వోం విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పవిత్ర సన్నిధానం పరిసరాల్లో ఆంక్షలు ఉల్లంఘించి చిత్రీకరణ జరిపినట్లు తేలింది. దేవస్వం విజిలెన్స్ ఎస్పీ సునీల్ కుమార్ సమర్పించిన నివేదిక ప్రకారం, ఒక సినిమా చిత్రీకరణను పంపానది పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పలు రోజుల పాటు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన మకరవిళక్కు రోజున సైతం శబరిమల ఆలయ సముదాయానికి సమీపంలోని ఒక కొండపై చిత్రీకరణ జరిపినట్లు నివేదిక స్పష్టం చేసింది. సన్నిధానంలో ఎలాంటి షూటింగ్ జరపలేదని చిత్ర దర్శకుడు అనురాజ్ మనోహర్ గతంలో చేసిన వాదనలను ఈ నివేదిక తోసిపుచ్చింది. ఈ చిత్రీకరణపైఇప్పటికే దర్శకుడిపై కేసు నమోదైంది. ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగినప్పటికీ, దీనికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి పొందినట్లు విజిలెన్స్ నివేదికలో ప్రస్తావన లేకపోవడం గమనార్హం. షూటింగ్‌కు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన ఈ నివేదికను ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల కోసం బోర్డు న్యాయ నిపుణుల సలహాను కోరింది. చిత్రీకరణ సమయంలో జరిగిన ఉల్లంఘనలను గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని న్యాయ విభాగాన్ని అధ్యక్షుడు ఆదేశించారు. న్యాయసలహా అందిన తర్వాతే బాధ్యులపై పరిపాలనాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మండలమకరవిళక్కు యాత్ర సమయంలో భక్తుల రద్దీ, ఆలయ పవిత్రత దృష్ట్యా కఠినమైన నియమాలు అమల్లో ఉండగా ఈ ఘటన జరగడం వివాదాన్ని మరింత పెంచింది.

## సంక్షిప్తంగా..

### చైనాలో నలుగురికి మరణశిక్ష



**బీజింగ్, ఫిబ్రవరి 2:** చైనాలో మరో నలుగురికి మరణశిక్ష అమలైంది. మయన్మార్ కేంద్రంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ల్లోని సభ్యులకు ఈ శిక్షను అమలుచేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియెట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తోపాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గతేడాది కోర్టు ఈ శిక్ష విధించింది. ఆన్‌లైన్ మోసాలతోపాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌లపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన 11 మంది సభ్యుల నేర ముఠాకు మరణశిణను అముల చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

### దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా ఖండించిన చైనా



**బీజింగ్, ఫిబ్రవరి 2:** టిబెట్ బౌద్ధమత గురువు దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఆయన ఈ గుర్తింపును ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీటెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో దలైలామా ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 యేళ్ల వయసులో తొలి గ్రామీ అవార్డును అందుకుని అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ వ్యవహారంపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో స్పందించారు. ఆయన పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని ఆరోపించారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని పేర్కొన్నారు.

### బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలుశిక్ష



**ఢాకా, ఫిబ్రవరి 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు ఖరారు చేశారు. ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్ధిక్, అజ్మినా సిద్ధిక్‌లకు కూడా రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో శిక్ష పడింది. రాజుక్ న్యూటౌన్ ప్రాజెక్టుకు సంబంధం ఉన్న ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో అవినీతి జరిగినట్లు షేక్ హసీనాతోపాటు ఆమె బంధువులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢాకాలోని కోర్టు-4కు చెందిన ప్రత్యేక జడ్జి రాబిల్ ఆలమ్ సోమవారం ఆ కేసులో తీర్పును వెలువరించారు. ఒక్కొక్క కేసులో అయిదేళ్ల చొప్పున, మొత్తంగా హసీనాకు పదేళ్ల జైలుశిక్ష ఖరారు చేశారు. తులిప్ సిద్ధిక్‌కు నాలుగేళ్లు, ఇక హసీనా మేనకోడళ్లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల శిక్షను వేశారు.

### రష్యా దాడిలో 15 మంది ఉక్రెయిన్ పౌరుల మృతి

**కీవ్, ఫిబ్రవరి 2:** యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు జరుగుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా నిప్రో నగరంపై రష్యా డ్రోన్ దాడి జరిపింది. ఈ దాడిలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రాణాలు కోల్పోగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా గని కార్మికులేనని అధికారులు గుర్తించారు. దాడికి గురైన బస్సు తమ సంస్థకు చెందినదేనని ఉక్రెయిన్‌లో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ డీటీఈకే వెల్లడించింది. నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలోని డీటీఈకే గనులను లక్ష్యంగా చేసుకుని రష్యా పెద్దఎత్తున దాడులకు పాల్పడిందని సంస్థ ఆరోపించింది. షిఫ్ట్ ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో కార్మికుల బస్సుపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలిపింది.

### బడ్జెట్‌లో కేరళకు అన్యాయం అంటూ ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేరళకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కేరళ వ్యతిరేక బడ్జెట్ అని మండిపడ్డారు. బడ్జెట్‌లో కేరళకు అన్యాయం జరిగిందని, బడ్జెట్‌లో కేరళ పేరు కూడా ప్రస్తావించకపోవడం దారుణమని అన్నారు. కేరళకు ఆయుర్వేద యూనివర్సిటీ కేటాయిస్తారని ఆశించామని, కేంద్ర మంత్రి ఆయుర్వేద యూనివర్సిటీని స్థాపించనున్నట్లు ప్రకటించినా, అది ఎక్కడ అనే విషయం మాత్రం వెల్లడించలేదని అన్నారు.





# పోలవరం ప్రాజెక్టుకు అడ్వాన్సుగా రూ.3,320 కోట్లు

● రాజధాని అమరావతికి రూ.1,561 కోట్లు ● కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

● రవాణా, పర్యాటకరంగాలకు ఊతం ● పల్లె ప్రగతికి భారీగా నిధులు మంజూరు

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం జాతీయ ప్రాజెక్టుకు వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో ముందస్తు చెల్లింపు(అడ్వాన్సుగా)కింద రూ.3,320 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మూడు కేంద్ర బడ్జెట్లలోనూ కలిపి పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన నిధులు రూ.11,850 కోట్లు. ఈ నిధులన్నీ కేంద్రం ప్రాజెక్టుకు అడ్వాన్సుగా కేటాయించినవే. అంటే పనులు చేయక ముందే రాష్ట్ర సింగిల్ నోడల్ ఖాతాకు కేంద్రం నిధులు బదిలీ చేస్తోంది. 2025-26లో రూ.5,936 కోట్లు కేటాయించింది. ఇందులో 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రం రూ.4,318.96 కోట్లు ఖర్చు చేసింది. అడ్వాన్సుగా ఇచ్చిన నిధుల్లో 80శాతం ఖర్చు చేశారు. అందువలన మూడో విడత అడ్వాన్సు నిధులు విడుదల చేయాలంటూ పోలవరం ప్రాజెక్ట్ అధికారులు జనవరిలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఈ నెలలో రానున్నాయి. 2024-25లో కేంద్రం అడ్వాన్సుగా ఇచ్చిన రూ.5,512.40 కోట్లనే రాష్ట్రం వినియోగించడంతో గత బడ్జెట్‌లో కేటాయించిన 5,936 కోట్ల అవసరం పడలేదు. దీంతో ఆ కేటాయింపును రూ.3,017.40 కోట్లకు కేంద్రం తాజాగా సవరించింది. దీనిలో ప్రస్తుతం రూ.1,500 కోట్లు ఇచ్చి, అవి ఖర్చు చేసిన వెంటనే మరో రూ.1,500 కోట్లు ఇస్తామని చెబుతోంది. 2026-27 బడ్జెట్‌లో రూ.3,320కోట్లు కేటాయింపు చూపారు. తాజా కేటాయింపులతో పోలవరం ప్రాజెక్టుకు తొలి దశలో +41.15 మీటర్ల ఎత్తుకు నీళ్ల నిలబెట్టేలా పునరావాసం, పూర్తిస్థాయి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చినట్లవుతుంది. తొలిదశలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన రూ.12,157 కోట్లు కేంద్రం 2024జూన్ తర్వాత మంజూరు చేసింది. తాజా బడ్జెట్ కేటాయింపులు కూడా కలిపి ఇంతవరకు రూ.11,850 కోట్లు ఇచ్చినట్లవుతుంది. తొలి దశకు ఇక కేంద్రం కేటాయించాల్సింది కేవలం రూ.306 కోట్లే.

**రాజధాని అమరావతికి రూ.1,561 కోట్లు**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం లభించింది. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్లలో రూ.1561 కోట్లు కేటాయించారు. ఇందులో ఏడీబీ నుంచి రూ.1128.91 కోట్లు, ప్రపంచ బ్యాంకు సంస్థ ఐబీఆర్‌డీ నుంచి రూ. 432.09 కోట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాజధాని నిర్మాణాన్ని పట్టాలెక్కించిన కొన్ని నెలలకే ఏడీబీ, ప్రపంచబ్యాంకు సంయుక్తంగా రూ.15 వేల కోట్ల రుణం మంజూరు చేశాయి. వాటిలో ఆ బ్యాంకులు ఇస్తున్నది రూ.13,500 కోట్లు కాగా కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.1500 కోట్లు సమకూరుస్తోంది. కేంద్రం ఇచ్చే రూ.1500 కోట్లలో 750 కోట్లు ఇప్పటికే విడుదల అయ్యాయి.

ఇవే కాకుండా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రోత్సాహమిచ్చేలా అరకులో ట్రెక్కింగ్, హైకింగ్ మార్గాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి చేయనున్నట్లు బడ్జెట్లో తెలిపింది. పులికాట్ సరస్సులో పక్షుల్ని మరింత దగ్గర్నుంచి వీక్షించేందుకు వీలుగా బర్డ్ వాచింగ్ ట్రైల్స్‌కు ప్రాధాన్యం కల్పించనుంది. గ్రామీణ రహదారుల ప్రాజెక్టుకు ఏఐఐబీ నుంచి రూ.500.99 కోట్లు. ఏపీ సహజ వ్యవసాయ సాగు ప్రాజెక్టు కోసం జీఓడీఈ నుంచి రూ.155.32 కోట్లు. రహదారులు, వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టు కోసం ఎన్‌డీబీ నుంచి రూ.350 కోట్ల నిధులు రానున్నాయి. కేంద్ర నౌకాయాన శాఖ నుంచి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కు రూ.450 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.250 కోట్లు అంతర్గత వనరుల నుంచి, రూ.200 కోట్లు ఇతర మార్గాల నుంచి సమకూరుస్తారు. గత ఏడాది కేటాయించిన రూ. 730 కోట్లతో పోలిస్తే ఇది తక్కువే! రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.1,561 కోట్లు కేటాయించారు. కీలక ప్రాజెక్టులైన పోలవరానికి నిధులు కేటాయించారు. 2025-26 బడ్జెట్లో పోలవరం ప్రాజెక్టుకు రూ. 5,936 కోట్లు కేటాయించినా అంచనాల సవరణలో రూ. 3,017.20 కోట్లకు తగ్గింది. 202627 బడ్జెట్లో రూ.3,320.39 కోట్లు కేటాయించారు.

## రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చొద్దు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చొద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా టిడిపి, వైసిపి పార్టీలు పరస్పర దూషణలు, దాడులకు తెగ బడుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పవన్ కల్యాణ్, నారా లోకేష్ సొత్తుకాదన్నారు. ప్రజల ఆస్తియనేది అధికార, ప్రతిపక్షాలు గ్రహించాలని గుజ్జుల ఈశ్వరయ్య టిడిపి, వైసిపిలకు హితవు పలికారు.. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. మహనీయులు పరిపాలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుకు మచ్చతెచ్చే విధంగా ఏపీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలు చూస్తుంటే ప్రజాస్వామ్యం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజా సమస్యల్ని గాలికొదిలేసి కనీస అవగాహన లేకుండా తిరుపతి లడ్డూ వంటి ఆధ్యాత్మిక అంశాన్ని రాజకీయ అస్త్రంగా మార్చి, పరస్పర దూషణలకు పాల్పడడం ఆయా నేతల అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనంగా వ్యవహరించాల్సిందిపోయి వ్యక్తిగత దూషణలు, మహిళలను అవమానకరంగా మాట్లాడడం, పగ ప్రతీకారాలు, దాడులు, ప్రతి దాడులకు ఆస్కారమివ్వడం విచారకరమన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఎపికి తీవ్ర అన్యాయం

### రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని, 50 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌లో ఎపికి లభించింది గుండు సున్నా అని ఆమె విమర్శించారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రులను దగా చేసిన బడ్జెట్ అని, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కేంద్రం అణగదొక్కిందని ఆరోపించారు. ఈ బడ్జెట్‌పై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విభజన హామీలలో ఒక్కదానికీ దిక్కులేదు. ప్రత్యేక హోదా ఊసే లేదు. వెనకబడిన ఉత్తరాంధ్రకు, రాయలసీమకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. రాష్ట్ర జీవనాడి పోలవరానికి నిధులు కేటాయించకుండా జీవం తీశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కనికరం చూపలేదు, కడప స్టీల్ ప్లాంట్ వైపు కన్నెత్తి చూడలేదు. మెట్రో రైలు, పారిశ్రామిక కారిడార్ల ప్రస్తావనే లేదు" అని షర్మిల దుయ్యబట్టారు.

## చంద్రబాబుకు జగన్ క్షమాపణ చెప్పాలి

### టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి, ఆయన జీవితంలోని 53 విలువైన రోజులను గత జగన్ ప్రభుత్వం దొంగిలించిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుపై కేవలం రాజకీయ కక్షతోనే తప్పుడు కేసు బనాయించారని, ఇందుకు జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటికైనా జగన్‌కు నైతిక విలువలు ఉంటే చంద్రబాబుకు, ఆయన కుటుంబానికి, టిడిపి కార్యకర్తలు, అభిమానులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

## కబ్జా తొలగించేశారు

● రెవెన్యూ అధికారులపై ప్రసంశలు ● 'వార్త' కథనానికి స్పందన



ఆక్రమణ స్థలంలో కబ్జాదారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం




సోమవారం వార్త దినపత్రికలో ప్రచురితమైన కథనం

రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఫిబ్రవరి 2 ప్రభాత వార్త: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల కేంద్రం జెఆర్‌పురం వెంకటేశ్వరకాలనీ 16వ జాతీయ రహదారికి అనుకొని ఉన్న రణస్థలం రెవెన్యూలో సర్వేనెంబరు 4/3లో విలువైన ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసిన కథనాన్ని సోమవారం 'వార్త' పత్రికలో ప్రభుత్వ స్థలం దర్జాగా కబ్జా అని ప్రచురితమైంది. ఈ కథనంపై రెవెన్యూ యంత్రాంగం స్పందించి తహసీల్దార్ ఎస్ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు రణస్థలం గ్రామ రెవెన్యూ అధికారి వై.జగన్నాథం, గ్రామ సర్వేయర్ సౌజన్య ఆక్రమణ స్థలంలో కబ్జాదారులు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్‌ను తొలగించారు. రెవెన్యూ అధికారులు రేకుల ఫెన్సింగ్‌ను తొలగించిన మరొక్షణంలోనే కబ్జాదారులు మళ్లీ రేకుల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. దింతో రెవెన్యూ అధికారులు కబ్జాదారులను హెచ్చరించి అప్పటికప్పుడే ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్‌ను జేసీబీతో తెలగించారు. అంతేకాకుండా మరల స్థలంలో రేకుల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణ చేసిన స్థలానికి వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్‌ను పట్టువదలకుండా రెవెన్యూ అధికారులు తొలగించడంపై స్థానికులు ప్రసంశలు కురిపిస్తున్నారు.

## సిఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ

### కాపు కులాన్ని టార్గెట్ చేస్తున్నారంటూ మండిపాటు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: మాజీమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభరెడ్డి ముఖ్య మంత్రి చంద్రబాబుకు ఘాటు లేఖ రాశారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన విధించాలని ప్రధానిని కోరమని, ముఖ్యంగా కాపు ఓట్లతో గద్దెనెక్కి కాపు సామాజిక వర్గంపై కూటమి ప్రభుత్వం విషం కక్కుతుందని లేఖలో స్పష్టం చేశారు. వైసీపీ మాజీ మంత్రులు విడుదల రజిని, అంబటి రాంబాబు, జోగి రమేష్ లపై పోలీసులు దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ముద్రగడ ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు పదార్థాలు లేవని సిబిఐ రిపోర్టు ఇచ్చిందని దానిని కప్పిపుచ్చుకోవడానికి కూటమి నేతలు పడుతున్న పాట్లు ప్రజలు గమనిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పి విధ్వంసకరంగా మారిందని, రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన విధించినట్లయితే ప్రతిపక్ష పార్టీలను చంద్ర బాబు పరిపాలన ముగిసేంతవరకు జైలులో పెట్టడానికి ఉపయోగపడుతుందని ముద్రగడ అభిప్రాయం తమ లేఖ ద్వారా వ్యక్తం చేశారు.

### బాయిలర్ అటెండెంట్ మొదటి, రెండవ తరగతి

## పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ బాయిలర్ల శాఖలో బాయిలర్ అటెండెంట్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని చైర్‌పర్సన్, కమిటీ ఆఫ్ ఎగ్జామినర్స్, బాయిలర్ల సంచాలకులు బి. ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే/జూన్ నెలల్లో నిర్వహించబోయే మొదటి, రెండవ తరగతి పరీక్షల నిర్వహణకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుచున్నామన్నారు. అర్హతలు, విద్యార్హత, వయస్సు, పని అనుభవం వంటి పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించగలరన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పైన పేర్కొన్న వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. పరీక్షలు నిర్వహించే తేదీలు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 31వ తేదీ సాయంత్రం 05:00 గంటల లోపుగా సమర్పించాల్సి ఉంటుందని చైర్‌పర్సన్, కమిటీ ఆఫ్ ఎగ్జామినర్స్, బాయిలర్ల సంచాలకులు ఆ ప్రకటనలో తెలియజేశారు.

## రాంబాబు నోరు అదుపులో పెట్టుకో

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరిక



రాయచోటి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: అంబటి రాంబాబు నోరు పదవులు పెట్టుకోకపోతే ఇక తాము ఉపేక్షించమని, వైసిపి నాయకులను, కార్యకర్తలను, ఆ పార్టీ సానుభూతిపరులను మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుని విమర్శించే స్థాయి అర్హత రాంబాబుకు లేదన్నారు. కేవలం జగన్ రెడ్డి మెప్పుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబును నోటికొచ్చినట్లు మాట్లాడటం సమంజసమా అని నిలదీశారు. ఎవరైనా సరే ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటే మంచిదని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావతమైతే తగిన రీతిలో బుద్ధిచెప్తామని వారిని హెచ్చరించారు.

## రాజాంలో భారీ చోరీ



రాజాం (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా రాజాం జీఎంఆర్ కేర్ హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్న చిన్నపిల్లలు వైద్యనిపుణులు డాక్టర్ నగేష్ ఇంట్లో చోరీ జరిగింది. ఎవరూ లేని సమయం చూసి దుండగులు చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది. సుమారు కోటి రూపాయలకు పైగా విలువచేసే బంగారు ఆభరణాలు, వెండి, నగదు చోరీకి గురైందంటూ పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానిత వ్యక్తులను విచారణ చేస్తున్నారు. డాగ్, క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించామని డిఎస్పీ రాఘువులు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1200 గ్రాముల బంగారం, కేజీ వెండి అపహరించారని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ముప్వా తిరుమల కృష్ణబాబు

## ఆర్టీసీ ఎండీగా ఎంటి కృష్ణబాబు

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్తప్రతినిధి: ఎపిఎస్ ఆర్టీసీ ఎండీగా ముప్వా తిరుమల కృష్ణబాబు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కృష్ణబాబుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. అనంతరం ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టి పలు అంశాలపై సమీక్షించి మార్గదర్శనం చేశారు. ఆర్టీసీలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రణాళికలపై కృష్ణబాబు అధికారులతో చర్చించారు. ఏపీఎస్ ఆర్టీసీలో కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో ఈ ఏడాది మొత్తం 2,500 బస్సులు ప్రవేశపెడతామని ఆర్టీసీ ఎండీ కృష్ణబాబు తెలిపారు. కేంద్రం ద్వారా వచ్చే 1,050 ఎలక్ట్రిక్ బస్సులను ఈ ఏడాది చివరికల్లా రోడ్డెక్కించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,480 ఎలక్ట్రిక్ లేదా సీఎన్‌జీ బస్సులు కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

నాగలాపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కృష్ణాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సోమవారం వేకువ జామున చెన్నై వైపు నుంచి తిరుపతి వైపుకు బైక్‌కి వెళుతున్న నింద్ర దళితవాడకు చెందిన నాగరాజు సోనూ(20), రామగిరికి చెందిన సంజయ్ వాళ్లిద్దరు మిత్రులు తమిళనాడులోని అమెజాన్ సంస్థలో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి నాగలాపురం పట్టణంలోని కల్యాణ మండపంలో ఓ వివాహానికి హాజరై తిరుగు ప్రయాణంలో అతి వేగంగా బైక్ నడిపి రోడ్డు పక్కన ఉన్న చింత చెట్టును బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందారు. పుత్తూరు డిఎస్పీ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాన్ని నాగలాపురం ఎస్ఐ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఆర్‌అండ్‌బీకి ఫోన్ ద్వారా డిఎస్పీ సమాచారాన్ని తెలియజేసి ఈ ప్రదేశాన్ని డేంజర్ జోన్‌గా తీసుకుని స్పీడ్ బ్రేకర్లను వేయాలని కోరారు. సంఘటనా స్థలంలో నాగలాపురం ఎస్ఐ సునీల్, కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

### ఎస్పీ పర్యవేక్షణలో స్పీడీ ట్రయల్ మానిటరింగ్ సిస్టం విజయవంతం

పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మైనర్ బాలికపై అమానుషంగా లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి జీవిత కాల కఠిన కారాగార శిక్షతోపాటు, పదివేలు జరిమానా, 5 లక్షల 80 వేల భారీ నష్టపరిహారం విధిస్తూ భీమవరం ఫోక్సో కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ కేసు త్వరగా పరిష్కారం కావడానికి తాము అవలంబించిన స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టం ఉపయోగపడిందని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. వివరాల్లోకెళితే గత 2023 అక్టోబర్ నెలలో దసరా సెలవుల నిమిత్తం ఉండి గ్రామం పడవలవాని పేటకు వచ్చిన ఓ మైనర్ బాలికపై మేనత్త కొడుకు నల్లూరి నాగాంజనేయులు (23) బలవంతంగా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. మహేంద్ర బాలిక శెలవుల అనంతరం హాస్టల్కు వెళ్లి అనారోగ్య పాలవడంతో వార్డెన్ ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది దీంతో డిసెంబరు 15 2023 తేదీన ఉండి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుని అదుపులోనికి తీసుకుని రిమాండ్ విధించారు. ఈ క్రమంలో ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డిఎస్పి నున్న మురళీకృష్ణ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి సూచనల మేరకు స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఈ కేసును వేగవంతంగా పరిష్కరించారు. ఈ కేసు పరిష్కారానికి కృషి చేసిన భీమవరం డిఎస్పి రఘువీర్ విష్ణు, ఆకివీడు సీఐ జగదీష్, ఉండి ఎస్ఐ నజీరుల్లాను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## అంబటి! నోరు జాగ్రత్త: కంచర్ల శ్రీకాంత్



కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మాజీ మంత్రి అంబటి రాంబాబు నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మండల అధ్యక్షుడు రాజగోపాల్ తదితరులతో కలసి మాట్లాడారు. ఒక సీనియర్ ముఖ్యమంత్రిని, ఆయన తల్లిని అవమానించేలా అంబటి మాట్లాడడం దారుణమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు గురించి అనుచితంగా మాట్లాడితే ఎలా ఉంటుందో రాష్ట్రంలో ఏం జరిగిందో చూసే ఉంటారన్నారు. ఇలాంటివారిని ప్రోత్సహించే మాజీ సిఎం వైఎస్ జగన్ మానసిక స్థితి ఏంటో అర్థమవుతుందన్నారు. ఈదఫా ఆయనకు 11 సీట్లు కూడా దక్కవన్నారు. వైఎస్ జగన్ రాజకీయాల్లో ఉండేందుకు అనర్హుడని పేర్కొన్నారు. తిరుమల పరకామణిలో చోరీ జరిగితే సైతం ఆయన తేలిగ్గా తీసుకున్నారని నేడు బూతులు మాట్లాడే నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. రాజకీయాల్లో ఉంటే ప్రజాహిత రాజకీయాలు చేయాలన్నారు. ఇండియా టుడే, సీ ఓటర్ సర్వేలు కూటమి ప్రభుత్వంకు రెండుశాతం ఆదరణ పెరిగిందని పేర్కొనడంతో జగన్ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో ప్రతి మూడు నెలలకు ఓసారి వచ్చి అభివృద్ధిలో పురోగతి చూపుతున్నారన్నారు. ఇ- సైకిళ్ల పంపిణీలో గిన్నిస్ రికార్డు స్థాపించారని ఇది చరిత్ర అన్నారు. కుప్పంలో 7కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించారన్నారు. వీటితో పాటు 635కోట్లతో పలు పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాజకీయ భవిష్యత్తు ఉండదనే ఫ్రస్టేషన్‌లో జగన్ ఉన్నారన్నారు. ఆయన చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, వెంకీ, నేతలు డా॥ వెంకటేష్, మణి, రాజేంద్ర, బగ్గిడి వెంకటేష్, మునెప్ప, సతీష్ పాల్గొన్నారు.

## యువశక్తిని ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్

### భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్



చిత్తూరురూరల్, ఫిబ్రవరి 2ప్రభాతవార్త: యువశక్తిని సరైన విధంగా ఉపయోగించుకోవడంతో పాటు వారికి భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడం, సామాన్య ప్రజల సంక్షేమంను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూపొందించి ప్రవేశపెట్టారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లిమధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా భాజపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచడం ద్వారా మధ్యతరగతికి ఊరటనిచ్చారనీ, విదేశీ విద్య, వైద్యం, ప్రయాణాలపై పన్ను తగ్గింపుతో కుటుంబాలపై భారం తగ్గుతుందన్నారు. అలాగే ఆదాయపు పన్ను చట్టాన్ని సరళీకృతం చేస్తూ కొత్తవిధానం అమలు చేయడం పారదర్శకతకు నిదర్శనమని, రైతుల ఆదాయం పెంచేదిశగా వ్యవసాయరంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వడం హర్షనీయమన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల విస్తరణకు అదనపు నిధులు కేటాయించడం ద్వారా రహదారులు, రైల్వే అభివృద్ధి వేగవంతం అవుతుందని, దేశ భద్రత మరింత బలోపేతం చేయడానికి రక్షణరంగంలో స్వదేశీ తయారిని ప్రోత్సహిస్తూ వ్యయం పెంచడం, డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధ, రోబోటిక్స్ రంగాలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం యువతకు కొత్త అవకాశాలు తెస్తుందన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో రూపొందించిన ఈ బడ్జెట్ యువశక్తి బడ్జెట్ అని, దేశాన్ని వికసిత్ భారత్ దిశగా తీసుకెళ్లే కీలక అడుగు అని ఆయన స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ రాజ్యసభ సభ్యురాలు దుర్గా రామక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టరు మోహన్‌నాయుడు, సీనియర్ నాయకులు చిట్టిబాబు, రాజేంద్రనాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు, మండల అధ్యక్షులు షణ్ముగం, లతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ న్యూస్ రీడర్ జోలెపాళ్యం మంగమ్మ కన్నుమూత



హైదరాబాద్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ప్రముఖ న్యూస్ రీడర్ జోలెపాళ్యం మంగమ్మ (92)కన్నుమూశారు. ఆదివారం చిత్తూరు జిల్లా మదనపల్లెలోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆల్ ఇండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్‌గా ప్రసిద్ధురాలు. తెలుగు రచయిత్రి. కేంద్ర సమాచార శాఖ, విదేశాంగ శాఖల్లో కీలక పదవులను మంగమ్మ గారు నిర్వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెసలో లైఫ్ మెంబర్‌గా, అనిబీసెంట్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఉపాధ్యక్షురాలిగా, గాంధీ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవల్‌పమెంట్ అధ్యక్షురాలిగా, లోక్‌అదాలత్‌లో సభ్యురాలిగా వివిధ హోదాల్లో సేవలందించారు.

ఈమె మదనపల్లెలో లక్ష్మమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించారు. ఆలిండియా రేడియో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై, తెలుగు రేడియో తొలి మహిళా న్యూస్‌రీడర్‌గా పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను పొందిన మంగమ్మకు తెలుగు, ఇంగ్లీషు, ఫ్రెంచ్, తమిళ, హిందీ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఈమె ఆలిండియా రేడియో న్యూఢిల్లీలో ఎడిటర్‌గా, న్యూస్ రీడర్‌గా పనిచేసారు.బహుభాషల్లో ప్రావీణ్యం గల మంగమ్మ ఆంగ్ల, తెలుగు భాషల్లో మూడువందలకు పైగా వ్యాసాలు రాసారు. అనేక పుస్తకాలను ప్రచురించారు.



# కన్నుల పండువగా పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ వారి కల్యాణం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాలో పేరెన్నికగన్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని సుప్రసిద్ధ పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ వారి కళ్యాణం పండు వెన్నెల్లో కమనీయంగా శోభిల్లింది. ఆదివారం రాత్రి జరిగిన ఈవేడుకను సందర్శించేందుకు వేలాదిగా భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. మునేటి తీరాన నిండు పౌర్ణమి వెన్నెల కిరణాల్లో వేద మ ంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ భారీగా ఏర్పాటుచేసిన కళ్యాణ వేదికపై అమ్మవారి కళ్యాణం కనులారా చూసి తరించాలని తహతహలాడిన భక్తజన సందోహంతో ప్రాంగణం కిటకిటలాడింది. ట్రస్టీ చైర్మన్ చుంచు రమేష్, ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి బి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్-స్వర్ణకుమారి దంపతులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్-శ్రీదేవి దంపతులు, మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు కూడా పాల్గొని అమ్మవారిని సేవించారు. అమ్మవారి దివ్య కటాక్షం నియోజకవర్గ ప్రజలందరి కుటుంబాలపై వర్షించాలని, ప్రతి ఇల్లు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నేతలు అమ్మవారిని ప్రార్థించారు. మధ్యాహ్నం అమ్మవారి జలబిందెల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు ఎస్ఐ, సర్కిల్ పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# ఎపిలో ప్రపంచ స్థాయి డిజిటల్ వర్సిటీ

## ఏలూరు ఎంపి పుట్టా మహేష్ ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్తప్రతినిధి: ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్యను వారి ఇంటి వద్దకే అందించేందుకే డిజిటల్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సోమవారం లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఎలక్ట్రా నిక్స్ కింద పనిచేసే స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎల క్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ ఐటి), అక్టోబర్ 2025లో "ఎన్ఐఇఎల్ఐటి డిజిటల్ యూనివర్సిటీ (ఎన్‌డియు) ప్లాట్ ఫామ్"ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీని కార్యక్రమాలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ సమాధానం ఇస్తూ 'ఎన్ఐ ఇఎల్ఐటి డిజిటల్ యూనివర్సిటీ ప్లాట్‌ఫామ్' అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో ఆన్‌లైన్ మరియు మిశ్రమ నైపుణ్యఆధారిత కోర్సులను అందించడానికి ఒక డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ అని పేర్కొన్నారు. సెమీకండక్టర్ డిజైన్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ ఫోరెన్సిక్స్, ఇండస్ట్రీ 4.0 మరియు ఇతర అభివృద్ధి చెందుతున్న డొమైన్‌లలో రియల్‌టైమ్ ప్రయోగాల కోసం ఈ ప్లాట్‌ఫామ్ వర్చువల్ ల్యాబ్‌లను కూడా కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోని కోర్సులు నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్‌కి అనుగుణంగా ఉంటాయి. క్రెడిట్‌లను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్‌కి బదిలీ చేయబడతాయి. ప్రస్తుతం ప్లాట్‌ఫామ్‌లో 100 కంటే ఎక్కువ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పిన కేంద్ర మంత్రి, వీటిని దేశవ్యాప్తంగా వి.ని.లి.గి యొక్క 56 కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అంతేగాకుండా కోర్సులను నేర్చుకోవడంతో పాటు వారు తిరిగి నైపుణ్యాన్ని పెంచుకోవడం మరియు ఉపాధికి అవకాశాలను పొందటానికి 'స్వయం ప్లస్' ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. స్వయం ప్లస్ ద్వారా ఇప్పటివరకూ ప్రముఖ పరిశ్రమలతో 89 కంటే ఎక్కువ అవగాహన ఒప్పందాలపై సంతకం చేసినట్లు, 4.84 లక్షల మంది తమ నైపుణ్య పెంపుదల కోసం దీనిలో పేర్లు నమోదు చేసుకున్నట్లు ఎంపీ పుట్టా మహేష్‌కు ఇచ్చిన సమాధానంలో కేంద్ర మంత్రి వెల్లడించారు.

## ప్రపంచంలోనే ఎత్తైన కాంటిలివర్డ్ వీల్ లండన్ ఐ

# అమరావతిలో ఏర్పాటుకు చర్యలు



### లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిని ప్రపంచంలోనే టాప్ 5 నగరాల్లో ఒకటిగా నిర్మించాలనే లక్ష్యంతో ముందుకెళ్తుంది ప్రభుత్వం. అమరావతి నగర ప్రణాళిక నుంచి అన్ని ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో ఎంతో పగడ్బందీగా ముందుకెళ్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఉత్తమ మోడల్స్‌ను అమరావతి నిర్మాణంలో పరిగణనలోకి తీసుకుంటుంది. అమరావతి నిర్మాణాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ వివిధ దేశాల్లో అధ్యయనం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించిన తర్వాత అక్కడి మోడల్స్ ను అమరావతిలో అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఇంగ్లాండ్ రాజధాని లండన్‌లో అధికారులతో మంత్రి నారాయణ కలిసి పర్యటిస్తున్నారు. ముఖ్యంగా అమరావతిలో నిర్మించ తలపెట్టిన అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ, టూరిజం ప్రాజెక్ట్ లను ఈ పర్యటనలో అధ్యయనం చేస్తున్నారు. లండన్ పర్యటనలో భాగంగా ముందుగా సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డైరెక్టర్ గిన్ రిచర్డ్స్‌తో మంత్రి బృందం సమావేశమైంది. లండన్ నగరం మాస్టర్ ప్లాన్, అభివృద్ధి ప్రణాళికలు, రవాణా సౌకర్యాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గిన్ రిచర్డ్స్ వివరించారు. లండన్ సిటీ మినియేచర్ ద్వారా నగర నిర్మాణం గురించి వివరించారు. మధ్యాహ్నం లండన్‌లోని బాటర్సీ పవర్ స్టేషన్ ను మంత్రి బృందం సందర్శించింది. దశాబ్దాల పాటు విద్యుత్ ఉత్పత్తిని చేసి మూతపడిన ఒక పవర్ స్టేషన్‌ను ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా మార్చి టూరిస్టులను ఆకట్టునేలా మార్పులు చేసారు. థేమ్స్ నది ఒడ్డున అత్యంత సుందరంగా ఆహ్లాదకర వాతావరణంలో ఐకానిక్ భవనాలతో పర్యాటకులకు గమ్యస్థానంగా బాటర్సీ పవర్ స్టేషన్‌ను తీర్చిదిద్దారు. ఇక్కడ ఏర్పాటుచేసిన బోటింగ్‌తో పాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పర్యాటకంగానే కాకుండా వాణిజ్య కేంద్రంగా మారింది. అమరావతిలో కూడా టూరిజం ప్రాజెక్ట్‌లను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని భావిస్తున్న ప్రభుత్వం థేమ్స్ రివర్ ఫ్రంట్‌ను పరిగణనలోకి తీసుకునే అవకాశాలపై మంత్రి నారాయణ చర్చించారు. అక్కడి నుంచి థేమ్స్ నది ఒడ్డున ఉన్న 443 అడుగుల ఎత్తైన లండన్ ఐ వీల్‌ను మంత్రి నారాయణ బృందం సందర్శించింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన కాంటిలివర్డ్ అబ్జర్వేషన్ వీల్ ఇది. ఇదే తరహా వీల్ ను అమరావతిలో కృష్ణా నది ఒడ్డున ఏర్పాటుచేయాలని ఇప్పటికే ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించింది. లండన్ ఐ పనితీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు మంత్రి నారాయణ. థేమ్స్ నది ఒడ్డున ఉన్న మరికొన్ని టూరిజం ప్రాజెక్ట్‌లను మంత్రి నారాయణ బృందం సందర్శించింది.

# బయల్పడిన 14వ శతాబ్దంనాటి నాగేశ్వరాలయం

- పరశురాముడు ప్రతిష్టించిన శివలింగం గుర్తింపు
- పెన్నా ఇసుకలో దాగిన శైవ వైభవం తిరిగి వెలుగులోకి
- ఆనం కృషితో నాగేశ్వరాలయానికి పూర్వ వైభవం
- నూతన ఆలయ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు



చేజర్ల (నెల్లూరు) ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలో పెరుమాళ్ళపాడు గ్రామం సమీపంలో పెన్నా నది ఇసుక మేటల్లో కలిసిపోయిన పురాతన నాగేశ్వర స్వామి ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం రానుంది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో నూతన ఆలయ నిర్మాణానికి రూ.1 కోటి 50 లక్షలు నిధులు మంజూరవ్వడంతో శైవ భక్తుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

రెండు నెలల తవ్వకాల్లో వెలుగు చూసిన చరిత్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా చేపట్టిన తవ్వకాల్లో అత్యంత ప్రాచీనమైన శైవక్షేత్ర అవశేషాలు వెలుగులోకి వచ్చాయి. ఈ తవ్వకాల్లో పరశురాముడు ప్రతిష్టించిన శివలింగం గుర్తించబడింది. ఈ శివలింగాన్ని గ్రామస్తులు తరతరాలుగా నాగేశ్వర స్వామిగా పూజిస్తూ వచ్చారని పూర్వికులు చెబుతున్నారు. గ్రామ పెద్దల కథనాల ప్రకారం ఈ ఆలయం 14వ శతాబ్దానికి చెందినది. పెన్నా నదిలో కాలక్రమేణా ఇసుక మేటలు ఏర్పడటం, పడమటి గాలుల తీవ్రత పెరగడంతో సుమారు 200 సంవత్సరాల క్రితం అప్పటి గ్రామస్తులు ఆ ప్రాంతాన్ని వదిలి నదీ తీరానికి కొంత దూరంలో నూతన గ్రామాన్ని నిర్మించుకున్నారు. అప్పటి నుంచే ఆలయం క్రమంగా ఇసుకలో కూరుకుపోయింది.

### వందల ఎకరాల ఆలయ భూములు

ఈ నాగేశ్వరాలయానికి అప్పట్లో వందల ఎకరాల భూములు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కాలక్రమంలో ఆలయ ప్రాధాన్యత తగ్గడంతో ఈ చారిత్రక క్షేత్రం గుర్తింపును కోల్పోయింది. కరోనా సమయంలో పెన్నా నది తీర ప్రాంతంలో సంచరిస్తున్న గ్రామ యువకులు ఈ పురాతన నాగేశ్వర స్వామి ఆలయ అవశేషాలను గుర్తించారు.

అప్పట్లో కొంత ఇసుకను తొలగించగా ఆలయ శిఖరం బయటపడింది. అప్పటి నుంచి గ్రామస్తులంతా ఐక్యంగా ఆలయ పునర్నిర్మాణం కోసం కృషి చేస్తున్నారు. వారి విజ్ఞప్తిని మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి వెంటనే చర్యలు చేపట్టారు.

### విగ్రహాల దర్శనానికి భక్తుల వెల్లువ

తాజాగా జరిపిన తవ్వకాల్లో నాగేశ్వర స్వామి, నందీశ్వరుడు, పార్వతి అమ్మవారు, విఘ్నేశ్వర స్వామి విగ్రహాలు వెలుగులోకి రావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఈ అరుదైన పురాతన విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

### నూతన ఆలయానికి స్థలం మంజూరు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ ఆలయం పట్ల ప్రత్యేక దృష్టి సారించి దేవాదాయ శాఖ నుంచి నూతన ఆలయ నిర్మాణానికి స్థలం కూడా మంజూరు చేశారు. త్వరలోనే శాస్త్రోక్తంగా, ఆధునిక సౌకర్యాలతో నూతన నాగేశ్వర స్వామి ఆలయం నిర్మించనున్నారు. శైవక్షేత్రంగా మళ్లీ పెరుమాళ్ళపాడు. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న నాగేశ్వరాలయం పునరుద్ధరణతో పెరుమాళ్ళపాడు ప్రాంతం మరోసారి ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా మారనుంది.

## 3 ఇండిస్ట్రియల్ కారిడార్లకు

# కేంద్రం భారీగా నిధులు

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్లకు కేంద్ర నిధులు కేటాయించింది. మొత్తం 14 ఇండస్ట్రియల్ కారిడార్లకు 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో రూ.3,000 కోట్లు ప్రతిపాదన చేసారు. అందుల రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న విశాఖ- చెన్నై (వీసీఐసీ), చెన్నై- బెంగళూరు (సీబీఐసీ), హైదరాబాద్- బెంగళూరు (హెచ్‌బీఐసీ) కారిడార్లకు కేంద్రం నుంచి భారీగా నిధులు అందనున్నాయి. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్) భాగస్వామ్యంతో 14 పారిశ్రామిక కారిడార్లకు కేంద్రం అభివృద్ధి చేస్తోంది. వాటికి 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో రూ.3,000 కోట్లు ప్రతిపాదించింది. సీబీఐసీ పరిధిలోని నెల్లూరు క్రిస్ సిటీని రూ.621 కోట్ల వ్యయంతో నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే రూ.531 కోట్లను కేంద్రం విడుదల చేసింది. మిగిలిన పనుల పూర్తికి రూ.90 కోట్లు బడ్జెట్ కేటాయింపుల నుంచి తీసుకునే అవకాశం ఉంది. ఓర్వకల్లు నోడ్‌ను (హెచ్‌బీఐసీ) నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రూ.1,014 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే రూ.500 కోట్లను అధికారులు ఖర్చు చేశారు. పనులు పూర్తి చేసేందుకు ఇంకా రూ.514 కోట్లు అవసరం. వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి నోడ్ (వీసీఐసీ)ను రూ.872 కోట్లతో ప్రతిపాదించింది. ఇప్పటికే రూ.300 కోట్లు నిక్‌డిక్ట్ విడుదల చేసింది. పనులు కొనసాగించేందుకు ఇంకా రూ.572 కోట్లు అవసరం ఉన్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా 100 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పథకం కింద రాష్ట్రంలో కనీసం 30 పార్కులు అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు పొందేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

### ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సీతారామపురం (నెల్లూరు) ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కుటుంబ కలహాల నేపథ్యంతో ఒ వ్యక్తి సీలింగ్ ప్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాలుపడిన ఘటన సీతారామపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీతారామపురం ఇంచార్జి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు సీతారామపురం మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పశువుల చెన్నయ్య (45) వ్యవసాయం పనులు చేస్తుండేవాడు. కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని, ఈక్రమంలో ఆదివారం రాత్రి మరోసారి కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపనకు గురైన చెన్నయ్య తన ఇంట్లో సీలింగ్ ప్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాలుపడ్డాడని ఎస్ఐ తెలిపారు. సమాచారం రావడంతో వెంటనే తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు స్వీకరించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడుకి భార్య నలుగురు పిల్లలున్నారు.

# అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: రెవెన్యూ క్లినిక్, ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వస్తున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పిజిఆర్ఎస్ నాన్ రెవెన్యూ కింద 136 అర్జీలు రాగా వీటిలో పురపాలకశాఖ 36, పోలీసశాఖ 21, పంచాయతీరాజ్‌కు 20 అర్జీలు ఉన్నాయి. డిఆర్‌డిఏ 10, గృహనిర్మాణానికి 6 అర్జీలు, ఇతర శాఖలకు సంబందించి 75 అర్జీలు వచ్చాయి. ఈకార్యక్రమంలో జేసి ఇలక్కియా, డిఆర్వో నరసింహం, ఆర్డీఓ కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### +రైజ్‌తో మహిళలకు చేయూత

రూరల్ ఇంక్యూబేషన్ స్కిల్లింగ్ అండ్ అంత్రపెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్) ద్వారా వ్యాపారరంగంలో రాణించాలనుకునే మహిలలకు చేయూత నిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలపారు. ఇంబ్రహింపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ సందర్శించారు. ఈకేంద్రంలో మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వినియోగం వంటి అంశాలపై శిక్షణనిస్తున్నట్లు వివరించారు. ఈఅవకశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాజంలో బాల్యవివాహాలను నివారించేందుకు ప్రజల్లో సరైన అవగాహన కల్పించాల్సి ఉందని కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. వాసవ్య మహిళామండలి బాల్యవివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలను నివారించేందుకు ప్రచార రథం ఏర్పాటు చేసిన వాసవ్యమహిళామండలి సభ్యులను అభినందించారు.

# ఇక పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక



### మరో వినూత్న కార్యక్రమానికి ఎస్‌పిడిసిఎల్ శ్రీకారం

తిరుపతి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిపరిపాలన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ పంపిణీ చేస్తున్న ఎస్పీడిసిఎల్ సంస్థ పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఒక వేదిక నిర్వహిస్తోంది. ఈ వినూత్న కార్యక్రమానికి ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే గృహ విద్యుత్ వినియోగదారుల, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి"తో సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించే వీలుకలిగింది. ఇది సత్ఫలితాలనివ్వడంతో ఇకపై పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఎస్‌పిడిసిఎల్ సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికై ఈ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఇప్పటికే విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా "డయల్ యువర్ సిఎండి", "డయల్ యువర్ ఎస్ఈ", "కరెంటోళ్ళ జనబాట"లాంటి వినూత్న కార్యక్రమాలు విజయవంతం కావడం విశేషం. పారిశ్రామిక రంగాన్ని కూడా ప్రోత్సహించడంలో భాగంగా పారిశ్రామిక విద్యుత్ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా "పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక"ను ప్రతినెలా మొదటి బుధవారం ఉదయం 10:30గంటల నుండి 11:30గంటల వరకు ఆయా జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లోనూ, ప్రతి మూడవ బుధవారం ఉదయం 10:30గంటల నుంచి 11:30గంటల వరకు ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. పారిశ్రామిక వినియోగదారులు సంబంధిత జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్లను నేరుగా కలిసి తమ విద్యుత్ సమస్యలను తెలియజేయాలని సూచించారు. జిల్లా స్థాయిలోని సూపరింటెండింగ్ ఇంజనీర్ పరిధిలో మొదటి బుధవారం పరిష్కారానికి నోచుకోని పారిశ్రామిక విద్యుత్ సమస్యలను మూడవ బుధవారం తిరుపతిలోనిఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండిని నేరుగా కలిసి సమస్యల్ని విన్నవించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ సదవకాశాన్ని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై మార్చి 24న చలో ఢిల్లీ

### సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేకత విధానాలు, పార్లమెంటులో చేస్తున్న ప్రజావ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ మార్చి 24న సిపిఎం ఆధ్వర్యాన చల్లో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని, అంతకుముందు మార్చి 9 తేదీ నుండి 20వ తేదీ వరకూ దేశవ్యాప్త ప్రచారం నిర్వహిస్తామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు తెలిపారు. సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా విజయవాడ వచ్చిన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి బడ్జెట్ మోసం చేసిదిగా ఉందని అన్నారు. నిధులకు కోతపెట్టారని, సంక్షేమ పథకాలను విస్మరించారని పేర్కొన్నారు. గతంలో ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగా, శరవేగంగా ముందుకు పోతోందని గొప్పగా చెప్పారని, అది బడ్జెట్లో కనబడటం లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గత బడ్జెట్లో రూ.5000 కోట్లుకుపైగా కేటాయించారని, ఈసారి రూ.3320 కోట్లు కేటాయించారని, అమరావతికి గతబడ్జెట్ నుండి నిధులు కేటాయిస్తే ఈసారి అప్పులు ఇస్తున్నట్లు చూపించి మోసపూరితంగా వ్యవహరించారని తెలిపారు. ఎన్‌డిఏలో తెలుగుదేశం, జనసేన భాగస్వామిగా ఉన్నప్పటికీ నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత నుండి కేంద్రంలో ఎన్‌డిఏ అధికారంలో ఉందని, ఇప్పటికి అనేక రూపాల్లో మోసం చేస్తోందని అన్నారు. కేంద్రంలో కీలకపాత్ర నిర్వహిస్తుదన్న చంద్రబాబు, పవన్‌కల్యాన్ తమ ప్రభావాన్ని వినియోగించుకుని నిధులు రాబట్టాలని అన్నారు. ఈ బడ్జెట్లో ఎందుకు రాబట్టలేకపోయారో ప్రజలకు చెప్పాలన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలూ సహజమని కానీ భౌతికదాడులు నిర్వహించడం అభ్యంతరకమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. వైసిపి నాయకులు అంబటి రాంబాబు అసభ్యంగా మాట్లాడారని వార్తలు వచ్చాయని, వాటిని సిపిఎంగా తీవ్రంగా ఖండించామని తెలిపారు. అలాగే ఆయన ఇంటిపై దాడి జరిగిందని అది కూడా తీవ్రమైన విషయమని పేర్కొన్నారు. విమర్శలు చేశారనే పేరుతో భౌతికదాడులు చేయడం అభ్యంతకరమని తెలిపారు.

# ఉపాధికి ఊపిరి తీశారు




- విబి జిరామ్‌జి దిక్కుమాలిన పథకం
- జిరామ్‌జికి చంద్రబాబు మద్దతు దుర్మార్గం
- ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో: కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఊపిరి తీసింది. ఉపాధిహామీ పథకం స్థానంలో బిజెపి అమల్లోకి తెచ్చిన గ్రాంజీ చట్టంతో కూలీలకు పని దొరకదని గ్రామాల్లో మళ్లీ వలసలు పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కోసం ప్రజలు ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన గ్రాంజీ పథకానికి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రం నెత్తిన భారం వేసే గ్రాంజీ పథకానికి మీరు ఎందుకు మద్దతు ఇస్తున్నారని ఆమె సీఎం చంద్రబాబుని ప్రశ్నించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో మండ్రేగా పరిరక్షణ యాత్రను సోమవారం సాయంత్రం ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ప్రారంభించారు. బండ్లపల్లి వేదికగా ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసిన శిలాఫలకాన్ని కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పరిశీలించి శ్రామికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ 2006 ఫిబ్రవరి 2వ తేదిన ఉపాధిహామీ పథకాన్ని సోనియాగాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చేతులు మీదుగా ప్రారంభమైంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం కావాలో అన్ని పథకాలు అమలు చేశారు. అందులో భాగంగా కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా నుంచే దేశంలో తొలిసారిగా ఉపాధిహామీ పథకం అమలు చేసిన ఘనత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిదే అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధిహామీ పథకం బాగా నడిచిందని అప్పట్లో ఉపాధిహామీ పథకం అంటే గ్రామాల్లో పండుగని ఆమె అభిప్రాయ పడ్డారు. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు కాంగ్రెస్ అమలు చేసిన ఈ పథకం ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన విబి జీరామ్‌జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెడి శీలం, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ముఖ్యులు కోటా సత్యం, దాదాగాంధీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. బండ్లపల్లి గ్రామానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

# ఎసిబికి చిక్కిన హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు

పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. చీటింగ్ కేసు వ్యవహారంలో లంచం డిమాండ్ చేసిన హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు రూ.25,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంఘటన తణుకు పట్టణంలో సంచలనంగా మారింది. కేసు పరిష్కారం పేరుతో బాధితుడిని భయపెట్టి మొత్తం రూ.25,000 లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో మెరుపు దాడి చేసి, లంచం స్వీకరిస్తున్న సమయంలో సుబ్బారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రస్తుతం సుబ్బారావును ఏసీబీ అధికారులు విచారిస్తూ, కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ 2025 సంవత్సరంలో బాధితులు జక్కంశెట్టి మావుళ్లేశ్వరరావు ఉద్యోగం ఇప్పిస్తానని తమను మోసం చేసినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు తణుకు టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. తణుకు పట్టణ సీఐ కొండయ్య నిందితుడు మావుల్లేశ్వర రావు కేసును క్రిమినల్ కేసుగా మారుస్తానని చెప్పినట్లు తనతో హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు బెదిరించినట్లు బాధితుడు మావుళ్ళేశ్వరరావు తెలిపాడన్నారు. చీటింగ్ కేసు తీసివేయడానికి, క్రిమినల్ కేసు పెట్టకుండా ఉండడానికి సిఐకి ఇవ్వాలని హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తనను 30,000 లంచం అడిగారని, చర్చల ద్వారా 25 వేలకు కుదుర్చుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు డిఎస్పి వివరించారు. సీఐ కొండయ్యని కూడా ప్రశ్నిస్తామని సిబిఐ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నన్నెవరూ వేధించడం లేదు!

### మమ్మల్ని విడదీయాలని చూస్తున్నారు: విచారణలో మహిళా కమీషన్‌కు సుష్మా వివరణ

చంద్రగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: నన్నెవరూ వేధించడంలేదని సుష్మా మహిళా కమీషన్ చైర్మన్ రాయపాటి శైలజకు వెల్లడించారు. తన కుమార్తె కనిపించడంలేదని గుంటూరుకు చెందిన జాన్సీవాణి రాష్ట్ర మహిళా కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే గుంటూరుకు చెందిన సుష్మా శ్రీనివాస మంగాపురంకు చెందిన మోహన్ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. బుచ్చినాయుడుపల్లి మోహన్‌రెడ్డి కాలనీలో కాపురం పెట్టారు. ఆ సమయంలో కొంత ఘర్షణలు జరిగినప్పటికీ సర్దుకున్నాయి. అయితే గత డిశంబర్‌లో సుష్మా తన తల్లికి ఫోన్‌చేసి రెండేళ్ళుగా తన భర్త ఇంట్లో బంధించి వేధిస్తున్నట్లు చెప్పిందని అదే నెలలో జాన్సీవాణి మహిళా కమీషన్‌కు చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం మహిళా కమీషన్ ఇక్కడికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి కమీషన్ ఎదుట సుష్మాకు వీడియో కాల్ చేసి విచారణ చేయడంతో తనను ఎవరూ వేధించడం లేదని, తన భర్త నుండి వేరు చేయాలని చూస్తున్నారంటూ వివరణ ఇవ్వడంతో మహిళా కమీషన్ మిన్నకుండిపోయారు. ఈ క్రమంలో జాన్సీవాణి తన కుమార్తె తనతో వాట్సాప్ చాటింగ్ చేస్తూ డబ్బులు పంపాలని కోరిందని వివరించారు. ఆ మేరకు ఇప్పటి వరకు రూ.30 లక్షలు ఫోన్ పే ద్వారా పంపినట్లు తెలిపారు. కాగా వీడియో కాల్ విచారణలో భర్తకు భయపడి ఆ విధంగా చెప్పివుండవచ్చుననీ, సుష్మా మోహన్ దంపతులు ఎక్కడ వున్నారో గుర్తించి ఆ మేరకు వారిని వ్యక్తిగతంగా విచారణ చేయగలితే వాస్తవాలు వెలుగులోకి రాగలవనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

# ఫైర్‌సేఫ్టీరహిత బహుళ అంతస్తుల భవనాలకు అగ్నిమాపక శాఖ తాఖీదులు




అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్‌సర్వీస్ అధికారులతో సమావేశమైన ఆ విభాగం డిజి విక్రంసింగ్‌మాన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఓఆర్ఆర్ పరిధిలో గల అన్ని బహుళ అంత స్తుల భవనాలలో ఫైర్ సేఫ్టీ ఉపకరణాలు లేని వాటికి వారం రోజుల్లో సమ కూర్చుకోవాలని అగ్నిమాపక శాఖ ఆదేశించింది. అక్రమంగా వున్న సెల్లార్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాళీ చేయాల్సిందేనని, వీటిని కేవలం పార్కింగ్ కోసం తప్ప దేనికి వాడ రాదని ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ ఆదేశించారు. ఈ మేరకు అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. రాబోయేది వేసవికాలం అయినందున ఎక్కడా అగ్ని ప్రమా దాలకు తావు లేకుండా ఫైర్‌సర్వీస్ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. నాంపల్లి అగ్నిప్రమాద ఘటనలో సెల్లార్‌లో ఐదుగురు హృద య విదారకంగా మర ణించడంపై సర్కారు తీవ్రంగా పరి గణించి కఠిన చర్యలకు ఆదేశించిందని, ఈ నేపథ్యంలో ఫైర్‌సర్వీస్ సిబ్బంది వరుసగా దాడులు చేసి ఆక్రమాలను నిరోధించాలని ఆయన ఆదేశించారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణదారులు ఇక ముందు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని, సెల్లార్ల దుర్వినియోగాన్ని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సెల్లార్లు కేవలం పార్కింగ్ కోసమే వాడాలని, వేరే అవసరాలకు వాడితే సహించేది లేదని ఆయన హెచ్చ రించారు. నాంపల్లి దుర్ఘటన తరువాత ఫైర్‌సర్వీస్ అధికారుల తనిఖీలో అనేక చోట్ల సెల్లార్లు గోదా ములుగానూ, నివాస గృహాలుగానూ మారినట్లు వెలుగు చూసిందని, వీటిపై భవన యజమానులకు నోటీ సులు ఇచ్చి వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఆదేశించామని ఆయన తెలిపారు.

అనేకచోట్ల సెల్లార్లను ఇప్పటికే ఖాళీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సెల్లార్ల దుర్వినియోగం నివారించ డంతోపాటు భవనాలలోని ప్రతి ఫ్లాట్లో ఫైర్‌సేఫ్టీ ఉపకరణాలు వుండాల్సిందేనని, అత్యవసర పరిస్థితుల్లో వీటిని వాడగలిగే నిపుణులైన సిబ్బంది కూడా ఉండాలని మాన్ తెలిపారు. దీంతోపాటు ఫైర్‌సేఫ్టీ ఉపకరణాలు సరిగ్గా పని చేస్తున్నాయా? లేదా అనేది యజమానులు నిరంతరం తనిఖీ చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఎక్కడైనా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే యజమా నులను బాధ్యులను చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో అందరు జాగ్రత్తగా ఉండి అగ్నిప్రమాదాల నివారణకు సహ కరించాలని ఆయన కోరారు. ఇప్పటికే 70కిపైగా వివిధ సంస్థలు, బడా భవనాలతోపాటు రెండు ఆస్పత్రులు, 26 వాణిజ్య సముదాయాలు, 27 మర్కంటైల్ భవనాలు, వాణిజ్య, జనసముదాయం వున్న మూడు భవనాలను, మ ల్టీప్లెక్స్, మాల్‌లను తనిఖీ చేశామని ఆయన వెల్ల డించారు.

## తాడిచర్ల బొగ్గు గనులు తెలంగాణకే

### రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** తాడిచర్ల 1 బొగ్గు గనులు తెలంగాణకే కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే తాడిచర్ల 2 గనులు ఇంకా ఎవరికీ కేటాయించలేదని తెలిపింది. రాజ్యసభలో సోమవారం సభ్యులు అనిల్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమాధాన మిచ్చారు. 2015లో తె లంగాణ విద్యుత్ సంస్థ కు కేటాయించామని తెలి పారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం తర్వాత



2020 జూన్ నుంచి గనుల కేటాయింపుల ప్రక్రియ మారిందని తెలిపారు. వ్యాపారానికి వాడే గనులను వేలంలో కేటాయించాలని కమిటీ సూచించిందని పేర్కొన్నారు. ప్రత్యేక, తప్పని పరిస్థితుల్లోనే బొగ్గు శాఖ నేరుగా కేటాయించాలని కమిటీ తెలిపిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తాడిచర్ల కోల్ బ్లాక్ ను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఏ కోల్ మైనింగ్ కంపెనీకి కూడా ఈ స్థాయిలో ఇబ్బందుల్లేవని వ్యాఖ్యానిచారు.

## రాష్ట్ర ఫెర్టిలైజర్స్ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్లు, పెస్టిసైడ్స్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా నాగుర్ల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రామడుగు మనోహర్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ డీలర్ల సంఘానికి జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు, కోశాధికారిగా సిద్ధి నాగరాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ డీలర్లతో పాటు, రైతుల సంక్షేమం నిమిత్తం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ముచ్చింతల్ చినజీయర్‌స్వామి ఆశ్రమంలో

## వైభవంగా సమతాకుంభ్-2026

### 108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాలు

**హైదరాబాద్ (శంషాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామి ఆశ్రమంలో సోమవారం త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో సమతాకుంభ్-2026 బ్రహ్మోత్స వాలు ఘనంగా జరుగుతున్నాయి. సమతాకుంభ్-2026 శ్రీరామానుజాచార్య 108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవ రోజు ఉదయం యాగశాలలో ప్రత్యేక ఆరాధనలు, తీర్థగోష్టి నిర్వహించారు. సమాతమూర్తి ప్రాంగణంలో రామానుజ నూత్తందాది పారాయణం చేయడం మన అదృష్టం. రెండో రోజున జరిగిన గరుడ వాహనంపై ఊరేగిన 18 దివ్యదేశ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించి, అనంతరం అభిషేకం చేశారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం అనంతరం 37వ దివ్యదేశం నుండి 54 వరకు దివ్యదేశాధీశులకు 18 గరుడ సేవలు జరిగాయి. సాకేత రామచంద్ర ప్రభువు హనుమద్వాహనంపై దర్శనం ఇచ్చారు.

## కెసిఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కారు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మాజీ ముఖ్యమంత్రి, తమ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తన అజీర్తిని, అక్కసును వెళ్లగక్కారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హార్వర్డ్‌లో చదువుకున్న ముఖ్యమంత్రి తన గుణం మాత్రం మార్చుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. హేట్ స్పీచ్ గురించి పుస్తకాలు అక్కరలేదని, ముఖ్యమంత్రి ప్రసంగాలు వింటే చాలని విమర్శించారు. రావి నారాయణ రెడ్డి పురస్కార ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేతపై విమర్శలు గుప్పించారు. ఈ మధ్య కొంతమంది వాళ్లకు వాళ్లే జాతిపిత అని టైటిల్ ఇచ్చుకుంటున్నారని, తమకు తామే ఉద్యమకారుడు అని రాసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ జాతిపితకు నోటీసులు ఇస్తారా అని కొంతమంది ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా అని హరీశ్ రావు ప్రశ్నించారు. దేశానికి మహాత్మా గాంధీ జాతిపిత అయినట్లే తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా ఈ రాష్ట్రానికి జాతిపితనే అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న నాయకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్ రావు అన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ డిగ్రీ పరీక్షలు వాయిదా

### 17 నుంచి మార్చి 10 వరకు నిర్వహణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికలను దృష్టి లో పెట్టుకొని ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. డిగ్రీ మూడవ, రెండో, మొదటి సంవత్సరం వేర్వేరు సెమిస్టర్లకు పరీక్షలను తిరిగి ఈ నెల 17 నుండి మార్చి 10 వరకు నిర్వహిసున్నట్లు పరీక్షల నియం త్రణాధికారి ఆచార్య భోజు శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసు కున్న విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్‌లో హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వారి సంబంధిత అధ్యయన కేంద్రాల్లో లేదా వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై బిజెపి చార్జ్‌షీట్ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోసపూరిత వాగ్దానాల పేరుతో ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, విద్య, వైద్యాన్ని నిరక్ష ్యం చేశారని, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడ లేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని అన్నారు.

## ఓపెన్ కానీ పాలీసెట్ వెబ్‌సైట్

### ఆందోళనలో విద్యార్థులు

### ఏప్రిల్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడానికి నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలీ సెట్)-2026 దరఖాస్తుల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు సాంకేతిక విద్యా మండలి అధికారులు ప్రకటిం చినప్పటికీ.. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. సోమవారం ఉదయం నుంచే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినప్పటికీ.. ఉదయం నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించిన వెబ్ సైట్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాలీసెట్ దరఖాస్తులను సోమవారం(ఫిబ్రవరి 2) నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు పాలీసెట్ కన్వీనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుంతో ఏప్రిల్ 21 వరకు, రూ. 300 అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకు దరఖా స్తులను స్వీకరించనున్నారు. మే 13న పాలీసెట్-2026 పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహించిన అనంతరం 12 రోజుల్లో ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో డిప్లమా కోర్సులతోపాటు, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టీ కల్చర్ యూనివర్సిటీ అందించే హార్టీ కల్చర్ డిప్లమా కోర్సులను, పశు సంవర్ధక శాఖ నిర్వహించే డిప్లమా కోర్సుల్లోనూ అడ్మిషన్లను పాలీసెట్-2026 ద్వారా చేపట్టనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సోమవారం నుంచి ప్రారంభించగా.. అపరాధ రుసుంతో కలిపి ఏప్రిల్ 22 వరకు స్వీకరిం చనున్నారు. పరీక్షను మే 13న నిర్వహించి .. పరీక్ష ముగిసిన 12 రోజుల్లో ఫలితాలను ఇవ్వనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.



## కెసిఆర్‌ను సిట్ విచారణ కోసం పిలిస్తే తప్పేంటి?

### తెలంగాణను విస్మరించిన తెలుగింటి

### ఆడబిడ్డ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండేళ్లవుతున్నా సిట్ విచారణ ముగింపునకు రావడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విచారణ త్వరగా పూర్తిచేసి దోషులకు శిక్ష పడేలా చూడాలని ఆమె కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరిగిందో మాజీ సీఎం కేసీఆర్ చెబుతారని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సిట్ విచారణను తప్పుపడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం సరికాదని, చట్టాలను అందరూ గౌరవించాలని కవిత అన్నారు. చట్టానికి సహకరించాలని పేర్కొన్నారు. గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ పార్టీ డ్రామాలాడుతోందని, తన భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయని చెప్పారు. సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వెళ్లి సహకరిస్తానని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఐఐఎం, నవోదయాలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఇంకా ఇవ్వట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్రో రైల్ ఫేజ్2 గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్న ఆమె తెలుగింటి ఆడబిడ్డ నిర్మల తెలంగాణ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలు 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కొత్త ఎయిర్‌పోర్టులు, ఆర్ఆర్ఆర్‌ను పెండింగ్‌లోనే పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రప్రభుత్వం 47 అంశాల గురించి అడిగితే ఏమీ ఇవ్వలేదని, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి రాష్ట్రానికి ఏమీ తేలేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో విద్య, వైద్యానికి 1, 2 శాతమే నిధులు కేటాయించటం దారుణమని కవిత ఆక్షేపించారు.

## జనగణనలో ఒబిసిల కులగణన చేపట్టాలి

### లేకపోతే ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

### జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** గతంలో కే ంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జాతి జనగణనలో బిసి కులగణన చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలోని దేశంలోని బిసిలంతా ఐక్యమై ఢిల్లీలో ఉన్న ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే గత యేడాది ప్రధాని నరేంద్రమోడీ జనగణనతోపాటు బిసిల కులగణన చేపడతామని నిర్ణయం తీసుకున్నారని, ఆ నిర్ణయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల కులగణన చేపట్టకపోతే నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా దామాషా ప్రకారం బిసిలకు వాటా దక్కకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి కుందారం గణేషాచారి అధ్యక్షత వహించగా బిసి నేతలు దీటి మల్లయ్య, గుజ్జ కృష్ణ, కులక్కచర్ల శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్ తదితరులు మాట్లాడారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకం పెంచ లేదన్నారు. దీని వలన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉంది. అలాగే కేంద్రం పసుపు బోర్డుకు నిధుల కేటాయించకపోవడం, ఈ పంటను హై వాల్యూ క్రాప్‌గా గుర్తించకపోవడం నిరాశను కలిగించిందన్నారు. కొకొనట్ బోర్డు ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ప్రకటన లేదని చెప్పారు. ఎరువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని, ఇందువల్ల రైతులపై మరింత భారం పడుతుంది వివరించారు. ఇప్పటికే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే చర్యలు బడ్జెట్‌లో పూర్తిగా లేవని తెలిపారు. రైతులకు అత్యంత కీలకమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హక్కు కల్పించడంలో కేంద్రం విఫలమైందని, ఇందువల్ల రైతుల ఆదాయ భద్రతపై అనిశ్చితి పెరిగిందని చెప్పారు. వ్యవసాయ మార్కె టింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేక పోవడం కేంద్ర బడ్జెట్ లోని ప్రధాన లోపమన్నారు. కేంద్ర పథకాల ఏకీకరణ పేరుతో తెలంగాణకు వచ్చే నిధుల్లో కోత విధించడం సరికాదని తెలియచేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష ్యం మాటలకే పరిమితమైందని విమ ర్శించారు. ఇందుకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించ లేదన్నారు. వ్యవసాయ రంగంలో బడ్జెట్‌లో ప్రస్తావించదగిన ఏకైక అంశం ఎఐ ఆధారిత కార్యక్రమాల ప్రస్తావన మాత్రమేనని పేర్కొన్నారు, అయితే ధర భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలం ఎఐ రైతు సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

## కాంక్రీట్ నిర్మాణాలు ముందే దెబ్బతినడం ఆందోళనకరం

### స్ట్రక్చర్ రిపేర్, రెట్రోఫిటింగ్ సెమినార్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ప్రస్తుత రోజుల్లో భారీ వ్యయంతో నిర్మిస్తున్న వంతెనలు, కాలువలు, ప్రాజెక్టులు, ఇతర కాంక్రీటు నిర్మాణాలు ఆశించిన జీవితకాలం కంటే ముందే దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నేటి పరిస్థితుల్లో రిపేర్, రిట్రో పిట్టింగ్ అనేది కీలక విభాగంగా మారుతుందని ఆయన అన్నారు. ఒకసారి నిర్మాణం దెబ్బతింటే దాన్ని సరిచేయడానికి భారీగా ప్రజా ధనం ఖర్చు అవుతుందని, దీని వలన ఆర్థిక భారమే కాకుండా కొత్త ప్రాజెక్టులు అమలు చేయడానికి ఆలస్యానికి కారణంగా మారింది అన్నారు. విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజనీర్ల సంస్థ (ఇండియా), తెలంగాణ రాష్ట్ర కేంద్రం రిహాబ్ టెక్నాలజీస్‌తో కలిసి 2,3 తేదీలలో 'స్ట్రక్చర్స్ రిపేర్, రెట్రోఫిటింగ్'పై రెండు రోజుల ఆల్ ఇండియా సెమినార్‌ను నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి , జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు పునాదుల్లాంటివని అందుకే ప్రారంభం నుంచే సరైన డిజైన్, నాణ్యమైన నిర్మాణం, సమయానుకూల రిపేర్, రెట్రోఫిట్టింగ్ అత్యంత అవసరమన్నారు. రిపేర్, రెట్రోఫిట్టింగ్ అనేది సమస్య వచ్చిన తర్వాత మాత్రమే చేసే చర్య కాదని, సమయానికి సరైన నిర్ణయాలు తీసుకుంటే భవనాలు, వంతెనలు, కాలువలు ఎక్కువకాలం నిలుస్తాయని, ప్రమాదాలు తగ్గుతాయని, ప్రజల భద్రత మరింత పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణ కోణంలో కూడా ఇది చాలా అవసరమని సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, నాణ్యమైన నిర్మాణ విధానాలు, ముందస్తు నిర్వహణ, ఆధునిక రెట్రోఫిట్టింగ్ టెక్నాలజీలు విస్తృతంగా అమలు చేయాలని ఆయన చెప్పారు. దేశ అభివృద్ధి వేగంగా సాగాలంటే, మౌలిక సదుపాయాలు బలంగా ఉండాలని, ప్రాజెక్టులు దీర్ఘకాలం ప్రజలకు సేవలందించాలని, ప్రజాధనం సక్రమంగా, బాధ్యతతో వినియోగించబడాలని గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయు వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, రిహాబ్ టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ పి శ్రీనివాస రెడ్డి, ఎఫ్ఐఈ చైర్మన్ పి సూర్య ప్రకాష్, ప్రొఫెసర్ కె గణేశ్ బాబు, ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయిక్ బనోతు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పనిసరి అర్హత సాధించాలనే నిబంధన నుంచి మిన హాయింపు ఇవ్వాలని నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాం డ్ చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సోమవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సర్వీ స్‌లో కొనసాగా లన్నా, పదోన్నతి పొందా లన్నా టెట్ నుండి మిన హాయింపు ఇవ్వాలని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. 2024 సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ నిబంధనను తప్పని సరి చేస్తూ తీర్పుని వ్వడంతో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల సతీష్‌రెడ్డితో కలిసి పార్లమెంటు ఆవరణలోని విద్యా శాఖ మంత్రి కార్యాలయంలో కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర మంత్రి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి రెండు వేర్వేరు తీర్పులలో టెట్ నిబంధనను తప్పనిసరి చేయడంతో సమస్య ఏర్పడిందని, ఈ సమస్యను అధిగమించడానికి న్యాయపరమైన సలహా తీసుకొని కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుం టుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వారు చెప్పారని ఎమ్మెల్సీ తెలిపారు.



సోమవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## 60 సార్లు ఢిల్లీ వెళ్లి సిఎం సాధించిందేమిటో?

### మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతు కూలీలకు ఉపయోగపడే ఉపాధి హామీని కుదించారని కెటిఆర్ విమర్శించారు. ఎరువుల రాయితీ, ఆహార రాయితీతో పాటు స్వచ్ఛ భారత్‌కు నిధులు కూడా తగ్గించారని అన్నారు. వ్యాక్సిన్లు, బల్క్ డ్రగ్స్, ఫార్మాకు హైదరాబాద్ కేంద్రం అయితే.. బయో ఫార్మా తయారీకి రూ.పది వేల కోట్లు కేటాయించి తెలంగాణకు రూ.10 కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి సాధించిందేంటి..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం సున్నా అని విమర్శించారు. తెలంగాణకు బిజెపి ఇచ్చేది ఇదేనా..? అని ప్రశ్నించారు. హై స్పీడ్ రైల్ కారిడార్ కేటాయించామని గొప్పగా చెబుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భౌగోళికంగా దేశానికి మధ్యలో ఉంది..కాబట్టి కారిడార్ హైదరాబాద్ మీదుగా వెళ్లక తప్పదని తెలిపారు. తెలంగాణకు హై స్పీడ్ ట్రైన్లు ప్రత్యేకంగా ఇచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదం అని కెటిఆర్ అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులు ఎన్ని మెటీరియలైజ్ అయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో జరిగిన ఒప్పందాలు విచిత్రంగా ఉన్నాయని చెప్పారు. మహారాష్ట్రలో కేబినెట్‌లో ఉండే మంత్రి ఆ రాష్ట్ర సిఎంతో దావోస్ ఒప్పందం చేసుకున్నారని, అలాగే జూబ్లీహిల్స్‌లో ఉండే సిఎం రేవంత్‌రెడ్డి, మెగా కృష్ణారెడ్డి కూడా దావోస్‌లో ఒప్పందాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

## బి-ఫాం ఇచ్చిన అభ్యర్థులకు సహకరించి గెలిపించండి

### రెబెల్‌గా బరిలో ఉంటే 15 యేళ్లపాటు పార్టీ నుండి సస్పెన్షన్

### టిక్కెట్లు రానివారిని తగిన విధంగా గౌరవిస్తాం:

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి బి.ఫాం ఇచ్చిన వాళ్లు మాత్రమే ఎన్నికల బరిలో ఉండాలని, నామినేషన్లు వేసిన మిగిలిన బీజేపీ నాయకులంతా పార్టీ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే నామినేషన్లను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక సర్వే నివేదికల ఆధారంగా, సామాజిక పరమైన అంశాలతో మరియు పార్టీ ప్రత్యేక అంశాలతో గెలిచే అవకాశాలు ఉన్నాయన్న అభ్యర్థులకే పార్టీలోని ముఖ్యమైన వారు సామూహికంగా కలిసి టిక్కెట్లు ఖరారు చేశామని పేర్కొన్నారు. టిక్కెట్ రానివాళ్లు బాధపడడం సహజం. గత అనేక సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం గెలుపు కోసం పనిచేస్తున్న కార్యకర్తలు వారిని పార్టీ గుర్తుంచుకుంటుందని స్పష్టం చేశారు..పార్టీ కార్యకర్తల కృషి, బిజెపి పట్ల ప్రజలకున్న విశ్వాసంతోనే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పార్టీ ఘనవిజయాలను సాధించింది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కార్యకర్తల కృషితో ప్రజల మద్దతుతోనే పార్టీ మున్సిపల్ ఎన్నికలలో విజయ పరంపర కొనసాగిస్తుందన్న విశ్వాసం రాష్ట్ర పార్టీకి పూర్తిగా ఉందన్నారు.

వెంటనే నామినేషన్లను ఉపసంహరించుకుని వారి డివిజన్లు, వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాల్ని అని కోరారు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులుగా పోటీ చేస్తే మాత్రం పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని తెలిపారు. ఎవరైనా నామినేషన్లను ఉపసం హరించుకోకుండా ఇండిపెండెంట్ గా పోటీ చేయాలనుకుంటే వాళ్లను 15 ఏళ్లపాటు పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ అలాంటి వారిని తిరిగి బీజేపీలో చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



## సహజంగా మెరవండి!

పండుగల వేళ, పెళ్లి సమయాల్లో అమ్మాయిలకు మోము కాంతులీనాలంటే.. ముఖానికి మేకప్ తప్పనిసరి. అలాగని అందరికీ ఒకే తరహా నప్పదు. ముఖ్యంగా కొట్టొచ్చినట్లు కనబడే రంగులు, జిగేల్మనిపించేలా ఐడ్స్, బోల్డ్‌గా తీర్చిదిద్దిన పెదాలను కొందరు మెచ్చుకున్నారు. ఇలాంటివారికి కనీస మేకప్ చక్కని ఎంపిక. అందంగా మందంగా ఉండే ఫౌండేషన్‌కి బదులు టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకోవాలి. ముఖ్యంగా ముక్కు, చెంపలు, నుదురు వంటి చోట్ల తక్కువగా రాసి... తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. తర్వాత కళ్లకింద కన్సీలర్ కొద్దిగా రాసి అంతటా పరవాలి. ఆపై కళ్లకు సన్నగా ఐలైనర్ గీయండి. ఐషాడోగా న్యూడ్, లైట్ బ్రౌన్షేడ్లను వేస్తే కళ్లెంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చివరిగా బుగ్గలపై పీచ్ బ్లష్, పెదాలకు న్యూడ్, పింక్, కోరల్ లిప్స్టిక్ లు వేస్తే చాలు. సింపుల్గా, సహజంగా మెరిసిపోతారు.

## జుట్టు పెరిగేందుకూ మసాజ్ !

గోరు వెచ్చని నూనెతో మాడుకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదా! ఈ విధంగా మర్దన చేసుకోవడం వల్ల కేవలం మాడుకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాకుండా జుట్టు ఎదుగుదల కూడా బాగుంటుంది. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ఇతర లాభాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి తెలుసుకుందాం.



**కుదుళ్లకు పోషణ అందిస్తూ....** మాడుకు మర్దన చేసేటప్పుడు ఉపయోగించే నూనె జుట్టుకు పోషణనందించే జొజోబా లేదా బాదం వంటిదైతే మంచిది. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు ఎదుగుదల బాగుంటుంది.

**కురులు మెరిసేలా...** నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులు మిలమిలా మెరుస్తాయి. అలాగే ఒత్తుగా కూడా కనిపిస్తాయి. చివర్లు చిట్లడం వంటి సమస్యలను దూరంగా ఉంచడం లోనూ మసాజ్ ఉపయోగ పడుతుంది.



**చుండ్రు రానీయ కుండా..** తరచూ మర్దన చేసుకోవడం ద్వారా తలలో చుండ్రు చేరకుండా జాగ్రత్త పడచ్చు. శిరోజాలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ప్రకాశవంతంగా మెరుస్తుంటాయి.

**ముఖం ప్రకాశవంతంగా....** తలకు మర్దన చేస్తే ముఖం ఎందుకు ప్రకాశవంతంగా కనిస్తుందాని ఆశ్చర్యపోతున్నారా? మాడుకు మృదువుగా మర్దన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి రక్తప్రసరణ సక్రమంగా ఉంటుందని చెప్పుకున్నాం కదా! అలాగే తలకు మర్దన చేయడం వల్ల ముఖానికి కూడా రక్తప్రసరణ సవ్యంగా జరిగి మోము కాంతివంతంగా మారుతుంది.

**ఈ జాగ్రత్తలు...** మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనె ఉపయోగించి, ఆ తర్వాత సరిగా శుభ్రం చేసుకోకపోతే తల జిడ్డుగా మారడమే కాదు.. కేశ సంబంధిత సమస్యలను కూడా కొనతెచ్చు కున్నట్లు అవుతుంది. మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. 3. చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్త పడాలి. లేదంటే అవి మాడుకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది. తలకు మర్దన చేసుకున్న తర్వాత ముఖానికి కూడా కాస్త మృదువుగా మసాజ్ చేసుకుంటే మరిన్ని సత్ఫలితాలు పొందవచ్చు.

## ప్రకృతి సేద్యంలో శిక్షణ ఇస్తూ..



ప్రమాదం తర్వాత ఎదురైన మానసిక వేదన నుంచి బయటపడేందుకు ఆమె ఎంపిక మార్గం మొక్కల్ని పెంచడం. అదే అనుభవం ఆమెను సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేసేలా చేసింది. పాతికేళ్ల నుంచి ప్రకృతి సేద్యం చేస్తూనే ఆసక్తి ఉన్న వారికి శిక్షణ కూడా ఇస్తున్నారు కె.ఎస్. శ్రీజ. కొన్ని గాయాలు పైకి కనిపించకపోయినా మనిషిని మానసికంగా కుంగదీస్తుంటాయి. అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. కేరళకి చెందిన 53 ఏళ్ల శీజ. 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నబిడ్డ కాలుని కోల్పోయాడు. చికిత్స కోసం తరబడి తమిళనాడు లో ఉండాల్సి వచ్చింది. అప్పుడే ఆమెకు సేంద్రియ వ్యవసాయ నిపుణురాలు పాటియమ్మతో పరిచయం ఏర్పడింది. ఆమె దగ్గర వ్యవసాయంలో మెలకువలు నేర్చుకున్నారు శ్రీజ కేరళ తిరిగొచ్చిన తర్వాత మొక్కలను పెంచడం హాబీగా మార్చుకున్నారీమె. ప్రస్తుతం ఇంటి తోట, టెర్రస్‌తోపాటు మరో ఎకరం భూమిలో సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. ఇందుకోసం అనేక వర్క్‌షాపులూ, కోర్సులూ పూర్తిచేశారు. బెండ, వంగ, దోస, గుమ్మడి, బీట్రూట్‌తోపాటు, మిరియాలను పండిస్తున్నారు. వీటితోపాటు అరటి, పనస, జామ, యాపిల్, మల్బరీ, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ పండ్ల మొక్కల్ని కూడా పెంచుతున్నారు. సాధారణంగా సేంద్రియ వ్యవసాయంలో పశువుల ఎరువులు వాడుతుంటారు. కానీ, శీజ మాత్రం పెడకు బదులుగా కోడి పెంటను వినియోగిస్తున్నారు. వీటిలో ఉండే నత్రజని మొక్కలకి పోషణని అందించడంతోపాటు దిగుబడిని పెంచుతాయంటారీమె. డ్రిప్ ఇరిగేషన్, ప్రిసిషన్ ఫార్మింగ్ పద్ధతిలో భూమిని సాగుచేసేదాన్ని, కానీ, అడవి జంతువుల దాడులు, వాతావరణ మార్పులు పంటలకు ఎన్నో సవాళ్లను తెచ్చేవి. అయినా నేను వెనక్కి తగ్గలేదు. తెలివిగా సమస్యలను పరిష్కరించా. ఒక మహిళ ఒంటరిగా ఏం చేయగలదు అనే ప్రశ్నలకు పచ్చని ప్రకృతితో సమాధానం చెప్పా నంటారీమె. అంతటితో ఆగిపోలేదు శీజ. ఆసక్తి ఉన్న విద్యార్థులకు, గ్రామస్థులకు సాగుపాఠాలు చెబుతున్నారు. షీ గార్డెన్ పేరుతో యూట్యూబ్లో ఎంతోమంది మహిళలను వ్యవసాయం దిశగా అడుగులు వేస్తున్నారు. మన ఆరోగ్యం మన ఆహారంతో ముడిపడి ఉందని నమ్మే శీజ భవిష్యత్తులో తన సాగును మరింత విస్తరింపజేయాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

## ఆదర్శ మార్గాలు

ఆదర్శ మార్గాలు కాలాన్ని దైవంగా భావిస్తూ సాగడానికి, కుటుంబ వ్యవస్థ సవ్యంగా నడపటానికి రామాయణ, భారత, భాగవతాది ఇతిహాస పురాణాల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. రాముడు సోదరులతో సఖ్యంగా ఉన్న తీరు, తమ్ములు అన్నను గౌరవించిన తీరు. ఇవన్నీ ప్రతి తరంలోనూ పెద్దలు ముందు తాము తెలుసుకుని, అనుసరించి చిన్నలకు చెబుతుండాలి. యాగరక్షణకు శ్రీరాముణ్ణి మాత్రమే పంపమని విశ్వామిత్రుడు దశరథుణ్ణి కోరితే.. లక్ష్మణుడు స్వచ్ఛం దంగా అన్న సేవకోసం అడవులకు బయల్దేరాడు. కైకేయి ఆదేశం మేరకు శ్రీరాముడు అరణ్యా లకు వెళ్తుంటే.. సొంత సుఖాలను వదులుకొని లక్ష్మణుడు పద్నాలుగేళ్ల అన్నను వెన్నంటే ఉన్నాడు. మహా భారతంలో యక్ష ప్రశ్నల సందర్భం కూడా సోదర బంధాన్ని ప్రతిబింబిస్తుంది. యక్షమాయ వల్ల భీమార్జున నకుల సహదేవులు మరణించినప్పుడు ధర్మరాజు యక్షప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాడు. దానికి మెచ్చిన యక్షుడు మరణించిన వారిలో ఒక్కరిని మాత్రమే బతికిస్తానన్నాడు. ధర్మరాజు నకులుణ్ణి కోరుకున్నాడు. అంతులేని బలపరానరకమవంతులైన భీమార్జునులను కాదని,నకులుణ్ణే ఎందుకు కోరావని-యక్షుడు అడిగాడు. కుంతికి జన్మించిన వారిలో తాను బతికే ఉన్నానని, సవతి తల్లి మాద్రి కొడుకుని కూడా బతికించడం తన బాధ్యత కనుక అలా కోరానన్నాడు ధర్మరాజు. ఆయన మాటల్లో ధర్మం కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యత, సోదరబంధ సౌందర్యం కనిపించడంతో.. యక్షుడు సంతోషించాడు, అందరినీ బతికించాడు. ఇవి కొన్ని ఉదాహరణలే ఇలా కుటుంబ సభ్యులందరూ ఒకరి కష్టంలో ఒకరు పాలు పంచుకోవటం, సుఖసంతోషాల్లో కలిసి ఆనందించటం అనే తత్త్వం ప్రపంచ వ్యాప్తంగా పెరగాలి. కాలం విలువను తెలుసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలననదే ఆధ్యాత్మిక వేత్తల లక్ష్యం. ఈ లక్ష్య సాధనలోనే అనంతమైన ఆనందం,విశ్వశాంతి ఇమిడి ఉన్నాయి.



## అటుకుల బూరెలు



బియ్యప్పిండితో చేసే బూరెలు అందరికీ తెలుసు కానీ.. అటుకులతో చేసినవి ఎప్పుడూ తిని ఉండరు కదా! మరి అటుకుల బూరెలు రుచి చేసి చూదాం. ఎంతో సులువుగా చేసే ఈ బూరెలు మహా రుచిగా ఉంటాయి. కప్పు అటుకులకు అర కప్పు బెల్లం, చారెడు గోధుమ పిండి, పావు చెంచా యాలకుల పొడి, రెండు స్పూన్ల నెయ్యి, వేయించేందుకు నూనె అవసరమౌతాయి. ఎలా చేయాలంటే అటుకులను కచ్చాపచ్చా దంచాలి. బెల్లం కరిగించి.. అందులో అటుకులు, గోధుమ పిండి, యాలకుల పొడి, నెయ్యి వేయాలి. సన్న సెగ మీద ఉండలు కట్టకుండా కలియ తిప్పుతూ రెండు నిమిషాలయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనిచ్చి.. చిన్న ఉండలుగా చేసి బూరెలుగా ఒత్తుకునికాగిన నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయించి తీయాలి. అంతే అటుకుల చిట్టి బూరెలు తయారైపోతాయి. మీరూ చేసి చూడండి. తప్పకుండా నచ్చుతాయి.

## ప్రసవం తర్వాత ఆఫీసుకు !



ఆఫీసులో తీసుకున్న ప్రతి సెలవులు మహిళకు పూర్తయ్యాయి. విధుల్లో చేరాల్సిన సమయం దగ్గరపడటంతో ఆమెకు ఒత్తిడి మొదలైంది. ఇలా ఆఫీసు పని పునః ప్రారంభించాల్సినప్పుడు ఆందోళన పడకుండా ప్రణాళికతో అడుగు ముందుకెలా వేయాలో నిపుణులు చెబుతు న్నారు.తల్లిగా కొత్త బాధ్యత లు, వాటితోపాటు తిరిగి ఆఫీసు పని... ఈ రెండిం టినీ సమన్వయం చేయడం ఒత్తిడితో కూడుకున్నది. దీనికితోడు భావోద్వేగాలనూ బ్యాలెన్స్ చేయాలి. వీటన్నింటినీ ప్రణాళికగా దాటాలి. ముందు ఆఫీసులో విధులు సాఫీగా సాగేలా అక్కడి వాతావరణం ఉందో లేదో తెలుసుకోవాలి. జాయిన్ అవ్వాల్సిన తేదీని కన్ఫమ్ చేసుకోవడం, అలాగే ప్రసూతి సెలవు మరి కొన్నాళ్ల పాటు కొనసాగించడానికి లేదా ఇంటి నుంచే కొద్ది రోజులు విధులు నిర్వహించే అవకాశం వంటివి ఉన్నాయేమో ప్రయత్నించాలి. అలా ఇంటి నుంచి చేయడానికి ఛాయిస్ ఉంటే గడువులోపల ఓ కార్యాచరణ ప్రణాళిక వేసుకోవాలి. రోజూవారీ చేసే పనుల సమయాలను మార్చడం, ఆఫీసు విధుల కంటూ సమయాన్ని కేటాయించి చూడాలి. పాపాయి నిద్ర సమయాన్ని మార్చి చెక్ చేయాలి. తనకు ఆహారం అందించడంలో ఇతరుల సాయం తీసుకోవ డం వంటి ఏర్పాట్లు చేసుకోవాలి.

**ఆఫీసుకు వెళ్లాలంటే...** ఇంట్లో పెద్దవాళ్లుంటే పాపాయి అవసరాలు, సమయానికి అలవాటు చేయాలి. అలాకాకుండా డేకేర్ తప్పనిసరి అంటే వాటి వివరాలు సేకరించాలి. అక్కడి పరిస్థితిని నేరుగా వెళ్లి చూడాలి. విధులకు వెళ్లేలోపే రెండుమూడు రోజులు ముందుగా పాపాయిని డేకేర్‌లో ఉంచి చూడాలి. అక్కడి వాతావరణం పాపాయి కి సౌకర్యంగా ఉందోలేదో తెలుస్తుంది. బాగుం దంటే కొనసాగిం చొచ్చు. అయితే కేర్ సెంటర్లో దింపిన తర్వాత వేరొకరి సంరక్షణలో పాపాయిని వదిలినట్లుగా మనసుకు అనిపిస్తుంది.

# తెర

## ప్రేక్షకులకు కృతజ్ఞతలు : నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి



పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం "దేవగుడి". ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహా, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. "దేవగుడి" సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించింది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మా "దేవగుడి" సినిమాకు సపోర్ట్ చేసిన మీడియా మిత్రులకు, మూవీకి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెబుతున్నాం. అన్నారు.హీరో అభినవ్ శౌర్య మాట్లాడుతూ, కొన్నేళ్లుగా హీరో కావాలని నేను కన్న కలను, పడిన శ్రమను "దేవగుడి" సినిమాకు వస్తున్న స్పందనతో మర్చిపోయాను. నరసింహా తోషి మాట్లాడుతూ "దేవగుడి" సినిమాకు విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్.హీరోయిన్ అనుశ్రీ మాట్లాడుతూ , ఒక తెలుగు అమ్మాయిగా "దేవగుడి" చిత్రంతో హీరోయిన్‌గా మీ ముందుకు వచ్చాను. తిరుపతిలో మా సినిమా చూసి బయటకు వస్తుంటే శ్వేతా రెడ్డి అని ఆడియెన్స్ పిలుస్తున్నారు.నటుడు రఘుకుంచె మాట్లాడుతూ, మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చిన్న సినిమాను కూడా ఆదరిస్తామని తెలుగు ఆడియెన్స్ "దేవగుడి" విజయంతో మరోసారి ప్రూవ్ చేశారు.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్ స్టార్ట్



ఫహాద్ ఫాజిల్ తన మొదటి స్ట్రెయిట్ తెలుగు సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్‌ను ఆదివారం (ఫిబ్రవరి1)న గ్రాండ్‌గా ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో హైదరాబాద్‌లో వేసిన సెట్‌కి ఆయన అభిమానులు భారీగా వచ్చారు. వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్ తన మీద అభిమానంతో వచ్చిన ఫ్యాన్స్‌ను చూసి హ్యాపీగా ఫీలయ్యారు. అభిమానుల సందోహం మధ్యే ఆయన తన షూటింగ్‌ను ప్రారంభించారు.అలాగే షూటింగ్ నుంచి కాసేపు విరామం తీసుకుని ఫహాద్ ఫాజిల్ తన అభిమానుల్ని పలకరించారు. అభిమానుల ప్రేమ, ఉత్సాహాన్ని గుర్తించి అక్కడకు వచ్చిన వారిని హృదయపూర్వకంగా పలకరించాడు. 'ప్రేమలు' సినిమాతో పంపిణీదారుగా ఎస్ ఎస్ కార్తికేయ భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక షోయింగ్ బిజినెస్ బ్యానర్ ద్వారా నిర్మాతగా మారారు. అర్కా మీడియావర్క్స్, షోయింగ్ బిజినెస్ సంయుక్తంగా నిర్మిస్తోన్న డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'చిత్రంతో నిర్మాతగా ఎస్‌ఎస్ కార్తికేయ ఎంట్రీ ఇవ్వబోతోన్నారు. డైరెక్టర్ శశాంక్ యేలేటి ఈ మూవీని బలమైన భావోద్వేగ అంశాలు, కంటెంట్ బేస్డ్‌గా, ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. ఫహాద్ ఫాజిల్ ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆకర్షణ కానున్నారు. రిఫ్రెషింగ్, ఓ ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించేలా సినిమాని రూపొందిస్తున్నారు.

## 'హనీ' ఈవెంట్‌లో హీరో నవీన్ చంద్ర



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది.సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన హనీ ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది.హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ట్రైలర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫిలిం మేకింగ్ ప్రాసెస్ నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇది మోత్ టాక్ తో నిలబడే సినిమా. డైరెక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ,అందరికి నమస్కారం. నా ప్రతి ప్రయత్నాన్ని ఆదరిస్తున్న మీడియా మిత్రులకు ధన్యవాదాలు. ఈసారి కొత్త ప్రయత్నం చేశాను. సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ, డైరెక్టర్ కథ చెప్పినప్పుడు నచ్చింది కానీ ఎలా తీస్తారో అని అనిపించింది చెప్పిందానికంటే చాలా అద్భుతంగా తీశారు. హీరోయిన్ దివి మాట్లాడుతూ, కరుణ కుమార్‌తో పని చేయాలని నాకు ఎప్పటినుంచో ఉండేది. పలాస సినిమా సమయంలో కలిశాను. కానీ కుదరలేదు. ఆయన నుంచి కాల్ వచ్చిన వెంటనే వెళ్లాను. హీరోయిన్ దివ్యపిళ్లై మాట్లాడుతూ, డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు భయపడ్డాను. చాలా కొత్త కథ ఇది. నాకు ఈ అవకాశం ఇచ్చిన కరుణ కుమార్‌కి రవికి థాంక్యూ అని అన్నారు.

## 'దక్షిణ కాళీ' చిత్రంలో అమ్మవారిగా అర్చన

సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా ఈ నెల 6న తెలుగు, తమిళ,కన్నడలో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర సాంగ్స్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకుడు వి సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. పాటల విడుదల అనంతరం దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ 'దక్షిణ కాళీ' సినిమా పాటలు, ట్రైలర్ చాలా బాగున్నాయని అన్నారు అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, కొత్త సినిమాలు ఇండస్ట్రీకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 'దక్షిణ కాళీ' సినిమా కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది అన్నారు. దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ, అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ చిత్రాన్ని రూపొందించామని అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు ఓ కీలక పాత్రలో నటించానని తెలిపారు. ప్రేక్షకుల్ని నిరాశపరచకుండా, వాళ్లు కోరుకునే అన్ని అంశాలతో సినిమా ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు.



## 'వన్ బై ఫోర్' సక్సెస్ మీట్ లో మూవీ టీమ్

తేజస్ గుంజల్ ఫిలిమ్స్, రోహిత్ గుంజల్ ఫిలిమ్స్ బ్యానర్లపై వెంకటేష్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని హీరో, హీరోయిన్స్‌గా నటించిన యాక్షన్ క్రైమ్ డ్రామా చిత్రం "వన్ బై ఫోర్" (వన్/4). బ్లాక్ బస్టర్ బాహుబలి చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాహుబలి పళని కె ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రంజన రాజేష్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా ఈ మూవీ ని నిర్మించారు. డైరెక్టర్ బాహుబలి పళని మాట్లాడుతూ మా "వన్ బై ఫోర్" (వన్/4) సినిమాను ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ చేశారు. ప్రతి థియేటర్ లో కలెక్షన్స్ బాగున్నాయి. కంటెంట్ బాగుంటే చిన్న చిత్రానికి కూడా మంచి విజయం అందిస్తామని ప్రేక్షకులు మరోసారి ప్రూవ్ చేశారని అన్నారు ప్రొడ్యూసర్ రంజన రాజేష్ గుంజల్ మాట్లాడుతూ ఎంటర్ టైన్ మెంట్ తో పాటు మంచి మెసేజ్ ఉన్న మా"వన్ బై ఫోర్" (వన్/4) సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. స్ట్రాంగ్ కంటెంట్ ఉండటం వల్లే ఈ విజయం దక్కింది. ప్రొడ్యూసర్ రోహిత్ రాందాస్ గుంజల్ మాట్లాడుతూ తెలుగు సినిమాలపై అభిమానంతో మేము ముంబై నుంచి టాలీవుడ్ కు వచ్చాం. మా తొలి ప్రయత్నంలోనే మంచి విజయం దక్కింది. మేము ఈ చిత్రం ద్వారా ఇవ్వాలనుకున్న సందేశం ప్రేక్షకులకు రీచ్ అయ్యింది. కలెక్షన్స్ బాగున్నాయి. హీరో వెంకటేష్ పెద్దపాలెం మాట్లాడుతూ "వన్ బై ఫోర్" (వన్ /4) సినిమా కోసం మేమంతా ఎంతో కష్టపడ్డాం. బయట ఇండస్ట్రీలోని ఇతర పెద్ద సినిమాల వల్ల రిలీజ్ విషయంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ మా ప్రొడ్యూసర్స్ పట్టుదలగా ఈ అడ్డంకులన్నీ దాటుకుని సినిమాను విడుదల చేశారు.



## 'లగ్గం టైం'ని చూసి మనస్ఫూర్తిగా నవ్వుతూ వెళ్తారు

నిర్మాత
కె. హిమబిందు

రాజేష్ మేరు, నవ్య చిట్యాల జంటగా కె. యశ్వంత్ కుమార్ సమర్పణలో 20 సెంచ్యూరీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద కె. హిమ బిందు నిర్మించిన చిత్రం'లగ్గం టైం'. ఈ మూవీకి ప్రజోత్ కె వెన్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ కార్యక్రమంలో హీరో రాజేష్ మేరు మాట్లాడుతూ,'లగ్గం టైం' కథ కంటే ముందు నేను విన్న కథలన్నీ కూడా రక్తపాతంతో కూడుకున్నవే. కానీ ఈ కథ విన్న వెంటనే సినిమాని చేయాలని అనిపించింది. ఎంతో కష్టపడి ఈ మూవీని తీశాం. అని అన్నారు. నిర్మాత కె. హిమబిందు మాట్లాడుతూ, ఎన్నో కష్టాలు, ఎంతో ఖర్చు పెట్టి ని 'లగ్గం టైం' నిర్మించాం. మా సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతోన్నాం అని అన్నారు. దర్శకుడు ప్రజోత్ కె వెన్నం మాట్లాడుతూ, 'లగ్గం టైం' మూవీని టీం అంతా కలిసి చాలా బాగా తీశాం. మేమంతా కొత్త వాళ్లం. అలా అందరం కొత్త వాళ్లమే సినిమాని తీసినప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. అని అన్నారు. ఎడిటర్ విశ్వనాథ్ కూచనపల్లి మాట్లాడుతూ,నాకు ఎక్కువ గా ప్రేమ కథా చిత్రాలంటే ఇష్టం. కానీ ఇంతవరకు హారర్, థ్రిల్లర్ సినిమాలు చేశాను.'లగ్గం టైం'కి పని చేయడం ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడు పవన్ మాట్లాడుతూ,'లగ్గం టైం'లో మంచి పాటలుంటాయి. ఇందులోని మెలోడీస్ అందరినీ ఆకట్టుకుంటాయిని అన్నారు.



# మహిళల ప్రీమియర్ లీగ్.. నేడు ఎలిమినేటర్ మ్యాచ్, గుజరాత్ - ఢిల్లీ మధ్య నాకౌట్ మ్యాచ్

## గెలిచిన జట్టు 5న బెంగళూరుతో ఫైనల్ పోరు

**న్యూఢిల్లీ:** విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2026 మొదటి రౌండ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. దీంతో ఈ సీజన్ లో ప్లేఆఫ్స్ బెర్తులు ఖరారు అయ్యాయి. మొదటి రౌండ్‌లో పాల్గొన్న 5 జట్లలో, మూడు జట్లు ప్లేఆఫ్‌లోకి ప్రవేశించగా, రెండు జట్లు ఎలిమినేట్ అయ్యాయి. ప్లేఆఫ్‌లోకి ప్రవేశించిన మూడు జట్లలో ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నేరుగా ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఇక గుజరాత్ జెయింట్స్ ఎలిమినేటర్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. మిగిలి ఉన్న మరో స్థానం కోసం తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్, యూపీ వారియర్జ్ లు పోటీపడ్డాయి. ఈ చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ, యూపీపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 122 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 18.4 ఓవర్లలో ఈ లక్ష్యాన్ని ఛేదించింది. 5 వికెట్ల తేడాతో యూపీని ఓడించి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో యూపీ విజయం సాధించి ఉంటే ముంబై ప్లేఆఫ్స్‌కు చేరే అవకాశం ఉండేది. అయితే ఓడిపోవడంతో యూపీతో పాటు, ముంబై ఇండియన్స్ జట్లు ఈ సీజన్‌లో (డబ్ల్యూపీఎల్ 2026) ప్లే ఆఫ్స్‌కు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ ఇప్పుడు నాకౌట్ దశకు చేరుకున్నాయి. అంటే ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఎలిమినేటర్ మ్యాచ్ తో ఈ జట్లలో ఒకటి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించడం తప్పనిసరి. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఈ విధంగా ఈ నెల 3న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే ఫైనల్ మ్యాచ్ నిర్ణయం అవుతుంది. అంటే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ లేదా ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్‌లో పోటీ పడటం ఖాయం. దీని ప్రకారం, ఈ సంవత్సరం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో బెంగుళూరు లేదా గుజరాత్ లేదా ఢిల్లీ క్యాపిటల్స్ ఛాంపియన్లుగా నిలిచే అవకాశం ఉంది. ఈ నెల 5న వడోదరలోని బీసీఏ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

## విజేతగా హార్యానా థండర్స్
## ఢిల్లీ వారియర్స్‌పై 5-4 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ దంగల్ వారియర్స్‌తో హోరాహోరీగా జరిగిన చివరి పోరులో హార్యానా థండర్స్ ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. ఎనిమిది బౌట్‌ల తర్వాత స్కోరు 4-4తో సమంగా ఉండటంతో, చివరి మహిళల 62 కిలోల పోటీ కీలకమైంది. పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత ఇరినా కొలియాడెంకో ఒత్తిడిలో మాస్టర్‌క్లాస్‌ను అందించడంతో నాటకీయంగా 5-4 విజయంతో హార్యానా థండర్స్ విజే టైటిల్‌ను సాధించింది. ఈ పోటీల్లో 74 కిలోల పురుషుల బౌట్‌లో అపజయం లేని తురాన్ బేరామోవ్ ద్వారా ఢిల్లీ ప్రారంభంలోనే 8-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మహిళల విభాగంలో (76 కిలోల) హార్యానా స్పందించి అండర్20 వరల్డ్ ఛాంపియన్ కాజల్ ధోచాక్ యూరోపియన్ ఛాంపియన్ అనస్తాసియా అల్పీవాను 3-1తో ఓడించి టైను సమం చేసింది. పురుషుల బౌట్‌లో (65) ఢిల్లీ కెప్టెన్ సుజీత్ కల్కల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత తుమూర్ ఓచిర్ తుల్గాను 8-6 తేడాతో ఓడించడంతో జోరు మళ్లీ మారింది. హార్యానా ప్రపంచ ఛాంపియన్ అయిన యుయి సుసాకి ద్వారా సారికపై 2-2తో నిలిచింది. పురుషుల విభాగంలో (86) ఢిల్లీ జట్టు రోనక్ 4-3తో ఆధిక్యంలో నిలిపాడు.

హార్యానా పట్టు వదలకుండా నేహా సంగ్వాన్ (57) మహిళల బౌట్‌లో అంజలిని ఓడించి 4-4తో మరోసారి స్కోరును సమం చేయడంతో ఫైనల్స్ ఆశను సజీవంగా ఉంచింది. దీంతో నిర్ణయాత్మక (62) మహిళల బౌట్‌లో ఇరినా కొలియాడెంకో పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత అంజలిని ఓడించడంతో 16-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించి హార్యానా థండర్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.







## స్క్వాష్ ఓపెన్‌లో..
## ఛాంపియన్‌గా అనాహత్

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్-2026లో భారత్ టీనేజ్ అథ్లెట్ ఏస్ అనాహత్ సింగ్ ఘనమైన ఫామ్‌ను కొనసాగించి తన కెరీర్‌లో 15వ టైటిల్‌ను గెలుచుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగిన ఆమె తొలి పిఎస్ఎ స్క్వాష్ టూర్ టోర్నమెంట్‌ను గెలుచుకుని ఛాంపియన్‌గా నిలిచింది. అంతకుముందు ఆమె 14 పిఎస్ఎ ఛాలెంజర్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ టీనేజర్ ఇంగ్లాండ్‌కు చెందిన టాప్ సీడ్ మరియు ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి జార్జినా కెన్నెడ్డీని 12-10, 11-5, 11-7 తేడాతో ఓడించింది. 17 ఏళ్ల ఆమె ఇప్పుడు పిఎస్ఎ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని టాప్ 20లో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. మహిళల సింగిల్స్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలైన ఆసియా క్రీడాకారిణి, మరియు మూడవ భారతీయురాలిగా నిలిచింది. అనాహత్ ఇక్కడ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ప్రదర్శన కొనసాగించి ప్రపంచ టైటిల్‌ను గెలుచుకునే ముందు ఉన్నత ర్యాంక్ ఉన్న ప్రత్యర్థులపై మూడు విజయాలు సాధించింది. ఆమె తదుపరి వారం చికాగోలో జరిగే విండీ సిటీ ఓపెన్ 2026 యొక్క పిఎస్ఎ ప్లాటినం ఈవెంట్‌లో కఠినమైన పరీక్షను ఎదుర్కొనబోతోంది.

## టాటా స్టీల్ చెస్.. కీమర్‌తో గుకేష్ డ్రా




**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026లో భారతదేశపు అగ్రశ్రేణి గ్రాండ్ మాస్టర్ల దారుణమైన ప్రదర్శన ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న నలుగురు గ్రాండ్ మాస్టర్లలో ఒక్కరు కూడా టాప్ 8 లో చోటు దక్కించుకోలేకపోయారు. చివరి రోజు జరిగిన మ్యాచ్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ తన ప్రత్యర్థి విన్సెంట్ కీమర్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. గుకేష్ 13 ఆటలలో 3 విజయాలు, 3 ఓటములు, 7 డ్రాలతో 6.5 పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. చివరి మ్యాచ్ రోజున, గుకేష్ కఠినమైన ఆట నుండి బయటపడ్డాడు. తెల్లటి పావులతో జర్మనీకి చెందిన కీమర్‌తో జరిగిన మ్యాచ్‌లో 57మూవ్‌ల డ్రాను ముగించాడు. మరోపక్క చివరి రోజున ఎరిగైసి అర్జున్ పేలవమైన ప్రదర్శన కొనసాగింది, అతను తన చివరి గేమ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసాటోరోవ్‌తో జరిగిన మరో ఓటమిని ఎదుర్కొన్నాడు. తన టోర్నమెంట్‌ను అర్జున్ కేవలం 4.5/13 పాయింట్లతో రెండవ చివరి స్థానంలో ముగించాడు. దీంతో ఇప్పుడు లైవ్ క్లాసికల్ రేటింగ్‌లలో ప్రపంచ టాప్ 10 నుండి దిగజారిపోయాడు. ఇక మరో గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదంబరం కూడా చివరి రౌండ్‌లో స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్ చేతిలో ఓటమితో 4.5/13 పాయింట్లతో టోర్నమెంట్‌ను ముగించాడు. అలాగే డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానందా రమేష్ బాబు డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డాన్ వాన్ ఫారెస్ట్ తో జరిగిన మ్యాచ్ లో డ్రాగా ముగిసి 5.5/13 పాయింట్లతో 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



## జాతీయ షూటింగ్ పంజాబ్ క్లీన్ స్వీప్

న్యూఢిల్లీ: నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్స్‌లో జరుగుతున్న షాట్‌గన్ 1, 2లో హర్విరాజ్ సింగ్, హరజీజ్ సింగ్ అత్వాల్, గుర్ఫతే సింగ్ సంధు వరుసగా మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకోవడంతో జూనియర్ పురుషుల స్కీట్ టి2 ఫైనల్‌లో పంజాబ్ షూటర్లు పోడియంను క్లీన్ స్వీప్ చేశారు. ట్రయల్స్ 2 ఫైనల్‌లో గెలవడానికి ఒక పాయింట్ అవసరం కావడంతో అనంత్‌జీత్ సింగ్ నరుకా జ్యోతిరాదిత్య సింగ్ సిసోడియాను ఓడించింది, అయితే యశస్వి రాథోడ్ మహిళల ట్రయల్స్ 2లో కేవలం ఒక షాట్ మాత్రమే మిస్ చేసుకుని అగ్రస్థానాన్ని దక్కించుకుంది. హోరాహోరీగా జరిగిన ఫైనల్లో, 120 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచిన అనంత్ 36 షాట్‌లు కొట్టగా, జ్యోతిరాదిత్య కూడా 34వ లక్ష్యం వరకు పరిపూర్ణ స్కోరును కొనసాగించాడు. కానీ 35 హిట్‌లతో ఫైనల్స్‌ను ముగించడానికి తన చివరి షాట్‌ను మిస్ చేశాడు. అభయ్ సింగ్ సెఖోన్ 30 హిట్‌లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. మహిళల ఫైనల్లో యశస్వి రాథోడ్ కేవలం ఒక లక్ష్యాన్ని మాత్రమే కోల్పోయి 35 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. పరినాజ్ 33 హిట్స్‌తో ముగించగా, ఒలింపియన్ మహేశ్వరి చౌహాన్ 29 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. ట్రయల్స్ 1లో 121 స్కోరుతో పరినాజ్ అగ్రస్థానంలో ఫైనల్‌కు అర్హత సాధించగా, 119 స్కోరుతో గణేమత్ సెఖోన్ తర్వాతి స్థానంలో నిలిచింది. యశస్వి రాథోడ్ 117 స్కోరుతో మూడవ స్థానంలోనూ, దర్శన రాథోడ్ 116 స్కోరుతో నాల్గవ స్థానంలోనూ, రైజా ధిల్లాన్ మరియు మహేశ్వరి చౌహాన్ 115 స్కోరుతో ఐదు మరియు ఆరు స్థానాల్లోనూ నిలిచారు.

---

# వాణిజ్యం




## మారుతిసుజుకి ఆల్‌టైమ్ రికార్డు సేల్స్!

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** మారుతిసుజుకి ఇండియా జనవరి నెల అమ్మకాలు 12శాతంపెరిగాయి. దేశీయంగా డిమాండ్ తగ్గినా ఎగుమతులు పెరిగాయి. దేశంలోని చిన్నకార్ల తయారీ దిగ్గజంగా ఉన్న మారుతి జనవరి నెలలో 2,36,963 యూనిట్లు విక్రయించింది. ఎగుమతులు కూడా 88శాతంపెరిగాయి. ఆల్‌టైమ్ రికార్డుస్థాయికి పెరిగాయి. 51,020యూనిట్లుగా ఉన్నాయి. దేశీయంగా అమ్మకాలు తేలికపాటి వాణిజ్య వాహనాలు స్వల్ప వృద్ధితో ఉన్నాయి. 0.4శాతంపెరిగి 1,85,943 యూనిట్లు విక్రయిస్తే ప్యాసింజర్ వాహణాలు 0.5శాతంపెరిగి 1,74,529 యూనిట్లకు చేరాయి. జిఎస్టీ రేట్ కట్స్ చిన్నకార్ల విక్రయాలకు మరింత మద్దతునిచ్చాయి. ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తిదారులు అంటే ఒఇఎంలు కూడా స్వల్పంగా 2శాతంపెరిగి 7643యూనిట్లకు చేరాయి. ఏప్రిల్‌నుంచి జనవరి వరకూ మొత్తం అమ్మకాలు 8శాతంపెరిగి 19.8లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇయర్‌టు డేట్ దేశీయ అమ్మకాలు కూడా 15.28 లక్షలయూనిట్లుగా ఉన్నాయని, ఎగుమతులు 3.6 లక్షలయూనిట్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే డిసెంబరు త్రైమాసికంలోకూడా భారీ ఆదాయం సాధించింది. 29శాతం రాబడులు పెరిగి రూ.49,892 కోట్లకు చేరాయి. నాలుగుశాతం నికరలాభాలుపెరిగి రూ.3794 కోట్లు ఆర్జించింది. మారుతిషేర్లు09.7శాతం దిగువన అంటే రూ.14,100గా ట్రేడ్ అయ్యాయి. వార్షికపద్ధతిలోచూస్తే కంపెనీ స్టాక్ సెన్సెక్స్‌లో ఏడుశాతం ఎగువన ఉంది.

## వారం ప్రారంభంలో లాభాల బోణీ
### సెన్సెక్స్, నిఫ్టీ కంపెనీల షేర్లు పైపైకి..

**ముంబయి,ఫిబ్రవరి 2:** దేశీయ స్టాక్ సూచీలు వారం ప్రారంభంలో సానుకూలంగా ముగిసాయి. సెన్సెక్స్ 902.12 పాయింట్లుపెరిగి 81,625.06వద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 262.95 పాయింట్లుపెరిగి 25,088.40 పాయింట్లవద్దస్థిరపడింది. ప్రారంభంలో కొంతమేర అమ్మకాలు ఉన్నప్పటికీ ఇంట్రాడే తర్వాతనుంచి షేర్లు లాభపడ్డాయి. బడ్జెట్ రోజున నిఫ్టీసెన్సెక్స్‌రెండూ కూడా 10 లక్షలకోట్లమేర టర్నోవర్ నష్టపోయిన సంగతి తెలిసిందే. నిఫ్టీ50 సూచీలో టాటామోటార్స్ ప్యాసింజర్ వాహనాలు, ఆదానిపోర్టులు సెజ్, ఆసియన్ పేయింట్స్ రెండుశాతంమేర పెరిగాయి. శ్రీరామ్‌ఫైనాన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ భారీగా నష్టపోయాయి. మూడుశాతం వరకూ నష్టాలు ఎదుర్కొన్నాయి. మార్కెట్లపరంగాచూస్తే కొంతమేర ప్రతికూలతే కనిపించింది. 1282 షేర్లు పెరిగితే 2116 షేర్లుక్షీణించాయి. 142 స్థిరంగా కొనసాగాయి. ఎంపికచేసిన రంగాల్లోనే కొనుగోళ్లుపెరిగినట్లు మార్కెట్ నిపుణులు చెపుతున్నారు.



బ్రెంట్‌ముడిచమురు 4.34శాతం క్షీణించి బ్యారెల్‌కు 66.31 డాలర్లుగా నడిచింది. ద్రవ్యోల్బణ ఒత్తిడులు సడలి భారత వాణిజ్యం సమతూకంలోకి వచ్చింది. ఈక్విటీ మార్కెట్లకు కొంత ఉపశమనం కలిగింది. ఉత్పత్తిరంగం, గ్లోబల్ డేటా సెంటర్స్ వ్యవసాయం, పర్యాటకరంగాలకు బడ్జెట్‌లోకేటాయింపులు మార్కెట్లకు బలాన్నిచ్చాయి. డాలరుతో రూపాయి కొంతమేర పటిష్టం అయింది. 37 పైసలు పెరిగి 91.56గా నడిచింది. ముడిచమురు ధరలు తగ్గడం సహజంగానే బడ్జెట్‌ప్రభావం ఉంటుందని అందరికీ తెలిసిందే. ఇక కంపెనీలపరంగా యాక్సిస్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, టిసిఎస్, ట్రెంట్ టైటాన్‌షేర్లు నష్టాల్లోకి వెళ్లాయి. ఇక పసిడిధరలపరంగాచూస్తే అంతర్జాతీయ మార్కెట్‌లోఔన్స్ బంగారం 4680 డాలర్లవద్దట్రేడ్ అవుతోంది. ఇక బిఎస్ఇలో అయితే 2039 షేర్లు పెరిగితే 2220 షేర్లు క్షీణించగా 169 కంపెనీలుమాత్రం స్థిరంగాకొనసాగాయి.




## ఒరాకిల్‌కు కృత్రిమమేధ షాక్
### 30 వేలమంది సిబ్బందిపై పడుతున్న వేటు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ఐటీసహా వివిధ రంగాల్లో ఉద్యోగాల తొలగింపునకు కృత్రిమమేథ ప్రధాన కారణంగా మారుతోంది. ఇప్పుడు ఏఐ ప్రభావంతో మరో సంస్థ కూడా భారీ సంఖ్యలో సిబ్బందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఒరాకిల్ సంస్థ ఏకంగా 30వేల వరకు ఉద్యోగాల్ని తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి కారణం ఓపెన్‌ఏఐ. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ టీడీ కోవెన్ ప్రకారం ఓపెన్‌ఏఐ సంస్థతో ఒరాకిల్ 300 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌తో భారీ స్థాయిలో ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. కంపెనీ ఖర్చులు తగ్గించుకునేందుకు ఏకంగా 20వేలనుంచి 30వేల మంది సిబ్బందిని తొలగించేందు ఒరాకిల్ రెడీ అవుతోంది. దీనివల్ల కంపెనీకి 8 బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు మిగులుతుంది. ఓపెన్‌ఏఐతో ఒప్పందమే ఒరాకిల్ సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. గడిచిన రెండు నెలల్లోనే 58 బిలియన్ డాలర్లు ఒరాకిల్ కోల్పోయింది.




## వెండి బంగారం ధరల్లో భారీ పతనం

**ముంబయి,ఫిబ్రవరి 2:** బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత, గత నాలుగైదు రోజులుగా పసిడి, వెండి ధరలు నేలచూపులుచూస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ ఒక్కరోజే బంగారం ధర రికార్డు స్థాయిలో పడిపోయింది. ఈ పరిణామం పెట్టుబడిదారులకు షాక్ ఇవ్వగా, కొనుగోలుదారులకు ఊరటనిచ్చింది. సోమవారం హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.9,050 తగ్గి రూ.1,51,530కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.8,300 తగ్గి రూ.1,38,900 వద్ద ట్రేడ్ అయింది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,680గా నమోదైంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా కొనసాగుతున్నాయి. కిలో వెండి ధర ముందురోజుతో పోలిస్తే ఏకంగా రూ.50,000 పతనమైంది. ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ మార్కెట్లలో కిలో వెండి ధర రూ.3 లక్షల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కిలో వెండి ధర రూ.4.25 లక్షల వరకు చేరడం గమనార్హం. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరడంతో పెట్టుబడిదారులు భారీ ఎత్తున లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పతనం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తుండగా, కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిస్తోంది.

## ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 49%కి విదేశీ పెట్టుబడులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో విదేశీ ఇన్వెస్టర్లు 49శాతంవాటా వరకూ పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం నిబంధనలు సడలిస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్థికవృద్ధిని సాధించాలంటే ప్రైవేటురంగ భాగస్వామ్యం తప్పనిసరి అని పెట్టుబడుల ఉపసంహరణశాఖ చెపుతోంది. రుణం జిడిపి నిష్పతిని 56 శాతం నుంచి 150శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని ఫెడరల్‌బ్యాంకింగ్ కార్యదర్శి నాగరాజు వెల్లడించారు. భారతీయ స్టేట్‌బ్యాంకు, మరో ఇతర 11 ప్రభుత్వ బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడుల వాటా 20శాతానికి మాత్రమే కట్టడి అయి ఉంది. ఈ సారి బడ్జెట్‌కు ముందునుంచే ప్రభుత్వం వ్యూహాత్మక నియంత్రణ పట్టును పెంచుకోవాలనిచూస్తోంది. ప్రైవేటురంగ బ్యాంకుల్లో 74శాతం విదేశీపెట్టుబడులకు ఉన్న అనుమతులు ప్రభుత్వరంగంలో మాత్రం 20శాతానికే కట్టుబడి ఉన్నాయి.

## పెట్టుబడుల మళ్లింపుతో వెండి ఇటిఎఫ్‌ల భారీ పతనం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** బంగారంధరలతోపాటే వెండికి కూడా బడ్జెట్‌షాక్ తగిలింది. అంతర్జాతీయ మార్కెట్లలో భారీ పతనం దేశీయ మార్కెట్‌పైనా చూపింది. వెండి ఇటిఎఫ్‌లపై కూడా ఈప్రభావం కనిపిస్తోంది. గతవారాంతానికి 20శాతం పతనం అయితే ఒక్క సోమవారం రోజే 19శాతం పతనం అయింది. రిటైల్ ఇన్వెస్టర్లకు కాసులు కురిపించిన సిల్వర్ ఈటీఎఫ్‌లు పడిపోవడంతో ఇన్వెస్టర్లు కలవరం వ్యక్తంచేస్తున్నారు. భారత ఎంసిఎక్స్‌లో కిలో వెండి మార్చి కాంట్రాక్టుధర రూ.2.27 లక్షలుగా ఉంది. గతవారంలో ఈ ధర రూ.4,20,048గా కొనసాగింది. గరిష్టాలతోపోలిస్తే కిలో వెండి సుమారురూ.2 లక్షలమేర పతనం అయింది. ఈప్రభావంతోనే వెండి ఈటిఎఫ్‌లు కూడా క్షీణించాయి. టాటా సిల్వర్ ఈటిఎఫ్ 19.15, ఎస్‌బిఐ సిల్వర్ ఈటిఎఫ్ 14.98, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ ఇటిఎఫ్ 14.6 శాతం చొప్పున క్షీణించాయి. గ్రోసిల్వర్ ఈటిఎఫ్ 16.17, జెరోధా సిల్వర్ ఈటిఎఫ్ 15.41, నిప్పన్ ఇండియా ఈటిఎఫ్ 15.69, ఐసిఐసిఐప్రుడెన్షియల్ సిల్వర్ ఈటిఎఫ్ 14.05శాతం, కోటక్ సిల్వర్ ఈటిఎఫ్ 17.38శాతం హెచ్‌డిఎఫ్‌సి సిల్వర్ ఈటిఎఫ్ 16.65శాతం మోతీలాల్ ఓస్వాల్ సిల్వర్ ఈటిఎఫ్ 16.02శాతం చొప్పున పతనం అయ్యాయి. డాలర్ విలువలు బలపడటం, ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు బులియన్‌రంగంనుంచి కరెన్సీ బాండ్ల మార్కెట్‌వైపు పెట్టుబడులను మళ్లించడంతో పసిడి, వెండిధరల్లో భారీ క్షీణత కనిపించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.